అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది మావోయిస్టులు లొంగుబాటు
మోదీ తన సమయంలో సగం దేశం వెలుపలే...
'సర్' అంటే దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు చేయడమే : ఒవైసీ
05

సంపుటి 09, సంచిక: 15 | గురువారం | 11-12-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఉస్మానియా వర్సిటీకి రూ.1000 కోట్లు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరం. రాష్ట్రంలో 25 వేల ప్రభుత్వ పాఠశాలలో 1.25 లక్షల మంది ఉపాధ్యాయులు ఉండగా, 18 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. అదే 11 వేల ప్రైవేట్ పాఠశాలుంటే వాటిలో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎంఎ, పిహెచ్‌డి చదువుకున్న ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉండడం ఆందోళనకరం.
– సిఎం రేవంత్‌రెడ్డి

## నాణ్యమైన సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యనందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం




● ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్‌పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలకు క్యూర్ కోడ్ ● విద్యతోనే జీవితాల్లో మార్పులు, వెలుగులు, ఆత్మగౌరవం ● ఉస్మానియా విశ్వవిద్యాలయ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన ● రాజకీయ పార్టీల ఉచ్చులో విద్యార్థులు పడొద్దని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్య ఒక్కటే జీవితాల్లో మార్పును, వెలుగులు తెస్తుంది. విద్య ఒక్కటే వెనకబాటు తనం నుంచి బయటికి తీసుకువచ్చి ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. విద్య ఒక్కటే మన తల్లిదండ్రుల కళ్లలో ఆనందాల వెలుగులను నింపుతుంది. ఆలాంటి నాణ్యమైన, సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం'' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒయు అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు చేస్తూ తరువాయి 2లో

## కంపెనీల ప్రోత్సాహానికి స్టార్టప్ ఫండ్


రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు ● నిధులు సద్వినియోగం చేసుకొని వన్ బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలి ● సిఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం ● టి-హబ్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్




స్టార్టప్ కంపెనీను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో స్టార్టప్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని స్టార్టప్ కంపెనీలను ప్రారంభించడమే కాకుండా కనీసం 1 బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ టీహబ్‌లో ఏర్పాటు చేసిన తరువాయి 2లో

## గ్రామ పంచాయతీ ఎన్నికలు




# నేడు తొలి పోరు



### సర్పంచ్ ఎన్నిక వెన్నంటే ఉప సర్పంచ్ కూడా..

● 3,834 సర్పంచ్, 27,628 వార్డులకు పోలింగ్ ● ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ● రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు ● ప్రక్రియలో పాల్గొననున్న 56,19,430 మంది ఓటర్లు ● 18 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. కౌంటింగ్ పూర్తి కాగానే వార్డు సభ్యుల నుంచి ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ఓట్లు జరిగే గ్రామాల్లో 'లేబర్' హాలిడే ప్రకటించింది. రాష్ట్రంలోని 3834 సర్పంచ్, 27,628 వార్డు తరువాయి 2లో

## ఓట్ చోరీపై చర్చకు రండి

హోంమంత్రి అమిత్‌షాకు రాహుల్‌గాంధీ సవాల్



**న్యూఢిల్లీ:** ఓట్ చోరీ చేసేందుకు ఎన్నికల సంఘంతో బిజెపి కుమ్మక్కైందన్న విషయంపై తనతో చర్చకు రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాకు సవాలు విసిరారు. లోక్సభలో బుధవారం రాహుల్‌గాంధీ–అమిత్ షా మధ్య సవాళ్ళు ప్రతి సవాళ్ళతో తీవ్ర వాగ్వాదం జరిగింది. అమిత్ షా ఆత్మరక్షణలో పడ్డారని, భయపడి, తరువాయి 2లో

# ఓట్ చోరీ వాళ్లే చేశారు

● నెహ్రూ, ఇందిరా, సోనియాగాంధీలపై లోక్‌సభలో అమిత్ షా వ్యాఖ్యలు ● దేశంలోకి అక్రమంగా వచ్చినవారిని ఓటర్ల జాబితాలో కొనసాగించేందుకే ఈ లొల్లి అన్న హోంమంత్రి ● వాకౌట్ చేసిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ:** సరిహద్దుల్లోంచి అక్రమంగా దేశంలోకి వచ్చిన చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించడం కోసమే 'సర్' (ఓటర్ జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ) అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కూడా ఓట్ చోరీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్సభలో బుధవారం కూడా కొనసాగిన చర్చ మధ్యలో హోంమంత్రి జోక్యం చేసుకుంటూ, అవినీతి కార్యకలాపాల ద్వారా ఇంకెంతోకాలం తాము ఎన్నికల్లో విజయం సాధించలేమని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయని విమర్శించారు. అసలు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ పరాజయానికి కారణం ఆ పార్టీ నాయకత్వమే తప్ప ఇవిఎంలు లేదా ఓట్‌చోరీ సమస్యలు కాదని వ్యంగ్య విమర్శలు చేశారు.
''అక్రమంగా దేశంలోకి వచ్చిన చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించడానికే ప్రతిపక్షాలు ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణను ఒక సమస్యగా తెచ్చి పార్లమెంటులో ప్రస్తావిస్తున్నాయని, తరువాయి 2లో

## దీపావళికి యునెస్కో గుర్తింపు

కల్చరల్ హెరిటేజ్ జాబితాలో చోటు



**న్యూఢిల్లీ :** దివ్వెల పండుగ దీపావళికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో దీపావళి పండుగ చేరింది. ఢిల్లీ ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రకటన చేశారు. దీనిపై హర్షం వ్యక్తం తరువాయి 12లో




## చీకటి ఒప్పందాలు.. అంకెల గారడీలు

● గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలతో ప్రజలకు పనికొచ్చే పనులేవీ లేవు ● రెండేళ్లలో ఎన్నికోట్ల పెట్టుబడులొచ్చాయ్, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి ● ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్లోబల్ సమ్మిట్ లో జరిగిన ఎంఒయుల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి సిఎం తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు తరువాయి 12లో

విత్తన చట్టంలో మార్పులు చేయండి
ముసాయిదా సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 'సక్సెస్ జోష్'
నాడు దావోస్‌లో రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు ..



03

## 220 ఇండిగో విమానాలు రద్దు




సంస్థ సిఇఒకు సమన్లు జారీ చేసిన డిజిసిఎ

**ముంబయి :** 'ఇండిగో'లో సంక్షోభం కొనసాగుతూనే ఉంది. ఎయిర్‌లైన్స్‌లో గత కొంత కాలంగా నెలకొన్న అంతరాయం సమసిపోయిందని, కార్యకలాపాలు తిరిగి గాడిలో పడ్డాయని సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ చెప్పినప్పటికీ బుధవారం కూడా పలు విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబయితో సహా మూడు ప్రధాన విమానాశ్రయాలలో దాదాపు 220 విమానాలను రద్దు చేసింది. ఢిల్లీ విమానాశ్రయంలో 137 విమానాలను, ముంబయి విమానాశ్రయంలో 21 సేవలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. ఇండిగో బెంగళూరు విమానాశ్రయంలో 61 విమానాలను రద్దు చేసిందని, వాటిలో 35 రాకపోకలు, 26 నిష్క్రమణలు తరువాయి 12లో

## మత ఘర్షణలకు బిజెపి కుట్ర

తమిళనాట రాజకీయ లబ్ధి కోసమే 'దీపం' వివాదం: వామపక్షాల విమర్శ

**న్యూఢిల్లీ:** తమిళనాడులో రాజకీయ లబ్ధి కోసం మత ఘర్షణలకు బిజెపి, హిందూత్వ శక్తులు కుట్ర చేస్తున్నట్లు వామపక్షాలు విమర్శించాయి. మదురై జిల్లాలోని తిరుప్పరంకుంద్రం కొండపై ప్రార్థనా సంస్థల చుట్టూ వివాదాన్ని సృష్టిస్తున్నాయని దుయ్యబట్టాయి. ప్రజల జీవనోపాధి, రాజ్యాంగ హక్కులపై మోదీ ప్రభుత్వ దాడుల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్న సంఘ్ పరివార్ మతోన్మాద రాజకీయాన్ని తిరస్కరించాలని పిలుపునిచ్చాయి. ఇందుకోసం ప్రజాస్వామ్య, లౌకిక, భావసారూప్య వర్గాలన్నీ కలిసి రావాలని కోరుతూ సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఆర్‌ఎస్‌పి, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఎ బేబి, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజ్ మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. 'తిరుప్పరంకుంద్రం కొండపై మూడు ఆలయాలు, ఒక దర్గా, జైనుల పురాతన గుహలు ఉన్నాయి. శతాబ్దాలుగా ఈ కొండ మత సామరస్యానికి చిహ్నంగా నిలిచింది. మత విశ్వాసాలు వేరైనాగానీ తరువాయి 12లో

## ట్రంప్ ఒప్పందం ఉల్లంఘన

కాంగోలో హింస

● రువాండా మద్దతుతో దూసుకెళ్తున్న ఎం-23 తిరుగుబాటుదారులు ● రెండు లక్షలమంది ప్రజలు వలస



**కిన్షాసా:** డి.ఆర్. కాంగో (డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో)లో సమస్య పరిష్కారానికి గతవారం (డిసెంబరు 4)న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఒక ఒప్పందం కుదిర్చినా ఫలితం లభించలేదు. రువాండా మద్దతుతో ఎం–23 తిరుగుబాటుదారులు ఒప్పందాన్ని ఉల్లంఘించి ముందుకు దూసుకుపోతూ జైత్రయాత్ర చేస్తున్నారు. కాంగో అధ్యక్షుడు ఫెలెక్స్ తిసెకిడి, రువాండా నాయకుడు పాల్ కగమె మధ్య ఒప్పందం జరిగినా ప్రయోజనం లేకపోయింది. అంతకుముందు జూన్‌లో కూడా ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం ప్రకారం రెండు పక్షాలు ఒక ఆర్థిక సమీకృత ఒప్పందానికి వచ్చాయి. ఖనిజ సంపదతో తులతూగే ఉవిరా ప్రాతంపై తిరుగుబాటు దారులు తాజా దాడులు చేస్తుంటే కాంగో సైన్యం పారిపోతోంది. ఎం 23 హింసాకాండ, దాడులు భరించలేక తూర్పు కాంగో నుండి ఇటీవల 2,00,000 మంది ప్రజలు ఇళ్ళువదలి పారిపోయారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతంలో ఉన్న తెగల సమస్య ఎం–23 (మార్చ్ 23 ఉద్యమం) రూపంలో తూర్పు కాంగో దక్షిణ కివూ రాష్ట్రంలో చిచ్చురేపింది. సరిహద్దుల్లో ఉన్న రువాండా ప్రభుత్వం మద్దతుతో ఎం 23 తిరుగుబాటు దారులు తూర్పు కాంగోలో కొత్త ప్రాంతాలను ఆక్రమిస్తున్నారు. హింసాకాండ సృష్టిస్తున్నారు. ఈ కారణంగా ఉవిరా ప్రాంతంలో తిరుగుబాటుదారులు ముందుకు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## హైతీలో ఘర్షణలు :49 మంది మృతి

**శాన్‌జుయాన్:** హైతీ రాజధాని పోర్ట్ ఔప్రిన్స్‌లో ముఠాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణలో కడపటి వార్తలు అందేసరికి 49 మంది మరణించారు. ఒక బలమైన ముఠా కూటమి సభ్యులమధ్య అంతర్గతంగా ఈ ఘర్షణలు జరిగాయి. మరణించినవారిలో 10 మంది పిల్లలు కూడా ఉన్నారని స్థానిక మానవహక్కుల గ్రూపు ప్రకటించింది. పోర్ట్ ఔ ప్రిన్స్‌లోని బెల్‌–ఎయిర్ మురికివాడలో ఉన్న ఒక ముఠాలో అత్యున్నతస్థాయి ర్యాకింగ్ సభ్యుడు డేడే ఈ ఘర్షణల్లో హతుడయ్యాడు. ఆయనను తల నరికి చంపారు. ఈ ఘర్షణల్లో బలమైన ముఠా నాయకుడు కెంపెస్ సానన్, ఒక మాజీ పోలీసు ఉన్నతాధికారి కూడా తీవ్రంగా గాయపడ్డారని శాంతి–అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. హైతీ రాజధాని నగరంలోని 90 శాతం ప్రాంతం ఈ ముఠాల చేతుల్లోనే ఉంటుంది. దీంతో ఈ ఘర్షణలు నగరం అంతటా వ్యాపిస్తాయని భావిస్తున్నారు. హైతీ రాజధానిలో విస్తారంగా ఉన్న ఈ ముఠాలమధ్య ఇటీవల ఒక శాంతి ఒప్పందం కుదిరింది. ఘర్షణలు పడకూడదని సామరస్యంగా జీవించాలని వారు తీర్మానించుకున్నారు. అందువల్ల ఈ ఘర్షణలు జరగడానికి అసలు ఆస్కారమే లేదు. కానీ భారీ ఎత్తున హింసాకాండ జరిగింది.

## బోల్సెనారోకు జైలుశిక్ష తగ్గిస్తూ బ్రెజిల్ దిగువసభ తీర్మానం



**బ్రసిలియా:** బ్రెజిల్ దేశ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో (70) కు విధించిన జైలు శిక్షను రెండు సంవత్సరాలకే పరిమితం చేస్తూ ఆ దేశ పార్లమెంటు దిగువసభ తీర్మానం చేసింది. ఇక ఈ బిల్లును ఎగువసభ సెనేట్ ఆమోదించాల్సి ఉంది. ఎగువసభలో కూడా బిల్లు ఆమోదం పొందితే ఆయన 20 సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాల్సిన అవసరం ఉండదు. బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆయనకు 27 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత నెల చివరివారం నుండీ ఆయన జైలుశిక్ష అనుభవించడం ప్రారంభించారు. కానీ ఇంతలోనే ఆ దేశ పార్లమెంటు జోక్యం చేసుకుని ఆయనకు జీవితకాల శిక్షను గణనీయంగా తగ్గిస్తూ దిగువసభ ఒక బిల్లును ఆమోదించింది. విముక్తి కలగజేసి రెండేళ్ళకే శిక్షను పరిమితం చేసింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేనందువల్ల శిక్షను ఇంటికే పరిమితం చేయాలని, గృహనిర్బంధం చేయాలని బోల్సెనారో అనుచరులు, ఆయన తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టును కోరారు. కొద్దికాలం అదేవిధంగా ఆయన గృహనిర్బంధంలో ఉన్నారు. 2022లో బ్రెజిల్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా గెలిచిన లూయిస్ ఇనాసియో లులా డసిల్వాను బాధ్యతలు చేపట్టనీయకుండా బోల్సెనారో కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలు రుజువు కావడంతో సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబరులో ఆయనను నేరస్థుడుగా నిర్ధారించింది. తీవ్రమైన శిక్ష విధించింది. మితవాద లిబరల్ పార్టీ నాయకుడు బోల్సెనారో 2019 జనవరి నుండి 2023 జనవరి వరకూ బ్రెజిల్ 38వ దేశాధ్యక్షుడుగా పనిచేశారు. ఎన్నికల్లో గెలిచిన లులా డసిల్వాను పదవీ బాధ్యతలు చేపట్టనీయకుండా తానే అధికారంలో కొనసాగేవిధంగా ఆయన కుట్రకు పాల్పడ్డి అల్లర్లు రెచ్చగొట్టారు.

## చైనాలో అగ్ని ప్రమాదం : 12 మంది ఆహుతి



**శాంటౌ:** దక్షిణ చైనాలోని శాంటౌ ప్రాంతంలో ఉన్న నివాసిత భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో 12 మంది సజీవదహనమయ్యారు. గ్యాంగ్ డాంగ్ రాష్ట్రం శాంటౌలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ అగ్ని ప్రమా దం సంభవించింది. నాలుగు అంతస్తుల్లో ఉన్న ఈ రీ–ఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ ని ర్మాణంలో 1600 అడుగుల విస్తీర్ణంలో 40 నిమిషాలసేపు ఈ మంటలు భయభ్రాంతులు సృష్టించి 12 మందిని బలితీసుకున్నాయి. ఆ తర్వాత ఈ మంటలను ప్రకృతి విపత్తు నివారణ బృందాలు నియంత్రించాయి. గతనెల చివరి వారంలో హాంగ్‌కాంగ్‌లో ఏడు ఆకాశహర్మ్యాలు దగ్ధమైన ప్రపంచాన్ని దిగ్భ్రాంతి పరచిన ప్రమాదం తర్వాత చైనాలో జరిగిన మరో అగ్ని ప్రమాదం ఇదే. ఈ వరుస ఘటనలతో గ్యాంగ్ డాంగ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ప్రమాదానికి గల కారణం ఏమిటో తెలుసుకోవాలంటూ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. పోలీసులు, అత్యవసర నిర్వహణాధికారులు, క్రమశిక్షణాబృందం సిబ్బంది ఈ టాస్క్‌ఫోర్స్‌లో సభ్యులుగా ఉంటారు. ఈ నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో విద్యుత్ పరికరాలు, ఇతర విక్రయాలకు సంబంధించిన స్టోర్‌ను ఏర్పాటు చేశారని, ఈ స్టోర్ నుండే మంటలు పై అంతస్తులకు వ్యాపించాయని ప్రాథమికం సమాచారంలో వెల్లడైంది.

## మీడియాకు ప్రాణాంతక సంవత్సరం – 2025

# 67 మంది జర్నలిస్టులు మృతి

- ప్రమాదకర దేశాలలో మెక్సికోకు రెండోస్థానం
- 503 మంది నిర్బంధం, 135 మంది అదృశ్యం
- ఉక్రేన్,హోండురాస్‌లలో ఇద్దరు విదేశీ జర్నలిస్టులు మృతి

**న్యూయార్క్ :** ప్రపంచవ్యాప్తంగా 2025వ సంవత్సరంలో డిసెంబరు ఒకటో తేదీ నాటికి 67 మంది జర్నలిస్టులు మ రణించారు. అనేకమంది జర్నలిస్టులు అదృ శ్యం కాగా 503 మంది జర్నలిస్టులు ప్రపంచవ్యాప్తంగా జైళ్ల్లో ఉన్నారు. ప్రస్తుతం 37 దేశాలలో 135 మంది జర్నలిస్టులు జాడ తెలియకుండా పోయారు. 20 మంది జర్నలిస్టులు ఉగ్రవాద ముఠాలవద్ద బందీలుగా ఉన్నారు. హౌతీ ఉగ్రవాదులవద్ద ఏడుగురు బందీలుగా ఉండగా, యెమెన్‌లో మిగిలినవారు బందీలుగా ఉన్నారు. ఒక్క పశ్చిమ ఆసియా, లా టిన్ అమెరికాలోనే 72 శాతం జర్నలిస్టులు అదృశ్యమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 10 దేశాలు జర్నలిస్టులకు ఈ నాటికీ కారాగారవాసాలుగా మిగిలిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా గణాంకాలు చూసినప్పుడు సిరియాలో అత్యధికసంఖ్యలో జర్నలిస్టులు జాడ తెలియకుండా పోయారు. ముఖ్యంగా సురక్షితంగా భావిస్తున్న వారి వారి మాతృదేశాల్లోనే జర్నలిస్టులకు ఎక్కువ అపాయాలు జరుగుతున్నా యి. వార్తల కవరేజీ బాధ్యతల నిర్వహణలో ఇద్దరు జర్నలిస్టులు మాత్రమే ఈ ఏడాది విదేశాలలో మరణించారు. ఉక్రేన్‌లో రష్యా చేసిన డ్రోన్‌దాడిలో ఫ్రెంచ్ ఫొటో జర్నలిస్టు ఆంటోనీ లల్లికన్ మరణించగా, సాల్వడార్ దేశానికి చెందిన చెందిన జర్నలిస్టు జేవియర్ హెర్క్యులస్ హోండూరాస్‌లో మరణించారు. మిగిలిన జర్నలిస్టులు అందరూ స్వదేశాలలోనే హత్యలకు గురయ్యారు. జర్నలిస్టులు ఈ ఏడాది ప్రమాదాల బారినపడి మరణించలేదు. హత్యలకు గురయ్యారు. వృత్తిపరంగా హత్యలకు గురయ్యారు. వార ని వెంటాడి వేటాడి చంపారు. ఆసియాలో 43.54 శాతం, యూరప్, సెంట్రల్ ఆసియాలో 23.84 శాతం, అమెరికాలో 20.48 శాతంమంది జర్నలిస్టులు నిర్బంధంలో ఉన్నారు. ''రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్'' సంస్థ ప్రాంతాల వారీగా ఈ గణాంకాలను సమకూర్చింది. పూర్వకు సోవియట్ రిపబ్లిక్‌లలో జర్నలిస్టులు నియంత పోకడలకు బలవుతున్నారు. జార్జియా,అజర్‌బైజాన్, బెలారస్‌లలో జర్నలిస్టులకు స్వేచ్ఛలేదు. బెదిరింపులు వారికి నిత్యకృత్యం.అజర్‌బైజాన్‌లో ప్రస్తుతం 25 మంది జర్నలిస్టులు జైళ్ళల్లో మగ్గుతున్నారు. ఇజ్రాయెల్‌లో 20 మంది పాలస్తీనా జర్నలిస్ట్ లు, గాజా,వెస్ట్‌బ్యాంక్‌లలో 16 మంది జర్నలిస్టులు జైళ్ళలో మగ్గిపోతున్నారు. మాలీలో 'రేడియో కోటన్‌డీ ఆన్సోం గో జర్నలిస్టు, డైరెక్టర్ సాలెక్ అగ్ జిద్దో, ప్రెజెంటర్ మౌస్త ఫా కోనే ఇద్దరూ 2023 నవంబరు నుండి గుర్తుతెలియని సాయుధ ముఠాలవద్ద బందీలుగా ఉన్నారు. ప్రపంచదేశాల్లో, వివిధ ప్రాంతాలలో జరుగుతున్న యుద్ధాలవల్ల, అవినీతి, మానవ వ్యతిరేక దాడులు, హింస,ద్వేషం ఏటేటా పెరుగుతున్న తరుణంలో జర్నలిస్టులు కేవలం మరణించడంలేదు. వారు హత్యలకు గురవుతున్నారు. జర్నలిస్టుల హత్యా ఘటనలు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ ఏడాది పశ్చిమ ఆసియా అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా జర్నలిస్టులు ఈ ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో మరణించారు. గాజా ప్రాంతం అగ్రస్థానంలో ఉండగా మెక్సికో రెండోస్థానంలో ఉంది. వీటిల్లో ప్రభుత్వాలు స్వయంగా చేసిన హత్యలు ఉన్నాయి. వ్యవస్థాగతమైన నేరాలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నందువల్ల జర్నలిస్టుల హత్యలు కూడా పెరుగుతున్నాయి. 2025లో ఇప్పటివరకూ మరణించిన జర్నలిస్టులలో 57 మంది యుద్ధం, లేదా క్రిమినల్ నెట్‌వర్క్ కారణంగా మరణించారు.

సాధారణ పోలీసులు, పారామిలిటరీ దళాలు సహా హంతక ముఠాలు కూడా ఈ హత్యలకు కారకులవుతున్నారు. గడచిన 12 నెలల్లో ఇజ్రాయెల్ సాయుధ బలగాల చర్యల కారణంగా 43 శాతం జ ర్నలిస్టులు హత్యలకు గురయ్యారు. చైనా,రష్యా, ఉక్రేన్, మయన్మార్ దేశాలు జర్నలిస్టులకు అతిపెద్ద బందిఖానాలుగా మారాయి. చైనాలో 121 మంది జర్నలిస్టులో జైళ్ళ ల్లో బందీలుగా ఉండగా, రష్యాలో 48 మంది, ఉక్రేన్‌లో 26 మంది, మయన్మార్‌లో 47 మంది జర్నలిస్టులు, బెలారస్‌లో 33 మంది, వియత్నాంలో 28 మంది, అజర్‌బైజాన్‌లో 25 మంది, ఇరాన్‌లో 21 మంది, ఇజ్రాయెల్‌లో 20 మంది, ఈజిప్టులో 20 మంది, సౌదీఅరేబియాలో 19 మంద్ జ్ర్నలిస్టులు బందీలుగా జైళ్ళల్లో మగ్గుతున్నారు. సిరియాలో బషర్ అలీ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత అరెస్టులకు గురైన జర్నలిస్టుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వారంతా బలవంతంగా హత్యలకు గురయ్యారా? లేక జాడ తెలియకుండా పోయారా? అనే విషయంలో అన్వేషణ జరుగుతోంది. ఇక మెక్సికోలో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముఠాల కారణంగా ఈ ఏడాది అనేకమంది జర్నలిస్టులు మరణించారు. ఆందోళన కలిగించేస్థాయిలో ఈ ఏడాది మెక్సికోలో జర్నలిస్టుల మరణాలు పెరిగాయి.

ప్రపంచంలో జర్నలిస్టులకు ప్రమాదకరంగా మారిన దేశాలలో మెక్సికో రెండోస్థానంలో ఉంది. మెక్సికోలో మాదక ద్రవ్యాల ముఠాలు, మానవ అక్రమ రవాణా ఉగ్రవాద ముఠాలు ఘోరమైన నేరాలకు పాల్పడుతున్నాయి. గడచిన మూడు సంవత్సరాలకంటే ఈ ఏడాది జర్నలిస్టులకు మెక్సికో అత్యంత ప్రాణాంతకదేశంగా మారింది. ఈ సంవత్సరంలో మెక్సికోలో ఏకంగా తొమ్మిదిమంది జర్నలిస్టులు మరణించారు. ప్రపంచంలో హత్యకు గురైన జర్నలిస్టులలో 24 శాతం మంది మెక్సికోలోనే ఉన్నారు.

## సెక్యూరిటీ గ్యారంటీ ఇస్తే ఎన్నికలకు సై

ట్రంప్ విమర్శలకు జెలెన్‌స్కీ ప్రతిస్పందన

**కీవ్:** ఉక్రేన్‌లో తక్షణం ఎన్నికల నిర్వహణకు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ సంసిద్ధత ప్రకటించారు. ఉక్రేన్‌కు పూర్తి భరోసా ఇచ్చేవిధంగా సెక్యూరిటీ గ్యారంటీలు గనుక ఇస్తే దేశంలో 60 నుండి 90 రోజుల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అదే విధంగా నేడో–రేపో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తాను సవరించిన శాంతి ప్రణాళిక ప్రతిపాదనలు సమర్పిస్తానని కూడా చెప్పారు. ఉక్రేన్‌లో ఎన్నికలను ఎగవేసేందుకు యుద్ధాన్ని ఒక సాకుగా అడ్డం పెట్టుకున్నారని ట్రంప్ చేసిన విమర్శకు జెలెన్‌స్కీ పైవిధంగా స్పందించారు. ట్రంప్ ప్రకటించిన ముసాయిదా శాంతి ప్రణాళికపట్ల జెలెన్‌స్కీ విముఖత ప్రకటించారు. యూరప్ నాయకులతో ఆయన కొద్ది రోజులుగా ముమ్మరంగా మంతనాలు సాగిస్తూ వచ్చారు. యూరప్‌లోని పలు దేశాలలో ఆయన పర్యటించి నాయకులతో చర్చలు జరిపారు. చివరిగా లండన్‌లో బ్రిటన్ ప్రధానమంత్రి అధికార నివాసంలో నాటో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించిన తర్వాత తమ వద్ద ఉన్న భూభాగాలను రష్యాకు వదులుకునేది లేదని స్పష్టం చేశారు. సవరించిన కొత్త ప్రణాళికను ట్రంప్‌కు సమర్పించగలనని అసలు విషయం స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదనలు పూర్తిగా రష్యాకే అనుకూలంగా ఉన్నాయని మొదటి నుండీ జెలెన్‌స్కీ నసుగుతూనే ఉన్నారు. పైకి మాత్రం ఇష్టపూర్వకంగా ఉన్నట్టే వ్యవహరించారు. జెనీవా సదస్సులో కొన్ని రాయితీలు సంపాదించారు. ఉక్రేన్‌కు పూర్తి భద్రతా హామీలు ఉండాలన్నారు. ట్రంప్ రూపొందించిన 28 అంశాల తొలి ప్రణాళిక ప్రతిపాదనలన్నీ రష్యాకే అనుకూలంగా ఉన్నాయని నాటో కూటమి, యూరోపియన్ యూనియన్ నాయకులు విమర్శించారు. ఈ ప్రణాళికను అంగీకరించవద్దని జెలెన్‌స్కీపై వారు ఒత్తిడి తెచ్చారు. దీంతో ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అసలు ఉక్రేన్ యుద్ధ నివారణకు తాను రూపొందించిన ముసాయిదా శాంతి ప్రణాళిక ప్రతిని జెలెన్‌స్కీ ఇన్ని రోజులు గడచినాగానీ అసలు చదవలేదని విమర్శించారు.

## నోబెల్ శాంతి బహుమతి ఉత్సవానికి మచాడో గైర్హాజరు

**నార్వే:** ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మారియా కొరినో మచాడో (58) నార్వేలో బుధవారం జరిగిన అవార్డు స్వీకారోత్సవానికి గైరుహాజరయ్యారు. ఆమె బదులుగా ఆమె కుమార్తె ఈ నోబెల్ శాంతి బహుమతి స్వీకరించారు. గడచిన కొద్ది రోజులుగా మచాడో ఎక్కడ ఉన్నారో కూడా తమకు జాడ తెలియదని, ఆమె గురించిన సమాచారం తెలియడంలేదని నోబెల్ కమిటీ అధికారులు చెప్పారు. ఐతే వెనిజులాపై ట్రంప్ దాడులు చేసేందుకు బెదిరింపులు చేయడం, కరీబియన్ సముద్ర జలాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకున్న పరిస్థితుల మధ్య వెనిజులా ప్రభుత్వంమచాడోపై ఆంక్షలు విధించింది. నార్వే వెళితే దేశం వదలి వెళ్ళిపోయిన నేరస్థురాలుగా మచాడోను ప్రకటిస్తామని అటార్నీ జనరల్ తారెక్ విలియం సాబ్ అన్నారు. ఆమెపై అనేక నేరాభియోగాలు ఉన్నారు. వెనిజులా హోంమంత్రి దియాస్‌దాడో కేబెల్లో మాట్లాడుతూ, మచాడో నార్వే వెళుతున్నారో లేదో తమకు తెలియదన్నారు.

## స్టార్టప్ ఫండ్

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలన్న లక్ష్యంతో పని చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నా. అంటే కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలు ఎదగాలి. వీటిల్లో 2034 నాటికి కనీసం 10 స్టార్టప్‌లు సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. 1998లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఇద్దరు మిత్రులు కలిసి కాలిఫోర్నియాలో స్టార్టప్‌గా ప్రారంభించిన ఒక గ్యారేజీయే ఇప్పుడు గూగుల్‌గా అవతరించింది. ఇదెంతో స్ఫూర్తి దాయకమైన అంశం. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక విజన్‌తో ముందు కు సాగుతూ, ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలన్న లక్ష్యంతో రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పైన గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాం. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ రైజింగ్ విజన్‌ను ఆవిష్కరించాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పదిహేను ఇరవై ఏళ్ల కిందట ప్రారంభించబడిన అనేక స్టార్టప్‌లు ఇప్పుడు బిలియన్స్ డాలర్ల కంపెనీలుగా ఎదిగాయి. టీమ్ వర్క్‌తో పనిచేయాలి. చివరగా విజయం సాధించడం చాలా ముఖ్యం. స్టార్టప్‌లు కూడా అదే విధంగా పనిచేయాలి' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**యూనివర్సిటీల్లో ఇంక్యూటేషన్ సెంటర్ల ఏర్పాటు : మంత్రి శ్రీధర్‌బాబు**

ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లను ఏర్పా టు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ 'వన్ హబ్'కు ధీటుగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దుతామన్నారు. మేం స్టార్టప్‌లను కేవలం చిన్న కంపెనీలుగా మాత్రమే చూడటం లేదని, సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిస్తూ... కొత్త ఉద్యోగాలను సృష్టించే 'ఎకనామిక్ ఇంజిన్స్'గా చూస్తున్నామన్నారు. 2024లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికమని వివరించారు. ముఖ్యంగా హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లేడ్ స్టార్టప్‌లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ పనితీరుకు, ప్రగతిశీల విధానాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్‌గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు.






## రూ.1000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

జిఓను విడుదల చేశారు. ఈ నిధులతో అభివృద్ధి చేయనున్న ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్‌పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. బహిరంగసభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ , ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవ రావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఓయు వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా వినిపించిన ఉద్యమాల పురిటి గడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం అన్నారు. గుండెల నిండా అభిమానం నింపుకుని ఇక్కడికి వచ్చానన్నారు. 100 ఏళ్ల చరిత్ర గల ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. విద్యార్థులు రాజకీయ పార్టీల ఉచ్చులో పడొద్దని సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమస్యలుంటే నిలబడి కొట్లాడాలని, వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.

**తెలంగాణ పౌరుషాల గడ్డ**

తెలంగాణ గడ్డకు ఒక చైతన్యం, పౌరుషం ఉందని, ఆ చైతన్యం, పౌరుషానికి చదువుతో పనిలేదని ఈ తెలంగాణ నిరూపించిందని సిఎం పేర్కొన్నారు. ఎవరైనా ఆధిపత్యం చెలాయించాలని చూసిన ప్రతిసారీ తెలంగాణలో తిరుగుబాటు మొదలైందన్నారు. కొమురం భీమ్ నుంచి సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ ఉద్యమం వరకు ఆధిపత్యంపై పోరాటం కొనసాగించి విజయాలను అందుకుందని చెప్పారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ ముందు భాగాన నిలిచిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. అనేక త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు ఆస్తులు, అంతస్తులు, ఫామ్ హౌస్‌లు అడగలేదని, వారు కేవలం స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మాత్రమే కోరారని, కానీ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఏమి చేసిందో తెలిసిందేనన్నారు. గత పదేళ్ళ కాలంలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేయాలని ప్రయత్నం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందిస్తున్నామని చెప్పారు.



**పేదరికం, వెనకబాటుతనం వేర్వేరు**

పేదరికానికి, వెనకబాటుతనానికి సంబంధం లేదని, ఈ రెండు వేర్వేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 20, 30 ఎకరాల భూములున్నవారు కూడా వెనకబాటులో ఉన్నారని, ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైందన్నారు. భూములు లేక ఉపాధి లేక పోవడం పేదరికమైతే, ఆర్థికంగా ఉండి కూడా చదువు లేకపోవడంతో వెనకబాటుతనానికి గురవుతున్నట్లు గుర్తించామన్నారు. అందుకే మారుమూల గ్రామాల నుంచి పేదరికం, వివక్ష, వెనకబాటుతనం సమూలంగా నిర్మూలించేందుకే ప్రభుత్వం 100 నియోజకవర్గాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

**భాష కేవలం కమ్యూనికేషన్ మాత్రమే**

కొందరు తమకే ఇంగ్లీష్ వచ్చని తెగ మురిసిపోతూ తనకు ఆ భాష రాదంటూ చులకన చేస్తున్నరని సిఎం అన్నారు. తాను గుంటూరులో చదువుకోలేదని, ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, విదేశీ భాష రాకపోవచ్చు గానీ వారిలాగా తనకు గూడుపుఠానీ తెలియదన్నారు. భాష కేవలం కమ్యూనికేషన్ మాత్రమేనని, విద్యతో పాటు నైపుణ్యం ఉండాలన్నారు. అదే నైపుణ్యం ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా బతుకోచ్చని తెలిపారు. చైనా, జపాన్ వారు ఇప్పుడిప్పుడు ఎబిసిడిలను నేర్చుకుంటున్నారని, వారు అమెరికాను మించి పోయే స్థాయికి ఎదిగరన్నారు.

**ఒయులో ఖాళీగా ఉన్న 1000 పోస్టులను భర్తీ చేయాలి**

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిధులు ఇచ్చిన ప్రభుత్వం సుదీర్ఘ కాలంగా ఖాళీగా ఉన్న లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని, ఈ ప్రక్రియలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ ఒయు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## చర్చకు రండి

(మొదటి పేజీ తరువాయి)

తమను తాము రక్షించుకునే సమాధానాలు చెబుతున్నారని రాహుల్‌గాంధీ వ్యంగ్య విమర్శలు చేశారు. నాయకులు ఇద్దరూ సభలో పరస్పరంఒకరిపై మరొకరు వ్యంగ్య విమర్శలు చేశారు. తాము నిర్వహించిన మూడు పత్రికాగోష్ఠులలో 'ఓట్ చోరీ'కి సంబంధించిన అడిగిన ప్రశ్నలపై చర్చకు రావాలని అమిత్ షాను సవాలు చేశారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ కొనసాగిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను రాహుల్‌గాంధీ దీటుగా తిప్పికొట్టారు. ఇద్దరి మధ్యా వాడీ–వేడీగా వాగ్వాదం జరిగింది. ''నేను నిన్న (మంగళవారం) మూడు ప్రశ్నలు అడిగాను, ఎన్నికల కమిషనర్లు తీసుకున్న తిరుగులేని నిర్ణయాలను ఎవ్వరూ ప్రశ్నించడానికి వీలులేకుండా భారతదేశ చరిత్రలో మొదటిసారి వారికి చట్టపరమైన పూర్తి రక్షణలు కల్పించారు. ఈ విధమైన ఆలోచనల వెనుక ఉన్న అంతరార్థం ఏమిటో తప్పనిసరిగా ఆయన (అమిత్ షా) సమాధానం చెప్పితీరాలి, ఆయన హర్యానా గురించి మాట్లాడారు, ఆయన ఒక ఉదాహరణ చెప్పారు, కానీ ఓట్ చోరీకి సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయి'' అని రాహుల్‌గాంధీ అన్నారు. ''నేను నిర్వహించిన పత్రికాగోష్ఠుల్లో చెప్పిన అంశాలపై చర్చ చేద్దాం రండి, అమిత్ షా జీ, నేను మిమ్మల్ని సవాలు చేస్తున్నా, నేను నిర్వహించిన మూడు పత్రికాగోష్ఠులో చెప్పిన అంశాలపై చర్చిద్దాం రండి'' అని రాహుల్‌గాంధీ లోక్‌సభలో అన్నారు. ఈ సవాలుపై అమిత్ షా తిరిగి స్పందిస్తూ,ప్రతిపక్ష నాయకుడి కోరికలు, ఆలోచనలకు అనుగుణంగా తన ప్రసంగాన్ని మలచుకోలేనని, ఆయనకు అనుకూలంగా తాను మాట్లాడలేనన్నారు. ఎవరో చేసిన డిమాండ్‌కు అనుగుణంగా ఈ చర్చను, పరిస్థితులను మార్చడం వీలు కాదని అమిత్ షా అన్నారు. దీంతో రాహుల్‌గాంధీ ప్రతిస్పందిస్తూ, అమిత్ షా ఆత్మరక్షణలో పడ్డారని, ఆయన భయపడి వెనక్కితగ్గి జవాబులిస్తున్నారని హేళన చేశారు. ఓట్ చోరీపైన, ఎన్నికల సంఘం ప్రవర్తన పైనా గడచిన కొద్ది నెలలుగా పార్లమెంటులో అధికార–ప్రతిపక్షాలమధ్య తీవ్ర వాగ్వాదాలు, విమర్శలు–ప్రతివిమర్శలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి. చేశారు.భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలిస్తూ, తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నదని మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ విమర్శించారు. తాము ఏం చేసిన చెల్లుబాటు అవుతుందని ఎన్నికల కమిషనర్లు భావిస్తున్నారని, ఈ చట్టాలు ఇదేవిధంగా యథాతథంగా కొనసాగబోవని, తాము అధికారంలోకి వస్తేగతకాలపు నిర్ణయాలను కూడా తిరగదోడి వాస్తవాలను వెలికితీసేవిధంగా చట్టాల్లో మార్పులు తీసుకు వస్తామని కూడా రాహుల్‌గాంధీ హెచ్చరిక చేశారు.

## నేడు తొలి పోరు

(మొదటి పేజీ తరువాయి)



స్థానాలకు పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. కాగా 3834 సర్పంచ్ స్థానాలకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డు స్థానాలకుగాను 65,455 మంది వార్డు అభ్యర్థులు పోటీ పడనున్నారు. మొదటి విడతలో 56,19, 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లు తమ వెంట ఆధార్, పాన్, పట్టాదార్ పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు ఇలా మొత్తంగా 18 రకాలలో ఏదైన ఒక గుర్తింపు కార్డ్‌ను చూపించి ఓటు వేయవచ్చని ఎన్నికల కమిషన్ సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మొదటి విడత ఎన్నికలను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి ప్రతి పోలింగ్ స్టేషన్ పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

**ఎన్నికలకు 45,086 బ్యాలెట్ బాక్సులు..**
**కోడ్ ఉల్లంఘన కేసులు పరిశీలిస్తాం: రాణికుముదిని**

గ్రామ సర్పంచ్ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగి ంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. మొదటి దశ ఎన్నికలకు 45,086 బ్యాలెట్ బాక్స్ లు వినియోగిస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రధాని మోదీ మాన్‌కిబాత్, అలాగే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు నిర్వహించేందుకు అనుమతి కోరారని వివరించారు. ఎన్నికల ఉల్లంఘనలపైన రెండు కమిటీలను ఏర్పాటు చేశామని, సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారనే ఫిర్యాదును కూడా ఈ కమిటీనే పరిశీలిస్తుందని వివరించారు. కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగానే తాము చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏకగ్రీవ ఎన్నికలపైన ఎవరైనా ఫిర్యాదు చేస్తే దానికి సంబంధించిన ఆధారాలను, ఇతర అంశాలను కూడా కమిటీలు పరిశీలించి తమకు నివేదిక సమర్పిస్తారని, ఇందులో ఉల్లంఘనలు జరిగినట్టు తేలితే ఏకగ్రీవ ఎన్నిక రద్దు అవుతుందని రాణికుమిదిని వెల్లడించారు. తొలి విడతలో 396, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని వివరించారు. ఏకగ్రీవ ఎన్నిక జరిగిన గ్రామాల్లో ఆయా అభ్యర్థుల నుంచి ధృవీకరణ పత్రాలను కోరుతున్నామని, నియమ నిబంధనలకు లోబడే పరిశీలిస్తున్నామని వివరించారు. ఏకగ్రీవంగా, నోటాను కూడా అభ్యర్థిగా పరిగణలోకి తీసుకోవాలనే అంశంపైన సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉన్నదన్నారు.

**రూ.8.2 కోట్లను సీజ్ చేశాం: మహేశ్ భగవత్**

అదనపు డిజిపి మహేశ్ భగవత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.8.2 కోట్లను సీజ్ చేశామన్నారు. రూ.2.3 కోట్ల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకునానరు. ఎన్నికలలో 50వేల మంది. సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లాటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీ చర్యలు తీసుకున్నామని వివరించారు.

## వాళ్లే చేశారు

(మొదటి పేజీ తరువాయి)

చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించాలన్నదే వారి ఉద్దేశమని ఆరోపించారు. ప్రతిపక్షాల ఎంపీలు సభ నుండి వాకౌట్ చేసిన తర్వాత కూడా అమిత్ షా మాట్లాడుతూ, ఎన్నోసార్లు ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయని, అందువల్ల దీనిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నా రు. కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మాత్రం దేశంలోకి అక్రమంగా వచ్చే చొరబాటుదారులను గుర్తించడం, వారిని ఓటర్ల జాబితాల నుండి తొలగించడం, ఏరిపారేయడం, వారి స్వదేశాలకు తరలించడం వంటి చర్యలను పట్టువదలకుండా కొనసాగిస్తుందని అమిత్ షా ఉద్ఘాటించారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం చొరబాటుదారుల జోలికి వెళ్ళకుండా వారిని ఓటర్ల జాబితాలో కొనసాగించాలని కోరుకుంటున్నాయని, వారందరినీ మళ్ళీ వెనక్కు తీసుకువచ్చి ఓటర్ల జాబితాలలో చేర్చాలని కోరుకుంటున్నాయని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కూడా ఓట్ చోరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ,''స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానమంత్రి పదవి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు 28 మంది మద్దతు ఇవ్వగా, జవహర్‌లాల్ నెహ్రూకు ఇద్దరే మద్దతు ఇచ్చారని, ఐనాగానీ నెహ్రూ ప్రధానమంత్రి పదవి స్వీకరించారని, ఇది ఓట్ చోరీ తప్ప మరొకటి కాదని అన్నారు. ఇక రెండోసారి ఇందిరాగాంధీ కూడా ఓట్‌చోరీకి పాల్పడ్డారని, న్యాయస్థానం ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకున్న తర్వాత కూడా ఇందిరాగాంధీ తన అధికారులకు తిరుగులేకుండా ఉండేందుకు స్వీయ రక్షణలు ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. సోనియాగాంధీ కూడా దేశ పౌరసత్వం పొందడం కోసం కోర్టులను ఆశ్రయించారని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రభుత్వాలకు 'విత్తన చట్టం ముసాయిదా-2025' సవరణ నివేదిక అందజేస్తాం

ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రప్రభుతత్వం విడుదల చేసిన 'విత్తన చట్టం ముసాయిదా 2025'లో సవరణలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్ష, సమావేశాలు నిర్వహించామని గుర్తు చేశారు. వ్యవసాయ రంగ నిపుణుల నుండి స్వచ్ఛందంగా వచ్చిన సూచనలను పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పలు సవరణలతో కూడిన ఒక నివేదికను రూపొందించినట్లు కోదండరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తన చట్ట సవరణల నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నామని వివరించారు. కేంద్రం తీసుకురా బోత్ను విత్తన చట్టంలో చాలా లొసుగులు ఉన్నాయని, రైతుల ప్రయోజనం కోసం చట్టం ఉండేలా చూడాలని సూచించారు. మల్టీనేషనల్ విత్తన కంపెనీల కోసం చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని కోదండరెడ్డి పేర్కొన్నారు.

# విత్తన చట్టంలో మార్పులు చేయండి

'కేంద్ర విత్తన చట్టం ముసాయిదా -2025' సవరణలు చేస్తూ వ్యవసాయ శాఖ చేసిన సిఫార్సులు ఇవే..

| కేంద్రం | తెలంగాణ వ్యవసాయ శాఖ |
|---|---|
| సెక్షన్ 13లోని నిబంధన ప్రకారం వ్యవసాయ విత్తనాన్ని రైతులకు విక్రయించేందుకు ముందుగా విత్తన విడుదల చేసే ముందే కేంద్ర విత్తన కమిటీతో ముందస్తు నమోదు తప్పనిసరి. | రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి ప్రత్యేకమైన రకాలను నమోదు చేయడానికి అధికారం ఇవ్వాలి. రాష్ట్రాలకు, తమ రైతులకు విత్తన రకాల అనుకూలత, అవసరాలు బాగా లుసు. |
| సెక్షన్17(3)లోని నిబంధన ప్రకారం ఉత్పత్తిదారు లేదా ప్రాసెసింగ్ ప్లాంట్ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వంలో నమోదు చేసుకోకపోతే ఉత్పత్తిదారు, విత్తన ఉత్పత్తి సంస్థ లేదా విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్ విత్తనాన్ని విక్రయించకూడదు లేదా పంపిణీ చేయకూడదు. | ప్రతి విత్తన ఉత్పత్తి సంస్థ నిర్వాహకులు వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా కనీస విద్యార్హతను కలిగి ఉండాలి లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో కనీసం మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి ఉండాలి. |
| సెక్షన్18(1)లోని నిబంధన ప్రకారం విత్తన డీలర్లు, పంపిణీదారులు విత్తన అమ్మకాలను ప్రారంభించే ముందు రాష్ట్ర ప్రభుత్వంతో నమోదు చేసుకోవాలి. | విత్తన డీలర్లు, పంపిణీదారులు రిజిస్ట్రేషన్‌కు అర్హత సాధించేందుకు వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుండి విత్తనోత్పత్తిలో సర్టిఫికేట్ కోర్సు కనీస విద్యా అర్హతను కూడా కలిగి ఉండాలి. |
| సెక్షన్21(1డి)లో నిబంధన ప్రకారం ఏదైనా నమోదిత రకం విత్తనాన్ని అమ్మకానికి పెట్టినప్పుడు కేంద్ర కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఉత్పత్తిదారుడు విత్తన ప్రమాణాలను స్పష్టంగా ప్రదర్శించాలి.కే ంద్ర ప్రభుత్వ పోర్టల్ ద్వారా జారీ చేయబడిన క్యూ ఆర్ కోడ్‌ను చేర్చాలి. ఈ కోడ్ విత్తనం అధీకృత ధృవీకరణ సంస్థ ద్వారా ధృవీకరించబడిందా? లేదా? ఉత్పత్తిదారునితో స్వీయ ధృవీకరించబడిందా? అనేది సమాచారాన్ని అందిస్తుంది. | ప్రస్తుత ముసాయిదా చట్టం ప్రకారం విత్తన ఉత్పత్తి సంస్థల స్వీయధృవీకరణ అనుమతించబడుతుంది. స్వీయధృవీకరణ కారణంగా రైతుల పొలాల్లో విత్తన వైఫల్యం గురించి అనేక ఫిర్యాదులు తలెత్తాయి. అందుకే మార్కెటింగ్ కోసం ఉద్దేశించిన అన్ని విత్తనాలు గుర్తింపు పొందిన ధృవీకరణ సంస్థ ద్వారా ధృవీకరించాలి. స్వీయధృవీకరణను అనుమతించకూడదు. |
| సెక్షన్ 22లోని నిబంధన మేరకు అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం విత్తనాల ధరలను నియంత్రించవచ్చు. | తెలంగాణ వ్యవసాయ శాఖ: రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారం కల్పించాలి. రాష్ట్ర విత్తన కమిటీ విత్తన ధరలను సమీక్షించి, హేతుబద్ధమైన ధరల పరిమితిని సిఫార్సు చేయడానికి అనుమతించాలి. |
| సెక్షన్ 33లో నిబంధన ప్రకారం విత్తనం ఎగుమతి చేసే దేశంలో నిర్వహించబడే వివిధ ప్రదేశాల పరీక్షల ఆధారంగా విత్తనాల దిగుమతికి అనుమతి ఉంది. | తెలంగాణ వ్యవసాయ శాఖ: స్థానిక అనుకూలతను పరీక్షించకపోతే దిగుమతి చేసుకున్న విత్తనాలు భారతీయ వ్యవసాయవాతావరణ పరిస్థితులలో వైఫల్యం చెందవచ్చు. తద్వారా పంట నష్టాలు జరిగే అవకాశం ఉంది. అందుకే దిగుమతి చేసుకున్న విత్తనాలన్నింటికీ కనీసం రెండు సంవత్సరాలు ఐసిఎఆర్/ఎస్ఇయు కేంద్రాలలో బహుళస్థాన పరీక్షలను తప్పనిసరి చేయడం చాలా అవసరం. |
| సెక్షన్34లోని నిబంధన మేరకు రిజిస్ట్రేషన్ లేకుండా విత్తనాల అమ్మకం, నకిలీ లేదా నాసిరకం విత్తనాల సరఫరా, లేదా సరైన లేబులింగ్ లేకుండా విత్తనాలను విక్రయిస్తే రూ. 50,000 నుండి 30 లక్షల వరకు జరిమానాతో పాటు మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష. | ఉత్పత్తి సంస్థలు చేసిన నేరాలకు పైన పేర్కొన్న జరిమానాలు,శిక్షతో పాటు, విత్తన ఉత్పత్తిదారు లేదా కంపెనీని కనీసం ఐదు సంవత్సరాల పాటు విత్తన ఉత్పత్తి , అమ్మకాల నుండి నిషేధించాలి. |

### ముసాయిదా సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు విత్తనాన్ని విక్రయించేందుకు ముందుగా కేంద్ర విత్తన కమిటీలో ముందస్తు నమోదు చే సుకోవాలని 'కేంద్రవిత్తన చట్టం ముసాయిదా2025'లో పొందుపర్చిన సెక్షన్ 13లోని నిబంధనను సవరించాలని, ఈ స్థానంలో రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి ప్రత్యేకమైన రకాలను నమోదు చేసేందుకు అధికారం ఇ వ్వాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది. రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారాన్ని కల్పించాలని, రాష్ట్ర విత్తన కమిటీ విత్తన ధరలను సమీక్షించి, హేతుబద్ధమైన ధరల పరిమితిని సిఫార్సు చేయడానికి అనుమ తి ఇవ్వాలని కోరింది. 'కేంద్ర విత్తన చట్టం ముసాయిదా2025' అభ్యంతరాల గడువు బుధవారంతో ముగిసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సిపార్సులతో కూడిన తుది నివేదికను సిద్ధం చేసింది. నకిలీ లేదా నాణ్యత లేని విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు చట్టబద్ధమైన, కాలపరిమితితో కూడిన పరిహార విధానా న్ని ఏర్పాటు చేసేందుకు బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్నిఏర్పా టు చేయాలని, సాధారణ పరిస్థితుల్లో రైతు పొందగలిగే అత్యధిక దిగుబడి ఆధారంగా పరిహారం లె క్కించాలని సూచించింది. రైతులు ఫిర్యాదు చేసిన 60 రోజులలోపు క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసి, వాటిని పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది.

### ముసాయిదాలో పొందుపర్చాల్సిన ప్రతిపాదనలు ఇవే

- విత్తనోత్పత్తి చేసే రైతులను రక్షించేందుకు ముసాయిదా విత్తన బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్ని చేర్చాలి.
- విత్తనాలను సరసమైన ధరలలో రైతులకు అందించేందుకు విత్తన ధరల నియంత్రణ తప్పనిసరిగా చట్టబద్ధమైన నిబంధనగా ఉండాలి.
- సాంప్రదాయ విత్తనాలు , వారసత్వ విత్తన రకాలను లేదా వాటి డిజిటల్ సీక్వెన్స్ ఇన్ఫర్మేషన్)ను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు ఉండాలి.
- విత్తన కంపెనీలకు లైసెన్స్ లు జారీ చేసేందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అందులో లైసెన్సింగ్ కమిటీ కూర్పు, పరిశోధన అవసరాలు, విద్యార్హతలు, రకాల నమోదు కోసం బఫర్ వ్యవధి వంటి అంశాలను జోడించాలి. ముసాయిదాలో బయో సేఫ్టీ వారసత్వ విత్తనాలకు డిజిటల్ సీక్వెన్స్ ఇన్ఫర్మేషన్ చేర్చాలి.

## తెలంగాణ యువతకు తైవాన్‌లో ఉద్యోగాలు

- 20 ఇంజనీర్ కళాశాల విద్యార్థులకు తొలి దశ ఇంటర్వ్యూలు
- నైపుణ్యాలు పెంచుకుంటేనే భవిష్యత్తు..
- యువతకు ఉద్బోధన మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్ అవసరాలకు తగిన నైపుణ్యాలు పెంచుకోగలిగితేనే యువత తాము కోరుకున్న ఉద్యోగాలను పొందగలుగుతారని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. కాలానుగుణంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించిన వారే తమ వృత్తులో నిలదొక్కుకోగలుతారని అన్నారు. టీవర్క్స్ ప్రాంగణంలో బుధవారం 'పాత్ వే టు తైవాన్' పేరుతో జరిగిన తైవాన్‌లో ఉద్యోగాల కల్పనకు జరిగిన మొదటి రౌండ్ ఇంటర్వ్యూల కార్యక్రమాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీవర్క్స్ సిఇఒ జోగిందర్ తనికెళ్ల, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ ప్రతినిధి ఈడెన్ లియెన్‌లు మంత్రి సమక్షంలో ఉద్యోగాల కల్పన, ఉన్నత విద్యా కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఒప్పందం( ఎంఒయు)పై సంతకాలు చేసారు. తైవాన్‌కు చెందిన రియల్ టెక్, లాజిటెక్, మీడియాటెక్, విస్ట్రాన్, హిమాక్స్, కౌపాంగ్, ఐటిఆర్ఐ దీని కోసం ముందుకొచ్చాయి. ఈ ప్రోగ్రాం ద్వారా ఇక్కడి విద్యార్థులను తైవాన్ కంపెనీలు మొదటి రౌండ్ ప్రాథమిక ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని తదుపరి దశలో తైవాన్‌ను ఆహ్వానిస్తాయి. మొదటి విడతగా 20 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తొలిదశ ఇంటర్వ్యూల కోసం హాజరయ్యారు. తైవాన్ కంపెనీలు ప్రతిభావంతుల వేటలో దేశం మొత్తం మీద తెలంగాణాను ఎంపిక చేసుకున్నందుకు శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. తొలిదశ ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆరు నెలల పాటు ఇక్కడ (చైనీస్) మాండరిన్ భాషను నేర్చుకోవాల్సి ఉంటుంది. ఆతర్వాత మాండరిన్ భాష, సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు తైవాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. దీని కోసం 8 తైవాన్ కంపెనీలు ఇక్కడికి వచ్చినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్ చల్లవర్ తమ పరివర్తన్ ఫండ్ కింద టీవరక్స్ ఫౌండేషన్‌కు రూ.1.5 కోట్ల నిధులను సమకూర్చనున్నట్టు శ్రీధర్ బాబు సమక్షంలో ప్రకటించారు. దీనిని పర్యావరణ అనుకూల విధానాల్లో వస్తూత్పత్తి, ఆవిష్కరణలు చేసే అంకుర సంస్థలకు సహాయనిధిగా అందజేస్తారు. కేవలం 2.2 కోట్ల జనాభా ఉన్న తైవాన్ చిప్‌ల తయారీ, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచమంతా ఆధారపడే స్థాయికి ఎదిగింది. భవిష్యత్తు టెక్నాలజీల గురించి తైవాన్ ముందు చూపు, శ్రమించే తత్వాన్ని తెలంగాణా యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. కార్యక్రమంలో తైవానీస్ యూనివర్సిటీలు తమ విద్యాసంస్థల ప్రాముఖ్యతను వివరించే స్టాళ్లను ఏర్పాటు చేసాయి. 12వ తరగతి, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు తమ యూనివర్సిటీల్లో చేరితే వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని యూనివర్సిటీల ప్రతినిధులు వి వరించారు. కార్యక్రమంలో టీహబ్ సీనియర్ వైస్ ప్రె సిడెంట్ లెఫ్టినెంట్ కల్నల్ టి.ఎం. ప్రవీణ్ కుమార్, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ సిఇఒ జోనాథన్ లియావో, ప్రతినిధులు టెర్రాలిన్, ఇడెన్ లియెన్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూనే పారిశ్రామిక అభివృద్ధిని సమన్వయం చేసుకోవాలి

**సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూనే ఇండస్ట్రియల్ అభివృద్ధిని సమన్వయం చేసుకోవాలని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, క్యాబినెట్ చురుకుగా పనిచేసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో దాదాపు రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తుందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల పెట్టుబడికి మంచి వాతావరణం కలిగిన భూములు అందుబాటులో ఉంటాయని, అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా పారిశ్రామిక అభివృద్ధి చేపడితే రానున్న రోజుల్లో పరిశ్రమలు పెరుగుతాయని సూచించారు. భూములకు రెవెన్యూ శాఖ అనుమతులు ఇచ్చే క్రమంలో అవకతవకలు జరగకుండా అమలు చేయాలని నారాయణ సూచించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో జోష్

- నాడు దావోస్‌లో రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు...
- నేడు తెలంగాణ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడుల రికార్డులను సృష్టించిన సమ్మిట్ ...
- లక్షలాది ఉద్యోగాలకు హామీ
- ప్రభుత్వ వర్గాల్లో హర్షం

ఇ. చంద్రశేఖర్

దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సును తలదన్నే రీతిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడుల ఆకర్షణలో రికార్డులను సృష్టించింది. గత ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొని ఆర్థిక, పారిశ్రామిక సంస్థల నుంచి సుమారు రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించి ఒప్పందాలు చేసుకోగా, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యంతో అసాధారణమైన రీతిలో దాదాపు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు చేసుకోవడం, తద్వారా రాష్ట్రంలోని యువతకు దాదాపు 1.40 లక్షల ఉగ్యోగావకాశాలు లభించనుండడం గమనార్హం. సదస్సు రాష్ట్ర భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తించింది. ఇది నిజంగా ఆచరణ సాధ్యమైతే తెలంగాణ చరిత్రలోనే సరికొత్త రికార్డు అవుతుందని చెప్పవచ్చు. మరో వైపు తెలంగాణ ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాలలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 'హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ'ని షోకేస్ చేయడంలో సదస్సు సఫలీకృతమైంది. తెలంగాణను ప్రపంచ పటంలో నిలిపే ఉద్దేశ్యంతో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా రెండు రోజుల పాటు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' అట్టహాసంగా జరిగింది. సమ్మిట్‌లో 44 దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, వివిధ దేశాల రాయబారులు, ప్రపంచ బ్యాంక్, ఎడిబి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సహా సుమారు 1,600 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెర్రీ, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, కాలిఫోర్నియా ఎకనమిక్ ప్రొఫెసర్ కార్తిక్ మురళీధరన్, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వంటి ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. సదస్సు చివరి రోజు 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్2047' విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సమ్మిట్‌లో మొదటి రోజు రూ.2.43 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు, అదే తరహాలో రెండవ రోజు దాదాపు రూ.3.3 లక్షల లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు మొత్తం రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు, ఎంఒయు జరిగాయి. పదుల సంఖ్యలో జరిగిన ఈ పె ట్టుబడుల ఒప్పందాలలో ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్ ఒక్కరే రూ.1 లక్ష కోట్ల (సుమారు 10 బిలియన్ డాలర్ల ) పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం సమ్మిట్‌లో అందరికీ ఆసక్తిని కలిగించింది.



### తెలంగాణపై అంతర్జాతీయ పెట్టుబడిదారుల విశ్వాసం

సమ్మిట్‌లో మొత్తం 27 ప్యానెల్ చర్చా గోష్టులు జరిగాయి. వీటిలో ముఖ్యంగా తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హ బ్‌గా మార్చే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ, ట్రాన్సిషన్ , పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ మొబిలిటీ 2047 కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, నాన్‌ఎమిషన్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, సరిహద్దు సాంకేతికతల అవకాశాల కోసం టెక్ తెలంగాణ 2047, వినోదం కోసం గ్లోబల్ ఎంటర్‌టెయిన్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్, కొత్త ఫిల్మ్ పాలసీ, ఏరోస్పేస్, డిఫెన్స్, కార్గో, ఎంఆర్‌ఓ, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా సెంటర్లు, పవర్, లైఫ్ సైన్సెస్ తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ప్రపంచ బ్యాం క్, డబ్ల్యుహెచ్‌ఓ, ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి), వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో పా టు, అగ్రరాజ్యాల పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా అమెరికా నుండి 46 మంది హాజరుకావడం తెలంగాణపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసాన్ని ఎత్తిచూపింది.

### ఆర్థిక వ్యవస్థ బలోపేతం... ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పునాది

ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు గట్టి పునాది వేస్తుందని, తద్వారా రాష్ట్రాన్ని ప్రపంచపటంలో అగ్రగామిగా నిలుపుతాయని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో కుదిరిన పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్రంలోని విద్య, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాలకు గొప్ప ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారవర్గాల అంచనా వేస్తున్నాయి. 'ఇది కేవలం ఒక సమ్మిట్ కాదు. రాష్ట్ర భవిష్యత్తును రూపొందించే మైలురాయి. సమ్మిట్ తెలంగాణకు 'గేమ్ చేంజర్'. పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని, వ్యవస్థను బలోపేతం చేస్తాయి. టూరిజం, ఫార్మా, ఐటి, రెన్యూవబుల్ ఎనర్జీలో భారీ గ్రోత్ జరుగుతుంది' అని ప్రభుత్వ అధికార వర్గాలు ప్రకటిస్తున్నాయి. అయితే రాష్ట్రానికి ఇంత పెద్ద స్థాయిలో పెట్టుబడులు వచ్చినప్పుడు వాటికి అనుగుణంగా విద్యుత్, రహదారులు, నీటి సరఫరా తదితర వంటి మౌలిక సదుపాయాలను వేగంగా కల్పించడం రాష్ట్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారనుందని ఆర్థిక, పారిశామిక వర్గాల పరిశీలకులు భావిస్తున్నారు. ప్రభుత్వం అత్యంత భారీ ఖర్చుతో నిర్వహించిన ఈ అంతర్జాతీయ సమ్మిట్ ద్వారా తక్షణ, ప్రత్యక్ష ప్రయోజనాలు సామాన్య ప్రజలకు ఎంతవరకు అందుతాయనే విషయంపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడుల ఎంఓయులను ఎండిఎ (మాస్టర్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు) లుగా మార్చి, పెట్టుబడులను త్వరితగతిన కార్యరూపం దాల్చేలా చేయడం ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు.

## కాలుష్యరహిత నగరం కోసమే ఎలక్ట్రిక్ బస్సులు

రాణిగంజ్‌లో 65 బస్సులను జెండా ఊపి ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని కాలుష పర్యావరణ హిత మెట్రో ఎలక్ట్రిక్ బస్సులు బుధవారం హైదరాబాద్ రోడ్లపై పరుగులు పెట్టాయి. ఇవి ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలో నడిచే 65 బస్సులను రాణిగంజ్ డిపోలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ రాణిగంజ్ డిపో నుంచి తార్నాకలోని ఆర్‌టిసి ఆసుపత్రి వరకు బస్సులో ప్రయాణించారు. ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఈవీ ట్రాన్స్ సిఈఓ సందీప్ రైజాడ , సెంట్రల్ జోన్ డిసిపి శిల్పవల్లి, నార్త్ జోన్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ పి.వి. మునిశేఖర్, సిహెచ్ వెంకన్న, ఎం.రాజశేఖర్, కార్పొరేటర్ సుచిత్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున ఆర్‌టిసి రాణిగంజ్ డిపో నుండి 65 బస్సులు ప్రారంభించామన్నారు. ఢిల్లీలో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు జీవించలేని పరిస్థితి, ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ , స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందని తెలిపారు.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వివిధ పుణ్యక్షేత్రాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ఆర్‌టిసి ఎండి వై . నాగిరెడ్డి మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలో వచ్చే రెండేళ్లలో 2800ల ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రతి బస్ ఒక రోజు ఒక టన్ కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గిస్తుంది అన్నారు. ఈవీ ట్రాన్స్ సిఇఒ సందీప్ రైజాదా మాట్లాడుతూ బుధవారం ప్రారంభించిన ఈ బస్సులతో దేశవ్యాప్తంగా మా బస్సులు నడిచే డిపోల సంఖ్య 69కి చేరిందని తెలిపారు.

# తెలంగాణ భవిష్యత్‌కు గ్లోబల్ సమ్మిట్ సరికొత్త దశ

అన్ని రంగాల హబ్‌గా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

సిఎల్‌పి 'చిట్‌చాట్'లో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్ఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భవిష్యత్తుకు గ్లోబల్ సమ్మిట్ సరికొత్త దిశ అని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, సమ్మిట్‌తో రాష్ట్రానికి దేశ, విదేశీ కంపెనీల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి విజన్‌కు, దూరదృష్టికి గ్లోబల్ సమ్మిట్ నిదర్శనమని పేర్కొన్నారు. మంచి మెజారిటితో మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకత్వంలో తెలంగాణకు బిసి అభ్యర్థి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. టిపిసిసి అధ్యక్ష పదవితో సంతృప్తిగా ఉన్నానని, సిఎంకు తనకు గ్యాప్ అసత్య ప్రచారమని తొసిపుచ్చారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం తనను కలిసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దావోస్ వల్ల రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఫోర్త్ సిటీ నిర్మాణం చారిత్రాత్మకమని, ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ రెండు ఒకటేనని పేర్కొన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తుందని, అన్ని రంగాల హబ్‌గా ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉంటుందని తెలిపారు. గత పదేళ్ళలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే చేసిందని అన్నారు.

### బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం..

బిఆర్ఎస్ పదేళ్లలో ఆర్థిక విధ్వంసం సృష్టించిందని, అభివృద్ధిని ఓర్వలేకనే హరీష్‌రావు విమర్శలు చేస్తున్నారని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కలే అని, గతం తప్ప బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాలు ఎవరు తీయలేరని, అధికారంలో ఉండి వాళ్లు పెట్టలేకపోయారని, అందుకే తాము పెట్టామని అన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది కాబట్టి తెలంగాణకు నిజమైన తల్లి సోనియా గాంధీ అని చెప్పారు. లావాదేవీల్లో తేడాల వల్లే కవిత విమర్శలు చేస్తుందని, కవిత వలన బిఆర్ఎస్ నేతల లూటీలు బయటకు వస్తున్నాయన్నారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సీఎం విచారణ జరపాలని కోరారు.

### ఈ నెలాఖరుకు కార్పొరేషన్ చైర్మన్లు, మిగిలిన చైర్మన్లు, బోర్డు పదవుల భర్తీ

ఈ నెలాఖరుకు కార్పొరేషన్ చైర్మన్లు, మిగిలిన చైర్మన్లు , బోర్డు పదవులు, నూతన పిసిసి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రచార కమిటీలు భర్తీ చేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా పోటీపై పార్టీ అధిష్టానానిదే తుది నిర్ణయామని అన్నారు. గ్రామ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక సాధారణ విషయం కాదని, స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. తన ప్రాంత అభివృద్ధి కోసం గతంలో 50 ఎకరాలు భూదానం చేశానని మహేష్‌కుమార్ గౌడ్ గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుగుతున్నాయని, ఇవిఎం కాంగ్రెస్ హయంలో ప్రవేశ పెట్టినప్పటికీ, ట్యాంపరింగ్ మాత్రం బిజెపి ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
GHMC ఆఫీస్ కాంప్లెక్స్, 4వ ఫ్లోర్, టాంక్ బండ్, హైదరాబాద్

ఆసక్తి వ్యక్తీకరణ (EOI) మరియు టెండర్ నోటీసు

NIT No. 3/SE/QCC/GHMC/EOI/2025-26 తేదీ 10-12-2025

విషయం : CRMP ఫేజ్ II రోడ్ల కోసం NSV, FWD & GPR ఉపయోగించి కాలినడకబాట పునరావాస (పేవ్‌మెంట్ రిహాబిలిటేషన్) అధ్యయనాలు మరియు నిర్మాణ మూల్యాంకనం కోసం కమిషనర్, GHMC, EOI/టెండర్ సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC తరపున ఆహ్వానిస్తున్నది.ఆసక్తి కలిగి ఉన్న ఏజెన్సీలు www.eprocurement.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న డాక్యుమెంట్ల రూపంలో సూచించిన ఫార్మాట్లలో పూర్తి వివరాలు సమర్పించవచ్చు. పైన పేర్కొన్న అన్ని ఇతర సమాచారంతో కూడిన పూర్తి డాక్యుమెంట్ ఫారమ్‌ను 18.12.2025న ఉదయం 11గంటల వరకు లేదా ఈ సమయంలోపు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక బిడ్‌లు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు తెరవబడతాయి. ఏమైనా ప్రశ్నలు ఉన్నట్లయితే O/o సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC, 4వ ఫ్లోర్, హెడ్ ఆఫీస్, ట్యాంక్ బండ్, హైదరాబాద్‌ను సంప్రదించవచ్చు. ఎలాంటి మరింత సమాచారాన్ని అయినా సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, 4వ ఫ్లోర్, GHMC కాంప్లెక్స్, GHMC కార్యాలయం పనివేళల సమయంలో (7995009080) మొబైల్ ఫోన్‌కాల్ నుండి పొందవచ్చు.

Sd/-సూపరింటెండింగ్ ఇంజనీర్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC.

DIPR R.O.No.11908-PP/CL/ADVT/1/2025-26 Date: 10-12-2025

## హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలి : జాజుల

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బుధవారం హైద్రాబాద్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. మెస్ బకాయిలు నెలలు గడుస్తున్నా విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదని 8నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడం సరికాదన్నారు. వెంటనే బకాయిలను చెల్లించడం తోపాటు వర్కర్లను, వార్డెన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



## సిపిఐ సర్పంచ్ అభ్యర్థి సుజాతను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

ప్రజాపక్షం/మర్రిగూడ: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కుదాబక్షపల్లి సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ఎరజాల సుజాతని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. మాజీ జెడ్‌పిటిసి మేతరి యాదయ్య కుదాబక్షపెల్లి ఎంపీటీసీ వరప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సురేష్, నవీన్ ఉన్నారు.



## ప్రాజెక్టు శంకుస్థాపన నేటితో 70 వసంతాలు పూర్తి..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు దేశానికే గర్వకారణం

ప్రాజెక్ట్ ఎస్ఇ మల్లికార్జున్



ప్రజాపక్షం/నందికొండ: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్ ప్రా జెక్టు శంకుస్థాపన జరిగి డిసెంబర్ 10 మంగళవారంతో 70 వసంతాలు పూర్తి తీసుకొని 71వ వసంతంలోకి అడుగు పెట్టింది. నాగార్జున సాగర్ డ్యాం శంకుస్థాపన దినోత్సవం సందర్భంగా డ్యాం సూపరింటెండ్ ఆఫ్ ఇంజనీర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు సిబ్బంది తో కలసి శంకుస్థాపన పిల్లర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్మిక స్మారక స్తూపం, సాగర్ ప్రాజెక్టు తొలి సీఈ జాఫర్ అలీ, కేఎల్ఎన్ రావు విగ్రహాల వద్ద ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు దేశానికే గర్వకారణంగా నిలిచిందని, దానిని కాపాడుట అందరి బాధ్యత అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు కార్యరూపం అనేది 1902 నుంచే ప్రారంభమైందని అప్పటినుండి స్థల విషయంలో ప్రాజెక్టు నిర్మాణ విషయంలో అనేక విధాలుగా వాయిదా పడుతూ చివరికి 1955 డిసెంబర్ 10న ఒక కొలిక్కి వచ్చి ప్రాజెక్టు ప్రారంభానికి తొలి బీజం పడిందని ఇంత గొప్ప చరిత్ర కలిగిన ప్రాజెక్టులో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, డి ఈ లు శ్రీనివాస్, ఆండాలు, ఎఇఇ లు నరసింహ మూర్తి, రమేష్, సాయి శ్రీ, శ్రీకాంత్, విజయ్ కుమార్జే,ఇ అజయ్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు జంగయ్య, డ్యాం భద్రతాధికారి జి శ్రీనివాసరావు ప్రాజెక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత రెండో రోజు ఎన్నికలు జరుగుతున్న భువనగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భువనగిరి మండలంలో ఎంత మందికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయని, ఇప్పటివరకు ఎంత మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజుతో రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో, పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను గుర్తించి వారికి బ్యాలెట్ పేపర్ ఇవ్వాలని తిరిగి సదరు ఓటరు తన ఓటు తన ఓటు బ్యాలెట్ బాక్సులో వేసే వరకు సంబంధిత అధికారులు గమనించాలన్నారు.

## పోలీసు పాత్ర కీలకమైంది : ఎస్‌పి



ప్రజాపక్షం/సూర్యాపేట : ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. డిసెంబర్ 11న జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా సూర్యాపేట మండల పరిధి ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి పట్టణంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్ నందు విధుల నిర్వహణపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు. బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలని, అనుమతిలేని వ్యక్తులను ఓటరు కానీ వారిని పరిసరాల్లో రానివ్వవద్దన్నారు. 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్లు సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తెస్తున్నారా అనే దానిపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమిష్టి బాధ్యత అన్నారు. దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తం

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నేడు జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల జరగనున్న నేపథ్యం లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఆదేశించారు. బుధవారం నల్లగొండ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు,సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ,పర్యవేక్షణ క్రమశిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ రోజు,ఎలక్షన్ తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు, పోలింగ్ కేంద్రాల దగ్గరా పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ల దగ్గర 163 బి.యన్.ఎస్.ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల లోపల ఎవ్వరినీ రానివ్వకూడదని ఓటు హక్కు వినియోగించుకోనే వారు పోలింగ్ కేంద్రాల కు ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్,ఇతర హాని కలిగించే వస్తువులు తీసుకురాకుండా జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు.

# నేడు తొలి విడత 'పంచాయతీ' షురూ

పంచాయతీ 'తొలిపోరు'కు సర్వం సిద్ధం

నేడు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్

సాయంత్రంలోగా ఫలితాలు వెల్లడి



ప్రజాపక్షం/సూర్యాపేట : గ్రామ పంచాయతీ తొలిపోరుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 8 మండలాల పరిధిలో 159 గ్రామ పంచాయితీలకు 1442 వార్డులకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 152 గ్రామ సర్పంచ్, 1244 వార్డులకు గురువారం (నేడు) ఎన్నికలు జరగనున్నాయి. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత ఎన్నికలు తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ మండలాల్లోని 159 గ్రామ పంచాయితీలకు సర్పంచ్, 1442 వార్డు మెంబర్ల ఎన్నికకు పోలింగ్ జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డులకు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటిని మినహాయించగా 152 గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, 1244 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ మొదలై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగియనుంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సాయంత్రం లోపు ఆయా గ్రామాల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల పేర్లను అధికారులు అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం స్టేజ్ 1 ఆర్ఓలుగా 52 మంది, స్టేజ్ 2 ఆర్ఓలుగా 178 మంది, 16 ఎఫ్ఎస్‌టి బృందాలు, 28 మంది జోనల్ అధికారులు, 65 రూట్లు 1686 మంది ప్రిసైడింగ్, 2260 మంది ఇతర ప్రెసిడెంట్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ 18 గుర్తింపు కార్డులకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఓటర్ గుర్తింపుకార్డుతో పాటు రేషన్, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులను ఓటర్లు తమ వెంట తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకపోవల్సి ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎన్నికలు జరిగే 8 మండలాల పరిధిలో బుధవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

**ఐదు అంచెల పోలీస్ భద్రత...**

**264 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తింపు**

తొలి విడత పోలింగ్ జరుగుతున్న ఎనిమిది మండలాల పరిధిలో ఐదు అంచెల భద్రతను పోలీసులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూతుల వద్ద, పోలింగ్ లొకేషన్‌ల వద్ద, 100 మీటర్ల పరిధి, 200 మీటర్ల పరిధిలో, స్ట్రైకింగ్ ఫోర్సు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎన్నికల నియమావళి అమలు టీమ్స్, రూట్ మొబైల్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 264 సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసు అధికారులు గుర్తించారు. ఈ ఎన్నికల్లో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, ఏనిమిది మంది డిఎస్‌పిలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 50 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులు కలిపి మొత్తం 1500 మందితో భారీబందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఆన్‌లైన్ వెబ్‌కాస్టింగ్ ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా ఈ కేంద్రాలలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, సిసి కెమెరాలు, కెమెరాలతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు.

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14మండలాలలో 296 సర్పంచ్‌లు.. 2,491వార్డులు

ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామ పంచాయతీ తొలి విడత పోలింగ్ తొలి తీర్పు గురువారం వెలువడనున్నది. పంచాయతీల్లో మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. జిల్లాలోని నల్లగొండ, చండూరు డివిజన్ లోని 14 మండలలో చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కెట్ పల్లి, శాలిగౌరారం,తిప్పర్తి మండలాలలోని 318 పంచాయతీల్లో సర్పంచు లకు,వార్డు సభ్యులకు 2870 పోలింగ్ కేంద్రాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.ఇప్పటికే నామినేషన్ ఉపసవరణ గడువు రోజు 22 సర్పంచి పదవులు, 375 వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది మిగిలిన 296 పంచాయతీలకు, 2491 వార్డు సభ్యులకు ఎన్నిక జరగనుంది. సర్పంచి పదవులకు 966 మంది, వార్డు సభ్యులకు 5,934 మంది పోటీ పడుతున్నారు.ఇందుకుగాను పిఒ ఓపిఓ లు రెండవ ఓ పి ఓ మొత్తం కలుపుకొని 7892 మందిని విధులు నిర్వహించే విధంగా రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో పిఓలు 3444,ఓపిఓలు 4448 మంది ఈ ర్యాండమైజేషన్ లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు.

### ఉదయం పోలింగ్..మధ్యాహ్నం లెక్కింపు

గురువారం ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగుతుంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

## హత్య కేసులో 8 మంది నిందితుల అరెస్టు

ఎఎస్‌పి రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడి



ప్రజాపక్షం/నూతనకల్ : మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉప్పల మల్లయ్య హత్య కేసులో 8 మంది నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎఎస్‌పి రవీందర్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. లింగంపల్లి గ్రామానికి చెందిన ఉప్పల మల్లయ్య కోడలు శైలజ 4వ వార్డు సభ్యురాలిగా పోటీలో ఉండి ప్రచారం నిర్వహిస్తుందన్నారు. ఆమెకు పోటీగా అదే వార్డు నుండి ఆకుల రజిత వర్గానికి చెందిన వారు వార్డుమెంబర్‌గా పోటీ చేశారు. ఇరు వర్గాలు ప్రచారంలో భాగంగా ఎదురుపడి జువ్వాడ వెంకటేశ్వర్లు ఇంటి సమీపంలో కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్ళతో మల్లయ్యపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా వనస్థలిపురం సమీపంలో మృతి చెందినట్లు తెలిపారు. దాడిచేసిన వారిలో ఏ1గా ఉప్పల సతీష్, ఏ2గా కొరివి గంగయ్య, ఏ3గా వీరబోయిన సతీష్, ఏ4గా ఉప్పల గంగయ్య, ఏ5గా ఉప్పల యలమంచి, ఏ6గా వీరబోయిన లింగయ్య, ఏ7గా కారింగుల వెంకటేశ్వర్లు, ఏ8గా దేశపంగు అవిలయ్యను గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుండి రెండు కర్రలు, ఒక మంచం అడ్డపట్టే కర్ర, మూడు రాళ్ళు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, తుంగతుర్తి సిఐ ఏ నరసింహారావు, నూతనకల్ ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

# ప్రతి పనికీ 'ఓ రేటు'!

పైసలు ఇవ్వనిదే ఫైల్ కదలదు...

సూర్యాపేట మున్సిపల్ రెవెన్యూ విభాగంలో అవినీతి తాండవం



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటిలోని రెవెన్యూ విభాగంలో అవినీతి కంపు కొడుతుంది. వివిధ పనుల కోసం వచ్చే వారి వద్ద ప్రతి పనికి ఒక రేటు ఖరారు చేసి అధికారులు అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారు. వారికి పైసలు ముందుగా ఇస్తే తప్ప ఫైల్ కదలని పరిస్థితి. వీరి అవినీతి, అక్రమాలపై ప్రజలు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఆదర్శ మున్సిపాలిటిగా గుర్తింపు పొందిన సూర్యాపేట గ్రేడ్ 1 మున్సిపాలిటీ ప్రతిష్ట కొంతమంది అవినీతి అధికారులతో మసకబారుతుంది. మున్సిపాలిటీలోని ప్రతి విభాగంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ విభాగంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఈ విభాగంలో ఒక రెవెన్యూ అధికారితో పాటు, నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 16 మంది బిల్ కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాకుండా మరికొంత మంది కార్యాలయ సిబ్బంది కూడా ఉన్నారు. రెవెన్యూకు సంబంధించి కీలకంగా రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లే చూసుకోవడం జరుగుతుంది. మున్సిపాలిటికి ప్రజల నుండి రావల్సిన ప్రతి పైసా వీరి నుండే సమకూరుతుంది. వివిధ పనుల కోసం తమ దగ్గరికి వచ్చే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిన వారు ప్రతి పనికి ఒక రేట్ ఖరారు చేసి వారి నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు. నూతనంగా నిర్మించిన ఇండ్లకు ఇంటి నెంబర్లు, ఆస్థి మార్పిడి, ఇంటి పన్ను ఖరారు చేయడం లాంటి కీలక పనులు వీరు చేయాల్సి ఉంది. ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుండి అక్రమంగా రూ.3 వేల నుండి రూ.5వేల వరకు, ఆస్థి మార్పిడి కోసం రూ.20వేల నుండి రూ.25వేలు, ఇంటి పన్ను ఖరారు చేసే సమయంలో కొలతలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం నిర్ణయించాల్సి ఉన్నా అలా చేయకుండా తక్కువ చూపుతూ గృహ యజమానుల వద్ద బేరసారాలు ఆడి రూ. లక్షల్లో దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కొన్ని ఖాళీ స్థలాలకు ఇల్లు నిర్మించినట్లుగా ఇంటి నెంబర్లు ఇచ్చి భారీ మొత్తంలో డబ్బులు దండుకున్న సందర్భాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇందిరమ్మ కాలనీ ఏరియా పరిధిలో పని చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అవినీతి, అక్రమాలకు పాల్పడగా అవి బయటపడడంతో కొన్ని రోజులు అతనిని విధులకు దూరంగా పక్కకు పెట్టారు. కొద్ది రోజుల తరువాత అతడిని తిరిగి అధికారులు తీసుకవచ్చి అదే స్థానంలో కూర్చోబెట్టడం గమనార్హం. దీంతో అతగాడు మరింతగా రెచ్చిలపోయి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కుడ కుడ ప్రాంతంలో విధులు నిర్వహించే ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గత రెండు నెలల క్రితం పదోన్నతిపై మిర్యాలగూడ మున్సిపాలిటికి బదిలీపై వెళ్ళారు. అతడి బాధ్యతలను చూస్తున్న మరొక అధికారి వివిధ పనుల కోసం తమ విభాగానికి వచ్చే వారి నుండి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారని బహిరంగంగానే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ మాజీ పోలీస్ అధికారి ఓ భవనాన్ని కొనుగోలు చేసి పేరుమార్పిడి కోసం గత కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటిలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఆస్థి కొనుగోలు చేసినప్పుడే రిజిస్ట్రేషన్ అధికారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు కూడా తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆ ఫైల్ నేరుగా మున్సిపాలిటిలోని రెవెన్యూ విభాగానికి చేరగానే వారం రోజుల లోపు అమ్మిన వారి పేరు మీద నుండి కొనుగొలు చేసిన తన పేరు మీదికి అధికారులు మార్చాల్సిన బాధ్యత ఉందని వాపోయారు. కానీ పేరు మార్పిడి కోసం రెవెన్యూ విభాగం చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే మీరేమిస్తారో చెప్పండంటూ కిందిస్థాయి ఉద్యోగుల ద్వారా బేరసారాలు ఆడుతున్నారని చెప్పారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి.

**వచ్చింది అందరికి పంచాల్సిందే...**

రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కిందిస్థాయి ఉద్యోగులను ప్రశ్నిస్తే తమకు వచ్చిందంతా అందరికి పంచాల్సిందేనని అదిపోగా తమకు మిగిలేది కొంతేనని బహిరంగంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఒక్కొక్క పర్సెంటేజ్ చొప్పున ఇచ్చిన తర్వాతే ఫైల్స్‌పై సంతకాలు పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా తాము వారికి ప్రతినిత్యం వేలాది రూపాయలు ఇస్తున్నామని, ఇచ్చేవి కూడా నగదు రూపంలోనైతేనే తీసుకుంటున్నారని ఓ ఉద్యోగి చెప్పకనే చెప్పారు.

**ఆరోపణలలో వాస్తవం లేదు...**

**రెవెన్యూ అధికారి కళ్యాణి**

రెవెన్యూ విభాగంలో అవినీతి, అక్రమాలకు తావు లేదని, తమపై వస్తున్న ఆరోపణలలో ఏ మాత్రం వాస్తవంలేదని సూర్యాపేట మున్సిపాలిటి రెవెన్యూ అధికారి కళ్యాణి అ న్నారు. అవినీతి, అక్రమాలపై ఆమెను ప్రజాపక్షం వివరణ కోరగా కొంతమంది గిట్టనివారు పని కట్టుకొని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. వివిధ పనుల కోసం వచ్చే వారి పనులను త్వరితగతిన పూర్తి చేసి తమ వద్ద ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చూసుకుంటున్నామని చెప్పారు.



## ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/నూతనకల్ : గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బంది నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఎలాంటి ప్రలోభాలకు గురైనా, విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం స్టేజీ 2 ఆఫీసర్లతో పాటు పోలింగ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించి వారికి కేటాయించిన గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి కేటాయించినటువంటి పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నియమావళి ప్రకారము ఎన్నికల సమయము పూర్తయ్యే వరకు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులకు గురైన ఎన్నికల ప్రత్యేక అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని, సిసి కెమెరాలతో పాటు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, మండల విద్యాధికారి రాములు నాయక్ పాల్గొన్నారు.

## జిల్లాలో ఊపందుకున్న ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు

6 రోజుల్లో 6 శాతం నుండి 28 కిచేరుకున్నదరఖాస్తులు


ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలోని పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకుగాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. జిల్లాలో మండలాల వారిగా 13,194 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాల్సి ఉండగా, గత వారం వరకు కేవలం 6 మాత్రమే ఉన్న ఉపకార వేతనాల దరఖాస్తులు 6 రోజుల్లో 28 శాతానికి పెరిగాయి. ఇందుకు జిల్లా కలెక్టర్ వారంలో రెండుసార్లు ఉపకార వేతనాలపై విద్యాశాఖ అధికారులు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల అప్ లోడ్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ప్రత్యేకించి పీఏ పల్లి మండలంలో 90 శాతం దరఖాస్తుల స్వీకరణను పూర్తి చేసి ముందు వరుసలో నిలిచింది. అనంతరం తిరుమలగిరి సాగర్, ఇతర మండలాలు దరఖాస్తుల స్వీకరణ లో ముందున్నాయి. ఇప్పటివరకు 13194 గాను, 3711 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్నారని, తక్కిన వారి చేత దరఖాస్తులను సమర్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ప్రకటనలో కోరారు. ఇందుకు విద్యాశాఖ అధికారులతో పాటు, సంక్షేమ శాఖ అధికారులు ,బ్యాంక్ అధికారులు సహకరించాలని, తహసీల్దారులు సైతం విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువపత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలని చెప్పారు.

## పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

ఎన్నికల డిఆర్‌సి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/మునుగోడు: గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల ఎన్నికల అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఏర్పాటుచేసిన డిఆర్‌సి కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ,స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేసే సమయంలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ పేపర్ల ప్రాధాన్యతను తెలియజేయాలని, అలాగే ప్రతి పోలింగ్ టీం వారికి సంబంధించిన జోనల్ అధికారి, రూట్ అధికారుల ఫోన్ నెంబర్లు కలిగి ఉండాలని తెలిపారు.ప్రిసైడింగ్ అధికారులు పి ఓ డైరీ నిర్వహణ,టెండర్,ఛాలెంజ్ ఓట్ల విషయంలో తీసుకొనే జాగ్రత్తలు మరోసారి తెలియజేయాలని చెప్పారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## టెక్స్‌టైల్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం

20కి పైగా దుకాణాలు దగ్ధం



**సూరత్ :** టెక్స్‌టైల్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఏకంగా ఆ టెక్స్‌టైల్ దుకాణ సముదాయంలోని 20కి పైగా షాపులకు మంటలు అంటుకున్నాయి. గుజరాత్ రాష్ట్రం సూరత్ నగరంలోని పర్వత్ పటియా ఏరియాలోగల రాజ్ టెక్స్‌టైల్ మార్కెట్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఏడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భవనం మొదటి అంతస్తు లిఫ్టులో చెలరేగిన మంటలు వేగంగా ఏడో అంతస్తు వరకు వ్యాపించాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో ఏకంగా నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.



## మోదీ తన సమయంలో సగం దేశం వెలుపలే...

రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనపై ఎందుకు ప్రశ్నిస్తున్నారు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ నిలదీత

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వచ్చే వారం జర్మనీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటనపై బిజెపి విమర్శలకు చేసింది. దీంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాషాయ పార్టీ విమర్శలకు దీటైన జవాబిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు సగం పని సమయాన్ని దేశం వెలుపల గడుపుతుండగా, ప్రతిపక్ష నాయకుడిపై వారు ఎందుకు ప్రశ్నలు లేవనెత్తుతున్నారని నిలదీశారు. డిసెంబర్ 15 నుండి 20 వరకు రాహుల్ గాంధీ జర్మనీలో పర్యటిస్తారని, ఆ సమయంలో ఆయన భారతీయ డయాస్పోరాతో సంభాషిస్తారని, జర్మన్ మంత్రులను కలుస్తారని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలిపింది. కాగా, రాహుల్ ఎల్‌ఒపి – పర్యటన్ నాయకుడు అని బిజెపి గాంధీ పర్యటనపై విమర్శించింది. గాంధీపై బిజెపి విమర్శలు గురించి ప్రశ్నించగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'మోదీ జీ తన పని సమయంలో దాదాపు సగం దేశం వెలుపల గడుపుతారు... ప్రతిపక్ష నాయకుడు (లోక్‌సభలో) ప్రయాణంపై వారు ఎందుకు ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. అంతకుముందు, జర్మనీలోని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ మాట్లాడుతూ 'పార్లమెంటు సభ్యుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుండి 20 వరకు జర్మనీలో పర్యటిస్తారు. ఆయనతో పాటు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ సామ్ పిట్రోడా కూడా ఉంటారు అని అన్నారు.

## మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది

# మావోయిస్టులు లొంగుబాటు

**గడ్చిరోలి/కాంకర్ :** ఇటీవలి కాలంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. తాజాగా ఇరు రాష్ట్రాల్లో కలిపి 15 మంది నక్సల్స్ సరెండర్ అయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం 11 మంది సీనియర్ నక్సలైట్లు డిజిపి రష్మి శుక్లా ఎదుట లొంగిపోయారని అధికారులు తెలిపారు. వారిపై తలలపై సమష్టిగా రూ.82 లక్షల రివార్డు ఉందన్నారు. డిజిపి ముందు మావోయిస్టులు ఆయుధాలు వీడుతున్నప్పుడు వారిలో నలుగురు 'యూనిఫాంలో ఉన్నారని వారు తెలిపారు. పౌరులపై జరుగుతున్న బుద్ధిహీన హింసతో విసుగు చెంది, 2005 నుండి మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు కమ్ పునరావాస విధానానికి ఆకర్షితులవుతున్నట్లు, బోలు మావోయిస్టు భావజాలం పట్ల పెద్ద సంఖ్యలో కేడర్లు భ్రమపడిపోయారని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గడ్చిరోలి పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సమష్టి ప్రయత్నాల కారణంగా, ఈ సంవత్సరం జిల్లాలో 112 మంది మావోయిస్టు కేడర్లు లొంగిపోయారని పేర్కొన్నారు. బుధవారం లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యులు గడ్చిరోలి నివాసి రమేష్ లేకామి (57), భీమ కోవాసి (35), ప్లాట్‌ఫామ్ పార్టీ కమిటీ సభ్యులు పోరియే గోటా (41), రతన్ ఓయం (32), కమల్ వెలాడి (30) ఉన్నారు. వీరందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారేనని పోలీసులు ఆ ప్రకటనలో వెల్లడించారు. ఆయుధాలు విడిచిపెట్టిన ఇతర వ్యక్తులలో ఏరియా కమిటీ సభ్యులు పోరియే వెలాడి (36), రామాజీ పుంగటి (35), ప్లాటూన్ సభ్యులు సోను కటో (19), ప్రకాష్ పుంగటి (22), సీతా పల్లో (22), సాయినాథ్ మాడే (23) ఉన్నారు. మావోయిస్టుల బృందం లొంగిపోతే, వారి పునరావాసం కోసం కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి సహాయంగా మొత్తం రూ.10 లక్షల బహుమతిని ప్రకటించాయని పోలీసు శాఖ తెలిపింది. గడ్చిరోలి పోలీసులు నిర్వహించిన మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేయడం, మావోయిస్టులు లొంగిపోయి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి ప్రభుత్వం అందించిన అవకాశం కారణంగా, 2022 నుండి జిల్లాలో 146 మంది హార్డ్‌కోర్ నక్సలైట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టారని, ఇందులో ఈ సంవత్సరం 112 మంది ఉన్నారని అది తెలిపింది.

**ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు...**

2009లో మదన్వాడ–కోర్కోటి దాడిలో 29 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న దాడిలో పాల్గొన్న నలుగురు నక్సలైట్లు బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో లొంగిపోయారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇద్దరు మహిళలు సహా ఈ కేడ



ర్లపై సమిమష్టిగా రూ.23 లక్షల రివార్డు ఉందని ఆయన చెప్పారు. 'పూనా మార్గెమ్ (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు)' చొరవ కింద వారు సీనియర్ పోలీసు, సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని కాంకర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎకె ఎలెసెలా తెలిపారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన ఈ చొరవ, కాంకర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి, గౌరవం, సమగ్ర పురోగతిని నెలకొల్పడానికి ఒక పరివర్తనాత్మక చొరవగా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. లొంగిపోయిన కార్యకర్తలలో, గడ్చిరోల్ (మహారాష్ట్ర) మావోయిస్టుల విభాగంలో సభ్య కంపెనీ నంబర్ 10గా క్రియాశీలకంగా ఉన్న కాజల్ అలియాస్ రజితా వేదాడ (19)కు రూ.8 లక్షల రివార్డు ఉందని ఆయన చెప్పారు. మరో ముగ్గురు మంజుల అలియాస్ లక్ష్మీ పోటై (37), విలాస్ అలియాస్ చైతు ఉసేండి (42), రామ్‌సాయి అలియాస్ లఖన్ మర్రాపి (42) ఒక్కొక్కరికి రూ.5 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. 2006–2025 మధ్య, పశ్చిమ బస్తర్ డివిజన్ సాంకేతిక బృందం సభ్యుడు పోటై 16 సంఘటనలలో పాల్గొన్నాడు. 2009 మదన్వాడ–కోర్కోటి ఆకస్మిక దాడిలో అప్పటి రాజ్‌నంద్‌గావ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) వినోద్ చౌబే, 28 మంది ఇతర భద్రతా సిబ్బంది మరణించారని ఆయన అన్నారు. అదేవిధంగా, 2004 నుండి 2025 వరకు, ఏరియా కమిటీ సభ్యుడు అయిన మర్రాపి 42కి పైగా మావోయిస్టు సంఘటనలలో పాల్గొన్నాడు. వాటిలో 2008 గుమ్డిదీకొండ ఆకస్మిక దాడిలో ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, 2019 మహ్లా ఆకస్మిక దాడిలో నలుగురు జవాన్లు మరణించారని ఆయన చెప్పారు. పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ. 50,000 తక్షణ సహాయం అందించబడిందని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం మావోయిస్టులను ఆకర్షిస్తోంది. లొంగిపోతున్న వారి కుటుంబాలు కూడా వారు సాధారణ జీవితాలను గడపాలని, సమాజంతో చేయి చేయి కలిపి ముందుకు సాగాలని కోరుకుంటున్నాయి అని ఎలెసెలా అన్నారు. గత రెండేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లో అగ్రశ్రేణి క్యాడర్‌లతో సహా 2,380 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని తెలిపారు.

**లొంగిపోయిన నక్సలైట్లపై కేసుల సమీక్షకు కేబినెట్ సబ్ కమిటీ**

లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన క్రిమినల్ కేసులను సమీక్షించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బుధవారం ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉపసంహరణకు అర్హత ఉన్న కేసులను సబ్ కమిటీ ప్రభుత్వం సిఫార్సు చేసిందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి అధ్యక్షతన తన అధికారిక నివాసంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. పోలీసుల ప్రకారం.... గత రెండేళ్లలో రాష్ట్రంలో 2,380 మందికిపైగా నక్సలైట్లు లొంగిపోయారు. 'లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన క్రిమినల్ కేసులను పరిష్కరించే/ఉపసంహరించుకునే ప్రక్రియను మంత్రివర్గం ఆమోదించింది. లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన కేసులను సమీక్షించి పరిశీలించడానికి క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటిని కోర్టుల నుండి ఉపసంహరించుకోవచ్చు. తుది నిర్ణయం కోసం కమిటీ ఈ కేసులను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం కోసం క్యాబినెట్ ముందు సమర్పిస్తుంది' ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్ నక్సలైట్ సరెండర్/బాధితుల ఉపశమనం, పునరావాస విధానం2025 నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది లొంగిపోయిన కేడర్లపై నమోదైన కేసులను పరిష్కరించడాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని, వారి సత్ప్రవర్తన, నక్సలిజం నిర్మూలనకు వారి సహకారాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపింది. జిల్లా స్థాయి కమిటీ మొదట లొంగిపోయిన ప్రతి కేడర్ పెండింగ్ క్రిమినల్ కేసులను పరిశీలించి, తన నివేదికను పోలీసు ప్రధాన కార్యాలయానికి సమర్పిస్తుంది, ఇది తన అభిప్రాయంతో పాటు ప్రతిపాదనను పంపుతుంది. ప్రభుత్వం న్యాయ శాఖ అభిప్రాయాన్ని పొందుతుంది. తరువాత కేసులను క్యాబినెట్ సబ్‌కమిటీకి సమర్పిస్తుంది, ఇది తుది నిర్ణయం కోసం క్యాబినెట్‌కు సిఫార్సులను పంపుతుంది అని తెలిపింది.




## ఓట్ చోరీకి ఇసిని బిజెపి అస్త్రంగా మార్చుకుంటోంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** 'ఓట్ చోరీ'కి సంబంధించి బిజెపి, ఎన్నికల కమిషన్‌పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఓట్ చోరీకి ఎన్నికల కమిషన్‌ను బిజెపి ఒక అస్త్రంగా మార్చుకుందని తాజాగా మండిపడ్డారు. మంగళవారం ఎన్నికల సంస్కరణపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తాను చేసిన ప్రసంగం క్లిప్‌ను రాహుల్ ఎక్స్‌లో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారతదేశ ప్రజలు సిజెఐని ఇసిని ఎంపిక ప్యానెల్ నుండి ఎందుకు తొలగించారు? 2024 ఎన్నికలకు ముందు ఇసికి దాదాపు పూర్తి చట్టపరమైన రోగనిరోధక శక్తి ఎందుకు ఇవ్వబడింది? 45 రోజుల్లోపు సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి ఎందుకు తొందర పడ్డారు? వంటి మూడు ముఖ్యమైన, ప్రత్యక్ష ప్రశ్నలను అడుగుతున్నారన్నారు. ఎన్నికల సంఘాన్ని బిజెపి ఓటు చోరీ కోసం సాధనంగా మారుస్తోందని ఆరోపించారు. మంగళవారం ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్‌గాంధీ బిజెపి, ఎన్నికల సంఘం భారతదేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి, ప్రజల గొంతును అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ఒక నెల ముందు అన్ని పార్టీలకు మెషిన్ రీడబుల్ ఓటరు జాబితాను అందించాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌లను నాశనం చేయడానికి అనుమతించే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇవి ఎంలను యాక్సెస్ చేయడానికి అనుమతి ఇవ్వాలని, ఎన్నికల కమిషనర్లు వారు ఏమి చేయాలనుకున్నా తప్పించుకోవడానికి అనుమతించే చట్టాన్ని మార్చాలని గాంధీ సభలో పలు సూచనలు చేశారు.

## రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్



**న్యూఢిల్లీ :** దేశంలో ఫోరెన్సిక్ సామర్థ్యాలను పెంపొందించడంపై హోంమంత్రి అమిత్ షాకు బిజెపి ఎంపి పోస్టు చేసిన ప్రశ్నను ఎలాంటి వివరణ లేకుండా ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు బుధవారం రాజ్యసభలో వాకౌట్ చేశాయి. బిజెపి ఎంపి ఆదియా ప్రసాద్ హోంమంత్రికి ఒక ప్రశ్న వేశారు. దీనిని స్టార్‌డ్ ప్రశ్నగా అంగీకరించారు. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం ఇవ్వా లి. రాజ్యసభ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ప్రశ్నల జాబితా ప్రకారం బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రసాద్ ప్రశ్న నం.2గా ఉంది. అయితే, ఒక దిద్దుబాటు నోట్‌లో ప్రశ్నను ఉపసంహరించబడినట్లు పరిగణించవచ్చని పేర్కొంది. చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రశ్నను దాటవేసి తదుపరి ప్రశ్నకు వెళ్ళినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు ఎస్ జైరాం రమేష్, ఇతరులు ప్రశ్నను ఎందుకు ఉపసంహరించుకున్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. 'మీకు నియమాలు తెలుసు. రూల్ 53 సభ్యుడు తనకు నచ్చిన విధంగా ఏదైనా ప్రశ్నను ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తుంది' అని చైర్మన్ అన్నారు. మీరు కోరుకుంటే మీరు కూడా ఉపసంహరించుకోవచ్చని, సభ్యుల హక్కులలో జోక్యం చేసుకోలేన్నారు. ప్రతిపక్ష ఎంపిలు ఒత్తిడి చేయడంతో రాధాకృష్ణన్ వారికి దానిని లేవనెత్తే హక్కు లేదన్నారు. సంబంధిత సభ్యుడిని ప్రశ్న అడగమని వారు చేసిన విజ్ఞప్తిని కూడా రాధాకృష్ణన్ తిరస్కరించారు. 'నేను ఎందు కు చెప్పాలి? నాకు చెప్పే హక్కు లేదు. అది ఆయన ఇష్టం. మీరు రేపు కొన్ని ప్రశ్నలను ఉపసంహరించుకోవచ్చు. అందులో నేను జోక్యం చేసుకోను' అని ఆయన అన్నారు, ఈ అంశంపై ప్రతిపక్ష ఎంపిలు చెప్పేది ఏదీ రికార్డులో ఉండకూడదని ఆదేశించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలిగించవద్దని ఆయన వారిని కోరుతూ, ఎజెండాలో పేర్కొన్న ప్రశ్నలతో ఆయన ముందుకు సాగారు. చైర్మన్ జవాబుతో సంతృప్తి చెందని ప్రతిపక్ష ఎంపిలు సభలో వాకౌట్ చేశారు.

## అసలు 'ఇండిగో సంక్షోభం' ఎందుకు తలెత్తింది?

కేంద్రాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు

సంక్షోభ సమయంలోనూ టికెట్ ధర అమాంతం రూ.40 వేలకు పెరగడమా? అని బెంచ్ విస్మయం

జనవరి 22 నాటికి సీల్డ్ కవర్‌లో ఒక నివేదికను సమర్పించాలని కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** ఇండిగో అనేక విమాన సర్వీసులను రద్దు చేయాల్సిన పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిని ఒక 'సంక్షోభం' అని వ్యాఖ్యానించింది. ఇండిగో సంక్షోభంపై బుధవారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విమాన టికెట్ ధరలు ఇలాంటి సమయంలోనే అమాంతం ఎందుకు పెరిగిపోయాయని అడిగింది. చిక్కుకుపోయిన ప్రయాణికులకు కలిగిన కష్టాలు, వేధింపులతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు సంభవించిన నష్టాల గురించి కూడా ప్రశ్న ఒకటి ఉందని హైకోర్టు పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెదెలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ ఈ సంక్షోభ పరిస్థితిని ఇతర విమానయాన సంస్థలు ఒక ప్రయోజనంగా మలుచుకుని ప్రయాణికుల నుంచి టికెట్ల కోసం ఎంత పెద్ద మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తాయని ప్రశ్నించింది. రూ.5,000కు లభించే టికెట్ ధరలు, రూ.30,000 నుండి రూ.35,000కు ఎలా పెరిగాయి?. సంక్షోభం ఉంటే ఇతర విమానయాన సంస్థలు ఎలా ప్రయోజనం పొందగలవు?. అది (టికెట్ ధర) ఎలా రూ.35,000 మరియు రూ.39,000ల వరకు ఎలా పెరుగుతుంది?. ఇతర విమానయాన సంస్థలు టికెట్ ధరలు పెంచడం ఎలా ప్రారంభించగలవు?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ విషయమై గంటన్నరకు పైగా విచారణ జరిగింది. కమిటీ ప్రారంభించిన దర్యాప్తు పూర్తి అయితే తదుపరి విచారణ తేదీ అయిన జనవరి 22నాటికి ఒక సీల్డ్ కవర్‌లో కోర్టుకు ఒక నివేదిక సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. 'పౌరవిమానయాన శాఖ, డిజిసిఏ తీసుకున్న చర్యలను ధర్మాసనం అభినందించింది. కానీ దేశంలోని విమానాశ్రయాలలో లక్షలాది మంది చిక్కుకుపోవడానికి దారితీసిన అటువంటి పరిస్థితులు ఎలా ఏర్పడటానికి ఎలా అనుమతించబడిందనేది మమ్మల్ని బాధపెడుతోంది. ఇది ప్రయాణికులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను కూడా ప్రభావితం చేసింది. ఎందుకంటే ప్రస్తుత కాలంలో ఆర్థికవ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయాణికుల ప్రయాణం వేగంగా ఉండాలనేది ఒక ముఖ్యమైన అంశం' అని ధర్మాసనం చెప్పింది. కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఏ) తరఫు న్యాయవాది కోర్టుకు తన వాదనలు వినిపించారు. 'చట్టబద్ధమైన యంత్రాంగం పూర్తిగా యథాతథంగా ఉంది. ఇండిగోకు షోకాజ్ జారీ చేయబడింది. వారు క్షమాపణలు చెప్పారు. విమాన సిబ్బందికి విమాన విధుల వేళలతో సహా అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించకపోవడం వల్ల సంక్షోభం తలెత్తింది' అని ప్రభుత్వ న్యాయవాది వివరించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ పెరుగుదలను నియంత్రించి, పరిమితం చేశామని, ఇది గతంలో ఎప్పుడూ జరగలేదని అది తెలియజేసింది. విచారణ సందర్భంగా, ఎటువంటి పరిశోధన, డాక్యుమెంటేషన్ లేకుండా పిటిషన్ దాఖలు చేసిన తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఊహించని సమస్యలు సహా అనేక కారణాల వల్ల సంక్షోభం ఏర్పడిందని ఇండిగో తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. విమాన సర్వీసు రద్దుకు మాత్రమే కాకుండా, వారికి కలిగిన ఇతర ఇబ్బందులకు కూడా పరిహారం చెల్లించడానికి ఏర్పాట్లు చేయాలని కోర్టు విమానయాన సంస్థను ఆదేశించింది. ఈ పరిస్థితి త్వరలోనే సమసిపోయేలా చూడాలని, అన్ని విమానయాన సంస్థలు తగినంత సంఖ్యలో పైలట్లను నియమించుకోవాలని కూడా ఢిల్లీ హైకోర్టు అధికారులను ఆదేశించింది.

## స్థానిక ఎన్నికల్లో కేంద్రమంత్రి ఎలా ఓటు వేస్తారు?

సిపిఐ నాయకుడు వివిఎస్ అనిల్ కుమార్ నిలదీత

**తిరువనంతపురం :** కేంద్రమంత్రి సురేష్ గోపి తిరువనంతపురం నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా ఓటు వేయగలరో తెలియజేయాలని సిపిఐ నాయకుడు వివిఎస్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుండి తన ప్రత్యర్థిగా ఉన్న సునీల్ కుమార్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో, గోపి, కుటుంబం గత లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్‌లోని నెట్టిస్సేరి నుండి ఓటు వేశారని, తాను అక్కడ శాశ్వత నివాసి అని చెప్పుకున్నారని చెప్పారు. మంగళవారం కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల మొదటి దశలో గోపి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని శాస్తమంగళం వార్డులో ఓటు వేశారు. ఇది ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తూ ఎన్నికల కమిషన్, కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వాలని సిపిఐ నేత తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుండి సురేష్ గోపి చేతిలో సునీల్ కుమార్ దాదాపు 75,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడవ స్థానంలో నిలిచింది.

## 'సర్' అంటే దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు చేయడమే: ఒవైసీ

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమీక్ష (సర్) అంటే దొడ్డిదారిన ఎన్.ఆర్.సి (ఎంపిక చేసిన జాతీయ పౌరుల జాబితా) అమలు చేయడం తప్ప మరొకటి కాదని లోక్‌సభలో ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. లోక్‌సభలో బుధవారం ఎన్నికల సంస్కరణలపై కొనసాగిన చర్చలో ఒవైసి పాల్గొన్నారు. మతం ప్రాతిపదికపై ప్రజలను ఎంపికచేసి మిగిలినవారిని ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసేందుకు మోసపూరితంగా అధికారాలను దుర్వినియోగం చేయడమే ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణలోని అంతరార్థమని ఒవైసి విమర్శించారు. ఓటు హక్కును ఒక ప్రాథమిక హక్కుగా చేయాలని, ఎన్నికల సంస్కరణలపై ఒక ఏకాభిప్రాయాన్ని నిర్మించాలని పిలుపు ఇచ్చారు. ''ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం పార్లమెంటు ద్వారా చేసిన శాసనాలను ఉల్లంఘించిందని మొట్టమొదట నేను చెప్పదలచుకున్నా, పార్లమెంటు నిర్దేశించిన హక్కులను 'సర్' ఉల్లంఘించింది, ఈ దేశంలో ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు కంటే, పార్లమెంటు కంటే గొప్పదికాదు, ప్రతి పౌరుడూ ఫారమ్–6 లో పేర్కొన్న ఆరు పత్రాలలో ఏదో ఒక పత్రాన్ని సాక్ష్యంగా సమర్పించడం ద్వారా భారత పౌరుడుగా స్వీయ నిర్ధారణ చేసుకునే ప్రాతిపదికపై ఓటర్ల జాబితాలను తీర్చిదిద్దాలి. ఈ సాక్ష్యాలతో ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలి, ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న ఈ విషయాన్ని నేను ఈ లోక్‌సభ దృష్టికి తీసుకు వస్తున్నా, పార్లమెంటు ఆమోదించిన చట్టం ఇదే, ఈ చట్టం ప్రకారమే ఓటర్ల జాబితాలు రూపొందాలి, ఒకసారి ఒక వ్యక్తి ఓటర్ల జాబితాలో చేరిన తర్వాత వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించకూడదు, అంటే వారి పౌరసత్వం చెల్లుబాటుపై ఎలాంటి విచారణ జరపకుండా తొలగించకూడదు, ఏ సందేహం కారణంగా వారిని ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారనే విషయాన్ని తెలియజేయాలి, వారిని వారు నిరూపించుకోవడానికి ఒక అవకాశం ఇవ్వాలి లాల్ బాబు హుస్సేన్ కేసులో తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకే ఒక తీర్పు ప్రకటించింది, ఈ మార్గదర్శకాలను పాటించాలి'' అని ఒవైసి లోక్‌సభ దృష్టికి తెచ్చారు. కానీ ఇప్పుడు ఎన్నికల సంఘం సాక్ష్యం తెచ్చుకోవాలంటూ ఒక పెద్ద భారాన్ని ఓటర్లమీద పడేసిందని అఖిల భారత మజ్లిస్–ఎ–ఇత్తెహదుల్ ముస్లిమీన్ నాయకుడు అన్నారు. ఇదంతా పార్లమెంటు చేసిన ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని తోసిపుచ్చారు. 2003 నాటి ఓటర్ల జాబితాను ఏకపక్షంగా ఒక మూలాధారంగా నిర్ధారించారని, హోంమంత్రిత్వశాఖ తరహాలో పౌరసత్వానికి సంబంధించిన నిర్ధారణలు చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదని ఒవైసి అన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ద్వారా 2.66 లక్షలమంది ఓటర్లను జాబితాల నుండి ఎన్నికల సంఘం తొలగించినప్పుడు ఈ ప్రభుత్వం ఒక కొత్త వలస, విదేశీ చట్టాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిన తర్వాత ప్రభుత్వం విదేశీ మినహాయింపు ఉత్తర్వు ఇచ్చిందని, ఎందుకంటే ఈ తొలగించిన ఓటర్లలో ముస్లింమేతరులు కూడా ఉంటారని వారిని రక్షించాలని ప్రభుత్వం భావించిందని, అందువల్లనే తాను ఈ 'సర్' వ్యవహారమంతా దొడ్డిదారిన అర్థ్వలైన జాతీయ పౌరసత్వ జాబితా విన్యాసంగా భావించి దీనిని వ్యతిరేకిస్తున్నానన్నారు.



**మీరు గొంతు చించుకున్నాగానీ బెంగాల్ ప్రజలు మమత పక్షమే**

ఎంతో గౌరవప్రదమైన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)ను ప్రభుత్వం భయంకరమైన 'గబ్బర్‌సింగ్' లాంటి వ్యక్తిలాగా మార్చేసిందని లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు శతాబ్దిరాయ్ విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆమె పాల్గొంటూ, బిజెపి నాయకులు ఎంత గట్టిగా 'సర్', 'సర్', 'సర్' అని అరచినాగానీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రజలు 'మేడమ్'' పక్షానే (ముఖ్యమంత్రి మమతా బెనర్జీ) నిలబడతారని అన్నారు. దేశంలోని 12 రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ''వీళ్ళకి (బిజెపి నాయకులకు) పశ్చిమ బెంగాల్ గురించి ఏమీ తెలియదు, వాళ్ళంతా ఎన్నికల సమయంలో రోజువారీ ప్రయాణికుల్లాగా వస్తూ ఉంటారు, తర్వాత పరాజయాన్ని మూటగట్టుకుని తిరిగి వెళ్ళిపోతారు, ఈసారి ఎన్నికల్లో కూడా అంతకంటే ఏమీ తేడాఉండదు, మీరు బీహార్ అసెంబ్లీని గెలుచుకుని ఉండవచ్చు, కానీ పశ్చిమ బెంగాల్‌ను మాత్రం గెలుచుకోలేరు'' అని శతాబ్ది రాయ్ హెచ్చరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి డింపుల్ యాదవ్ మాట్లాడుతూ, దేశ ఎన్నికల వ్యవస్థలో ఇవిఎంల స్థానంలో తిరిగి పేపర్ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కానీ ఎన్నికల సంఘం దేశంలో కేంద్ర ప్రభుత్వం ఆడించినట్టే ఆడుతోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర ఎన్నికల కమిషనర్‌లను ఎంపిక చేసుకునే కమిటీలోకి దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తిరిగి సభ్యుడుగా చేర్చుకోవాలని కోరారు. డిఎంకె నాయకుడు టి.ఎం.సెల్వగణపతి మాట్లాడుతూ, ఎన్నికల సంఘాన్ని, ఇతర స్వతంత్ర వ్యవస్థలను కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకుని ఆడించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 'సర్' ప్రక్రియ అక్రమం, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కాగా కేంద్రమంత్రి, అప్నాదళ్ (ఎస్) నాయకుడు అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, వరుసగా ఎన్నికల్లో పరాజయాలు పొందడంవల్లనే విసుగెత్తిపోయిన ప్రతిపక్షాలు ఎన్నికల సంఘాన్ని, 'సర్'ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయన్నారు.

## సెక్స్ వర్కర్ల కోసం 'సర్' శిబిరాలు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ సిఇఒ కార్యాలయం బుధవారం కోల్‌కతాలోని అనేక రెడ్‌లైట్ ప్రాంతాలలో శిబిరాలను నిర్వహించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓచపు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా లైంగిక కార్మికులు గణన ఫారాలను నింపడంలో ఇది సహాయపడుతుందని ఒక అధికారి తెలిపారు. నగరంలోని కిద్దెర్‌పూర్, కాలిఘాట్, చెట్ల ప్రాంతాలలోని రెడ్‌లైట్ జోన్‌లలో ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తూర్పు మహానగరంలోని ఆసియాలోనే అతిపెద్ద రెడ్‌లైట్ జిల్లా అయిన సోనాగాచిలో ఇలాంటి సహాయ శిబిరాలు నిర్వహించిన మరుసటి రోజు ఈ చర్య తీసుకోవడం గమనార్హం. 'కిద్దెర్‌పూర్‌లోని మున్షిగంజ్ రోడ్‌లోని ఫైవ్‌స్టార్ క్లబ్‌లో, అలాగే 148 కాలిఘాట్ రోడ్‌లో, చెట్లాలోని 29/ఎ రఖల్‌దాస్ అధ్యా రోడ్‌లో శిబిరాలు జరుగుతున్నాయి' అని ఎన్నికల కమిషన్ అధికారి తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాలు ఉదయం 11 గంటల నుండి పనిచేయడం ప్రారంభించాయని ఆయన అన్నారు. 'గణన ఫారాలను నింపడంలో సెక్స్ వర్కర్లకు సహాయం అందుతుందని, శిబిరం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. కిద్దర్‌పూర్‌లో కనీసం 70 మంది సెక్స్ వర్కర్లు ఉండగా, ఈ సంఖ్య కాలిఘాట్‌లో దాదాపు 100 ఉంది. చెట్లాలో దాదాపు 60 మంది ఉన్నారని అధికారి పిటిఐకి తెలిపారు. సెక్స్ వర్కర్లు, వారి పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న అనేక సంస్థలు లేవనెత్తిన ఆందోళనలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నారు. ఆందోళనలను పరిష్కరించడానికి, సమాజానికి మద్దతు ఇవ్వడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయని సిఇఒ కార్యాలయం హామీ ఇచ్చింది. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా మినహాయించబడరని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ అగర్వాల్ చెప్పినప్పటికీ, సోనాగాచి నుండి వందలాది మంది సెక్స్ వర్కర్లు మంగళవారం ఇసి సహాయ శిబిరాలకు ఆందోళనతో తరలివచ్చారు. ఉత్తర కోల్‌కతాలోని వార్డ్ నంబర్ 18లోని ఇరుకైన లేన్‌లు, రద్దీగా ఉండే 'కోఠీ'లలో సంవత్సరాలుగా నివసిస్తున్న చాలా మంది మహిళలు, తమ పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించబడతాయేమోనని ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఎందుకంటే వారికి పూర్వీకుల రుజువు లేకపోవడం లేదా దశాబ్దాల క్రితం అక్రమ రవాణా, వదిలివేయబడిన లేదా ఇంటికి పారిపోయిన తర్వాత చాలా కాలంగా వారి జన్మించిన కుటుంబాలతో సంబంధాలు కోల్పోయారు.

ప్రజాపక్షం
గురువారం, 11 డిసెంబరు

## 'దీపావళి'కి గుర్తింపు ప్రమాదమా? ప్రమోదమా?

దీపావళి పండుగకు ఐక్యరాజ్య సమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు హర్షణీయం. ఆహ్వానించదగిన పరిణామం. కానీ, దీని వెంటే వెనుక పొంచి ఉన్న ప్రమాదాలను కూడా గుర్తించాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే, ఆనందం విషాదంగా మారడానికి ఎంతోకాలం పట్టదు. యునెస్కో గుర్తింపు తర్వాత 'దీపావళి' ఒక పండుగ కంటే వ్యాపారోత్సవంగా మారే అవకాశం ఉంది. సంప్రదాయ దీపాల స్థానంలో భారీ లైట్లు, బ్రాండెడ్ ఉత్పత్తుల ప్రాధాన్యం పెరుగుతుంది. మత, సాంస్కృతిక భావాల కంటే మార్కెటింగ్ ప్రచారాలు పెరుగుతాయి. పండుగ స్ఫూర్తి నీరుగారుతుంది. దీపావళిని కేవలం వెలుగుల ఉత్సవంగా చూపించి, ధర్మం, సత్ప్రవర్తన, సుపరిపాలన వంటి లోతైన భావనలను విస్మరించే ప్రమాదం ఉంది. భవిష్యత్ తరాలు దీపావళి తాత్విక అర్థాన్ని మరచిపోయినా ఆశ్చర్యం లేదు. ఇక్కడ, పర్యావరణ సమస్యలను గుర్తించాలి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఢిల్లీ చేరింది. అక్కడి వాయుకాలుష్యం దీపావళి తర్వాత మరింత ఆందోళనకరంగా మారడాన్ని చూస్తునే ఉన్నాం. ఈ పండుగకు గ్లోబల్ గుర్తింపు కారణంగా, ఇకపై వేడుకలు పెద్దస్థాయిలో జరుగుతాయి. బాణాసంచా పేలుళ్లు భారీగా పెరుగుతాయి. శబ్ద, వాయు కాలుష్యాలకు అవధులు ఉండవు. ఇలాంటి పరిణామాలు, దీపావళి పండుగ ఇచ్చే సందేశమైన శాంతి, శుభ్రత, సమతుల్యతలకు ప్రతికూలం. యునెస్కో హోదా లక్షల చేతుల కృషిని గుర్తించినా, స్థానిక కళాకారులు, సంప్రదాయ కార్మికులకు నష్టం తప్పదు. యంత్ర ఆధారిత ఉత్పత్తులు పెరిగితే, చిన్న కుమ్మరులు, చేతివృత్తి కళాకారులు పోటీ తట్టుకోలేకపోవచ్చు. ఫలితంగా, వారి జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. అంతేకాదు, మారిన సాంస్కృతికీకరణ రాజకీయ రంగు దాల్చే అవకాశాలు లేకపోలేదు. దీపావళి లాంటి పండుగకు అంతర్జాతీయ గుర్తింపు రావడం వల్ల దానిని రాజకీయ ప్రచారాల కోసమే వాడుకునే ప్రమాదం కూడా ఉంది. అది పండుగ ఏకత్వ సందేశాన్ని దెబ్బతీస్తుంది. యునెస్కో హెరిటేజ్ అంటే, ఒక సంప్రదాయం మారుతూనే, ఉనికిని కాపాడుకోవడం. కానీ, ఒక నిర్దిష్ట రూపం, మార్పులేని విధానాలే అసలైన వారసత్వమని భ్రమిస్తే, అది ప్రాంతీయ వైవిధ్యం, కాలానుగుణ మార్పులకు అడ్డంకిగా మారుతుంది. అంతేగాక, ఇకపై ప్రపంచం దీపావళిని యునెస్కో ప్రమాణాల కంటితో చూసే అవకాశం ఉంది. అలాంటి సందర్భాల్లో చిన్న మార్పులే తీవ్ర విమర్శలకు దారితీస్తాయి. వారసత్వం స్థానంలో మత వాదం తిష్ఠవేస్తుంది. సమవాదం క్షీణిస్తుంది. సామ్యవాదం కనుమరుగవుతుంది. ఒకే పండుగను దేశంలోని భిన్న ప్రాంతాల్లో, భిన్న వర్గాల్లో వేరువేరు విధానాల్లో జరుపుకోవడం ఇప్పటి వరకూ కొనసాగుతున్న ఆనవాయితీ. భవిష్యత్తులో దీపావళి తన స్థానిక పరిమళాన్ని కోల్పోవచ్చు. స్థానిక ఆచారాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితులు ఉత్పన్నం కావచ్చు. ఇది మన సాంస్కృతిక స్వేచ్ఛకు విఘాతం కలిగించవచ్చు. రెండంచుల కత్తిగా మారే యునెస్కో గుర్తింపు కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు... గురుతర బాధ్యత కూడా. భవిష్యత్తులో అసలైన ప్రమాదం బాణాసంచా లేదా వేడుకల పరిమాణంతోనేగాక, దీపావళి స్ఫూర్తి, విలువలు, భావజాలం కోల్పోయే వాతావరణం వల్ల కూడా ఎదురుకావచ్చు. ఇప్పటికే, దీపావళి సందర్భంగా పేల్చే బాణాసంచాపై సుప్రీం కోర్టు పరిమితులు విధించడాన్ని వాతావరణ పరిరక్షణ అంశంగా కాకుండా, మత విశ్వాసాల సమస్యగా చిత్రీకరించడంలో కొన్ని రాజకీయ పార్టీలు, గ్రూపులు నిమగ్నమయ్యాయి. కావాల్సినంత విషాన్ని నూరిపోస్తున్నాయి. మత భావనల స్థానంలో విషబీజాలు నాటుతున్నాయి. ఇలాంటి శక్తుల విచ్ఛిన్నకర విధానాలు.. అవాంఛనీయ కార్యకలాపాల విశృంఖలత్వం రానున్నకాలంలో మరింత పెరగవచ్చు. మతవాదం వికృతరూపం దాల్చవచ్చు. ఈ భవిష్యత్ ప్రమాదాలను నిలువరించే బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. దీపావళి నిజంగా సజీవ వారసత్వంగా ఉండాలంటే, సంప్రదాయానికి ఆధునికతకు మధ్య సమతుల్యత అవసరం. పర్యావరణ సున్నితత్వాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. దీనిని భూగోళం ఎదుర్కొంటున్న సమస్యగా గుర్తించాలే తప్ప, మత కోణంలో చూస్తూ, విద్వేషాలు పెంచకూడదు. వెలుగు నుంచి చీకటిలోకి కాదు.. చీకటి నుంచి వెలుగులోకి రావడమే నిజమైన మార్పు. సిసలైన అభివృద్ధి. రాజకీయ ప్రయోజనాల కోసమో లేక మత పునాదుల మీద దేశాన్ని నిలబట్టేందుకు ప్రయత్నించడం కోసమో దీపావళికి లభించిన యునెస్కో గుర్తింపును వాడుకుంటే దేశం ప్రమాదంలో పడుతుంది. భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. వాయు కాలుష్యం కాటేస్తుంది. యునెస్కో గుర్తింపుతో సంబరాలు చేసుకోవచ్చు... అదే సమయంలో రాబోయే సమస్యలను కూడా గుర్తించాలి. పరిష్కార మార్గాలను అన్వేషించాలి. స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే యునెస్కో గుర్తింపుకు సార్థకత.

# 'వందేమాతరం'పై ప్రమాదకరమైన మోదీ భాష్యాలు

**గ్యాన్‌పాథక్**

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో ఉత్తేజకారకంగా పనిచేసిన 'వందేమాతరం' పాట జాతీయ గేయంగా ప్రకటించబడింది. జనగణ మనను జాతీయగీతంగా రాజ్యాంగ సభ గుర్తించింది. 'వందేమాతరం' (అమ్మా నీకు వందనం) చారిత్రక పాత్ర దృష్ట్యా ఆ గేయం రచన 150వ వార్షికోత్సవాన్ని భారతదేశం స్మరించుకుంటూ వేడుక చేసుకోవాలనుకుంది. అది గేయంగానే కాదు, జాతీయోద్యమ పోరాట నినాదంగా ప్రాచుర్యం పొందింది. అయితే అది జాతీయగేయంగా పరివర్తన చెందిన చరిత్రను ఉపయోగించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటులో గావించిన వాక్చాతుర్య ప్రసంగం, ఆ గేయం వేడుక స్థానంలో తీవ్రమైన కోపతాపాలను సృష్టించింది.

'వందేమాతరం'పై పూర్వపు కాంగ్రెస్ నాయకులను మోదీ విమర్శించటం చరిత్ర జ్ఞానలోపం అయినా అయి ఉండాలి లేదా భారత దేశ చరిత్రను తాము ఎంచుకున్న మార్గంలో తిరగరాసే ప్రయత్నమైనా అయి ఉండాలి. అంటే దేశ లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగ జాతీయ వాదానికి విరుద్ధంగా స్థూలంగా ఆర్‌ఎస్‌ఎస్ హిందూ జాతీయవాదానికి అనుగుణంగా చరిత్రను తిరగరాయటం అన్నమాట. ఆయన కథనం రాజకీయంగా బలంగా ఉన్నప్పటికీ, అది చారిత్రకంగా బలహీనంగా ఉంది, రాజ్యాంగరీత్యా ప్రమాదకరమైంది. ఆయన బహుళత్వంతో కూడిన జాతీయోద్యమ చరిత్రను మత తత్వ నైతికతతో కూడిన గాథగా కుదించారు. దాన్ని అన్యాయంగా ప్రస్తుత కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉపయోగించారు.

దేశం ఆయన ప్రసంగం విన్నది. లౌకిక రాజ్యాంగ సమతూకాన్ని ఆయన ఎలా బుజ్జగింపు వ్యవహారంగా ముద్రవేశారో, మత తటస్థతను హిందూ వ్యతిరేక పక్షపాతంగా ఎలా చిత్రించారో, ఐచ్ఛిక జాతీయ వాదం స్థానంలో ఎలా ప్రదర్శనాపూరిత జాతీయవాదాన్ని ప్రవేశ పెట్టారో, మైనారిటీ హక్కులను మెజారిటీకి అవమానంగా ఎలా చిత్రించారో చూశాం. గతకాలపు కాంగ్రెస్ నాయకులు ముస్లింలను బుజ్జగించే విధానం ఆచరించారని, హిందూ వ్యతిరేక పక్షపాతం కలిగి ఉన్నారని ప్రధాని మోదీ వారిపై పదేపదే దాడి చేశారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలపు చరిత్ర గూర్చి, ముఖ్యంగా వందేమాతరం ప్రస్తావనగూర్చి ఇది ఏ మాత్రం తటస్థ అవగాహన కానేకాదు. అందువల్ల ఆయన ప్రసంగాన్ని బేసబబైనది, తప్పుత్రోవ పట్టించేందిగా చరిత్రకారులు, రాజ్యాంగ పండితులు పరిగణించవచ్చు.

వందేమాతరం గేయంతో వాస్తవంగా కాంగ్రెస్ ఎలా వ్యవహరించింది? కాంగ్రెస్‌కు నిజమైన సమస్య ఎదురైనట్లు చారిత్రక వాస్తవికత సూచిస్తున్నది. 1930–40 దశకాల నాటికి ముస్లిం నాయకులు వందేమాతరం గేయంలో రెండు చరణాల తదుపరి చరణాలకు అభ్యంతరం చెప్పారు. వాటిలో దేవతా చిత్రణ స్పష్టంగా ఉంది. దాని తప్పనిసరిగా పాడటం జాతీయ విధేయతకు – మత ఆరాధనకు మధ్యనున్న విభజన రేఖను మరుగుపరుస్తుందని వారు భయపడ్డారు. ఇది కృత్రిమమైన సమస్య కాదు, దేశ విభజన రాజకీయాల గాయం నుంచి ఉద్భవించింది. భవిష్యత్ స్వతంత్ర భారత్‌లో మెజారిటీ–మైనారిటీ అధికారం గూర్చి గాఢమైన ఆందోళనలు వ్యక్తమైనాయి.

అందువల్ల, రాజ్యాంగ నిర్ణాయక సభ తొలి రెండు చరణాలను మాత్రమే (అవి కేవలం భూమి, నదులు, భూసారం గూర్చి ప్రశంసలతో ఉంటాయి)జాతీయ పాటగా ఉంటాయని నిర్ణయించింది. 'జనగణ మన'ను జాతీయ గీతంగా అంగీకరించింది ఈ రెంటిలో దేనిని పాడాలని ఏ పౌరుణ్ణీ బలవంతం చేయకూడదని కూడా నిర్ణయించింది. రాజ్యాంగ సంబంధమైన రాజీ "బుజ్జగింపు" కాజాలదు. అది వాస్తవానికి, మత వివాదాన్ని నిరోధించటానికి రాజ్యాంగపరంగా సర్దుబాటు. ఆ నిర్ణయం లౌకిక ప్రజాస్వామ్యానికి అనుగుణమైనది తప్ప "బుజ్జగింపు" కాదు.

రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, ఇంకా అనేకమంది ముఖ్య నాయకులు ఈ తులనాత్మక దృక్పథాన్ని ఆమోదించారు. ప్రధాన నరేంద్రమోదీ బిజెపికి అనుకూలంగా హిందూ ఓట్ల సమీకరణ కోసం దాన్ని "హిందూ–వ్యతిరేకం"గా, ముస్లింల "బుజ్జగింపు"గా ఎలా చిత్రిస్తున్నారో ఇప్పుడు చూదాం.

ప్రధాని మోదీ సర్వసాధారణంగా (నేరుగా లేదా భావార్థంలో) ఇలా అంటూ ఉంటారు: కాంగ్రెస్ నాయకులు "హిందూ గుర్తింపు"ను చెప్పుకోవటానికి సిగ్గుపడుతుంటారు; ముస్లింలను బుజ్జగించటానికై హిందూ ప్రతీకలను చిన్నచూపు చూస్తారు; "మైనారిటీ ఒత్తిడి" వల్ల వందేమాతరాన్ని వారు బలహీనపరిచారు. ఈ చిత్రణలో మూడు వక్రీకరణలున్నాయి : లౌకికవాదాన్ని "హిందూ వ్యతిరేకమైనదిగా" మార్చటం; ముస్లింల ఆందోళనలను అన్యాయమైనవిగా చిత్రించటం;



ఆ రాజీకి హిందువుల తోడ్పాటును చెరిపివేయటం. వాస్తవానికి కాంగ్రెస్ ఏమి చేసింది? రెండు విషయాలు ప్రత్యేకించి పేర్కొన్నతగినవి : రాజ్యాన్ని మత తటస్థంగా పరిగణించారు; రాజ్యం బలవంతం లేకుండా తమ విశ్వాసాన్ని ఉంచుకునేందుకు అన్ని సముదాయాలు అనుమతించబడినాయి.

తన విమర్శకు దీన్ని ప్రాతిపదికగా చేసుకుని ప్రధాని మోదీ ఏమన్నారంటే, రాజ్యం హిందూ ప్రతీకలను బహిరంగంగా గౌరవించకపోతే అది "హిందూ వ్యతిరేకి" అవుతుంది. ఇది లౌకికవాదాన్ని తలక్రిందులుగా నిలబెడుతున్నది. తటస్థతను శత్రుత్వంగా వక్రంగా చిత్రీకరించారు.

మోదీ తమ వాక్చాతుర్యంలో, ముస్లిం అభ్యంతరాలను "డిమాండ్లుగా" "ఒత్తిడిగా", "ఓటు బ్యాంక్ బ్లాక్‌మెయిల్‌గా" అభివర్ణించారు. అయితే చారిత్రకంగా రాజ్యాంగ సభ ఈ అభ్యంతరాలను బహిరంగంగా చర్చించింది. ఒక మత చర్యను ఏ పౌరునిపైనా బలవంతంగా విధించటం ద్వారా దేశ నిర్మాణం జరగదని హిందూ నాయకులు తమంత తాము అంగీకరించారు. అందువల్ల, కాంగ్రెస్‌లో గాని, రాజ్యాంగ సభలోగానీ కుదిరిన ఏకాభిప్రాయం, "స్థూల ఏకాభిప్రాయంపై ఆధారపడిన రాజ్యాంగ ఏర్పాటు" అనేది స్పష్టం. దాన్ని "ముస్లింల బుజ్జగింపు" అనటానికి వీల్లేదు.

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మూడవ వక్రీకరణ – కాంగ్రెస్ వారి రాజీకి గాను ఆ పార్టీ హిందువుల తోడ్పాటు కోల్పోయింది. "కాంగ్రెస్ హిందూ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ముస్లింల వైపు మొగ్గింది" అనేది మోదీ కథనం. అయితే చారిత్రక వాస్తవం ఏమంటే, రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, రాధాకృష్ణన్ ఇంకా అనేకమంది, మత స్వేచ్ఛను పరిరక్షిస్తూ, వందేమాతరం గేయాన్ని దాని తొలి రెండు చరణాలకు పరిమితం చేస్తూ అంగీకారం తెలిపారు. అందువల్ల ఆ నిర్ణయం మత సంబంధమైన ఇచ్చిపుచ్చుకోవటం కాదని, జాతీయ వివాద పరిష్కారమన్నది స్పష్టం. మోదీ వాక్చాతుర్యం చారిత్రక అవగాహనకు వ్యతిరేకమైంది. అది వివాదాలను పరిష్కరించకపోగా, హిందువుల ఓట్ల సమీకరణ కోసం కొత్త సమస్యలు సృష్టించేదిగా ఉంది.

అయితే ప్రధాని నరేంద్రమోదీ చిత్రణ ఆయనకు, ఆర్‌ఎస్‌ఎస్‌కు, బిజెపికి రాజకీయంగా ఉపయుక్తంగా ఉంది. ఆయన కథనం నాలుగు ప్రధాన రాజకీయ ధ్యేయాలకు ఉపకరిస్తున్నది: హిందువులు బాధితులన్న కథనం సృష్టించటం; బిజెపిని 'చారిత్రక తప్పిదాలను సరిదిద్దే' పార్టీగా చిత్రించటం; బహుళత్వాన్ని ద్రోహంగా మార్చటం; దేశం – మతం మధ్యనున్న రేఖను మసకబార్చటం.

కాంగ్రెస్ "హిందూ ప్రతీకలను అణచివేసిందని", తాము "రెండవ తరగతి" వారమన్న భావనను హిందువుల్లో కలిగించిందని చెప్పటం ద్వారా ప్రధాన మంత్రి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా హిందువుల్లో ఒక చారిత్రక ఫిర్యాదును సృష్టించటానికి ప్రయత్నించారు. అది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సమీకరణ ను, సాంస్కృతిక ఆగ్రహాన్ని కలుగజేసే ప్రయత్నం. "కాంగ్రెస్ నిరాకరించిన దానిని పునరుద్ధరించే" వ్యక్తిగా తననుతాను ప్రదర్శించుకునేందుకు మోదీ ప్రయత్నించారు. వందేమాతరం పాడటం, ఆల య రాజకీయాలు, మతంతో రాజ్యం మమేకతను బహిరంగంగా చాటటాన్ని భావజాలం మార్పుగా కాకుండా "జాతీయ దిద్దుబాటు"గా ప్రదర్శిస్తున్నారు.

"ఐచ్ఛిక దేశభక్తి", "మత స్వేచ్ఛ", "మత ప్రతీకతపై రాజ్యాంగం విధించిన పరిమితులు" గూర్చి ఎవరైనా మాట్లాడితే వారికి "కాంగ్రెస్ ఆలోచనా ధోరణి" కలిగినవారుగా, "దేశద్రోహులుగా", "బుజ్జగింపుదారు"గా ముద్రవేస్తున్నారు. ఇది భిన్నాభిప్రాయ ఆవరణను కుదిస్తుంది కాబట్టి ప్రమాదకరమైనది.

ఈ కథనం ప్రకారం దేశం అంటే అర్థం హిందూ సాంస్కృతిక వక్రీకరణగా కనిపిస్తున్నది. ఈ కథనంతో ఏకీభవించకపోవటం అవిధేయత అవుతుందన్న మాట. స్వాతంత్ర్య పోరాట కాలంలోను, రాజ్యాంగ సభ చర్చల్లోనూ దేశం అంటే అర్థం విశ్వాసాలకు అతీతంగా ప్రజలందరి రాజకీయ గమ్యం, విభేదించటం ప్రజాస్వామిక హక్కు.

మోదీ విమర్శలో ప్రధానమైన బేసబుతనం : లౌకిక రాజీని ముస్లింల బుజ్జగింపుగా, మనఃసాక్షిని కాపాడుకోవటాన్ని హిందుమతాన్ని అవమానించటంగా, ఐచ్ఛిక దేశభక్తిని బలవంతపు ప్రతీకవాదంగా, రాజ్య మత తటస్థతను నకిలీ లౌకికవాదంగా, వివాద నిరోధనను బలహీనమైన నాయకత్వంగా చిత్రించటం. ఆయన వాగాడంబరం చరిత్రకు సంబంధించి విశ్లేషణ కాదు, బిజెపికి అనుకూలంగా ప్రజా సమీకరణ నిమిత్తం ఒక రాజకీయ పునర్మదింపు.

కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగ అసెంబ్లీ – వందేమాతరం పాటను ప్రజలను ఐక్యపరిచే సాంస్కృతిక ప్రతీకగా మలిచాయి. లీగల్ వేధింపు లేకుండా స్వేచ్ఛ కలిగించాయి. చిత్రమేమంటే, మెజారిటీ వాద రాజకీయాల నిమిత్తం మోదీ దాన్ని కాంగ్రెస్, ముస్లింలకు వ్యతిరేకంగా, ముస్లింల్లో గణనీయమైన మద్దతు కలిగిన అన్ని ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. జాతీయ వేడుకను వీధి స్థాయి పోరాటం దశకు దిగజార్చటం మంచిది కాదు.

# ఉగాది పచ్చడిలా.. రెండేళ్ల ప్రజా పాలన



యాసాని కరుణాకర్ రెడ్డి
రాష్ట్ర స్థానిక కార్యదర్శి
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
9866103202

కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డిగారి రెండేళ్ల ప్రజా పాలన కొంత తీపి, కొంత చేదు, మరి కొంత ఘాటు ఇలా కొంత ఆశాజనకంగా, మరికొంత నిరాశాజనకంగా సాగుతుందని ప్రజల అభిప్రాయం.

**విద్యారంగం:** రెండేళ్ల ప్రజా పాలనలో విద్యా, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలియజేయడం అభినందనీయం. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు,అన్ని పాఠశాలలకు ఉచిత కరెంటు, మధ్యాహ్న భోజనంలో కొంత నాణ్యత పెంచడం,పాఠశాలల్లో మౌలిక వసతులకు కొంత నిధులను కేటాయించడం, ఉచిత పాఠ్య పుస్తకాలు,ఉచిత ఏకరూప దుస్తులను సకాలంలో అందించడం, విశ్వవిద్యాలయలకు వైస్ చాన్సలర్‌లను నియమించి, అధ్యాపక నియామకాలు చేయడం,స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడం అభినందనీయం. కానీ ప్రైవేటు విద్యా వ్యవస్థ పై నియంత్రణ లేకపోవడం, ఫీజు రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేసిన అది సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోవడం, నూతన జాతీయ విద్యా విధానం–2020పై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మరియు దానిపై మేధావులు యొక్క అభిప్రాయ సేకరణ చేయకపోవడం, దానివల్ల కేంద్రం నుండి విద్యారంగాని కి రావాల్సిన నిధులు ఆశించిన స్థాయిలో రాకపోవడం, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకుండా, పరిశీలించకుండా ఎసి గదులలో ఉండి ఆచరణకు అమలుగాని నిర్ణయాలు, సంస్కరణలు చేయడం వలన విద్యావ్యవస్థలో కొంత నిరాసక్తత కొనసాగుతున్నది. దీనిని సరి చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

**వైద్యరంగం:** స్వతంత్ర భారతదేశంలో నేడు అతి ఖరీదైన అంశం వైద్యం మాత్రమే. నేటికీ మన రాష్ట్రంలో పేద, మధ్య తరగతితో పాటు ధనికులు కూడా అనుకోని ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఖరీదైన వైద్యం అందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి కొనసాగుతూనే ఉంది. మారుమూల ప్రాంతాలలో నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న ప్రాంతాలలో వైద్య నియామకాలు జరగడం లేదు. దానితో ఆవాస, గిరిజన, గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న జబ్బు చేసినా పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. నేడు వైద్యం కార్పోరేట్ స్థాయికి చేరి ఎవరికీ అందనంత ఎత్తులో ఉంది. ప్రజలకు ఉచిత ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసినా ప్రైవేటు హాస్పిటల్స్ వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాకపోవడం వల్ల వారు ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించలేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వం వారి నిఘా లేకపోవడం వలన ఆసుపత్రుల యాజమాన్యం అవినీతి అనకొండలా మారిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు అనేవి నేటికి ప్రభుత్వం అందించలేకపోవడం వలన వైద్యరంగం మాత్రం ప్రజాపాలనలో ఆశించిన స్థాయిలో లేదనేది వాస్తవం.

**వ్యవసాయ రంగం:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలు అధికం. ఆ గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనాధారం పూర్తిగా వ్యవసాయ రంగం, వ్యవసాయాధారిత పనులు మాత్రమే. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మన రాష్ట్రంలో నిర్మించిన పెద్ద ప్రాజెక్టు నాగార్జునసాగర్ మాత్రమే. ఆ ప్రాజెక్టు నుండి వేల ఎకరాల సాగు ను కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత శ్రీరాంసాగర్, పోచంపాడు ఇలా కొన్ని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మించడం వల్ల వ్యవసాయానికి కొంత ఉపయోగపడుతున్నాయి. వర్షాధార పంటలు, వ్యాపార పంటలు, పండ్లతోటలు, కూరగాయల సాగువంటి వ్యవసాయ పంటలను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. అందుకే రైతులు నేటికీ వరి, పత్తి తప్ప వేరే పంటలు పండించలేకపోతున్నారు. అందుకే ప్రజా పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రాజెక్టులతోపాటు నిర్మాణం, పండ్లతోటలు, కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించి పండించిన పంటలు రైతుల అమ్ముకోవడానికి మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**పారిశ్రామిక, ఉత్పత్తి రంగం:** ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు అనేక పారిశ్రామిక వాడలు వెలిసినవి. అజామాబాద్, ఉప్పల్, నాచారం, సనత్ నగర్, బాల నగర్, జీడిమెట్ల అలాగే నిజామాబాద్, మిర్యాలగూడలో రైస్ మిల్లులు, బోధనలో షుగర్ ఫ్యాక్టరీ, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి వంటి పట్టణాలలో బొగ్గు ఉత్పత్తి కేంద్రాలు ఇలా అనేక ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడం వల్ల వేల మంది కార్మికులకు ఆనాడు అందులో ఉపాధి దొరికింది. కానీ నేడు అనేక పరిశ్రమలు ప్రభుత్వాల ప్రోత్సాహం లేక అవి మూతబడి అందులో పనిచేసిన కార్మికులు రోడ్డునపడి నేడు వేరు వేరు వృత్తులలో కొనసాగుతున్నారు. నేడు ప్రభుత్వాలు కేవలం సాఫ్ట్‌వేర్ రంగాన్ని మాత్రమే ప్రోత్సహించడం వల్ల కొద్దిమందికి మాత్రమే ఉపాధి దొరకడం, ఉత్పత్తిరంగం పూర్తిగా దెబ్బతినడం, అందులో పనిచేసే అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి లేక నిరుత్సాహ స్థితిలో జీవిస్తున్నారు. అందుకే పారిశ్రామిక, ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**సంక్షేమ పథకాలు** : సంక్షేమ పథకాలలో రైతు రుణమాఫీ, రైతులకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఈ పథకాలు అన్ని ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలు కావున అవి ప్రజాపాలనలో ఆశించిన స్థాయిలోనే కొనసాగుతున్నాయని ప్రజల అభిప్రాయం.రెండేళ్ల పాలన ముగించుకొని మూడవ సంవత్సరంలోకి అడిగిడుతున్న రేవంత్ రెడ్డి గారి ప్రజాప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 స్ఫూర్తితో రాష్ట్రం విద్య, వైద్యం ఉపాధి, పారిశ్రామిక రంగాలు, ఇతరత్రా అన్ని రంగాలలో అభివృద్ధిపథం వైపు అడుగులు వేస్తూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అనే విధంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ రెండేళ్ల పాలనకు అభినందనలు.

## పన్నుల పెనుభారం కింద సామాన్యుడు..
# 'వికాస భారాలు' ఎవరికోసం?

సామాజిక మాధ్యమాలలో విపరీతంగా చర్చకు దారి తీసిన ఈ వ్యంగ్య చిత్రం (కార్టూన్), భారతదేశంలో ప్రస్తుత పరిపాలనా వైఖరి, ఆర్థిక వాస్తవాల మధ్య ఉన్న పెద్ద అంతరాన్ని సూచిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యాన ముద్రలో, నవ్వుతూ, సమస్యల శిఖరంపై ప్రశాంతంగా కూర్చుని ఉన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ తమ నియంత్రణలో ఉందని, స్థిరంగా ఉందని ప్రభుత్వ అగ్ర నాయకత్వం ఇస్తున్న సంకేతాన్ని సూచిస్తుంది. అయితే, ఆ కొండరాళ్ల క్రింద, పెట్రోల్ ధర పెరుగుదల, రూపాయి పతనం, భారీ పన్నుల (TAX) భారంతో నలిగిపోతున్న సామాన్య పౌరుడి నిస్సత్తువైన రూపం, క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత, నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ సంస్థలను (PSUs) ప్రైవేటీకరించడం లేదా వ్యూహాత్మక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచడం ముఖ్య ఆర్థిక లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ప్రభుత్వానికి మేలు చేసినప్పటికీ, సామాన్యుడిపై కొన్ని భారాలను మోపిందనేది ఈ చిత్రం యొక్క ప్రధాన విమర్శ.





**పెట్రోల్ ధరలు, పన్నుల భారం**

చిత్రంలో కనిపించే భారీ పెట్రోల్ పంపు నాజిల్ మరియు 'TAX' అని ఉన్న పెట్టె... ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణ విధానాన్ని ఎత్తిచూపుతాయి. ఇంధన రంగం నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే అత్యంత ముఖ్యమైన ఆర్థిక వనరుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక ఎక్సైజ్ సుంకాలు (Excise Duty), రోడ్డు సెస్సులు వంటి పన్నుల కారణంగా వినియోగదారులకు ధరల ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వం ఈ అధిక పన్నుల రాబడిని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం నిధులు సమకూర్చడానికి ఉపయోగిస్తున్నప్పటికీ, ద్రవ్యోల్బణం (Inflation) పెరుగుదలకు, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి ఇది ప్రధాన కారణంగా మారుతోంది. ఈ విధంగా, దేశ నిర్మాణానికి అయ్యే భారాన్ని సామాన్యుడి జేబుపై అధిక పన్నుల రూపంలో మోపుతున్నారు అనే వాదనకు ఈ అంశాలు బలం చేకూరుస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వాన్ని పైన అనుభవిస్తుంటే, ఆ భారం కింద ఉన్న సామాన్యుడిపై పడుతోంది.

**రూపాయి విలువ క్షీణత.. ఆర్థిక అనిశ్చితి**

విరిగిపోయిన రూపాయి నాణెంపై ఉన్న 'Rupee fall' అనే అక్షరాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాలును సూచిస్తాయి. భారత రూపాయి విలువ నిరంతరం క్షీణించడం వలన దిగుమతులు (ముఖ్యంగా ముడిచమురు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలు) ఖరీదైనవిగా మారుతున్నాయి. దీని ప్రభావం దేశీయంగా ధరల పెరుగుదలకు దారితీసి, సామాన్య ప్రజల దైనందిన ఖర్చులను పెంచుతుంది. ఈ ఆర్థిక అనిశ్చితి, ప్రపంచ పరిణామాల కారణంగా వచ్చినప్పటికీ, సామాన్యుడికి మాత్రం నిస్సత్తువను, భయాన్ని కలిగిస్తుంది. అధికారంపై ఉన్నవారు అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి స్థిరత్వాన్ని కొనసాగించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈ ప్రయత్నాల ప్రభావం సామాన్యుడికి దక్కకపోవడం ఈ చిత్రంలోని ప్రధాన విమర్శాంశం.

**కార్పొరేట్ అభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల నష్టాలు** : చిత్రంలో ఇండిగో విమానం మరియు సంచార్ సాథి వంటి అంశాలు ప్రభుత్వంలోని కీలకరంగాల విధివిధానాలను సూచిస్తాయి.

మోదీ ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద ప్రైవేటీకరణ చర్యలలో ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్‌కు విక్రయించడం ఒకటి. దశాబ్దాలుగా ప్రభుత్వానికి వేల కోట్ల నష్టాలను, భారీ రుణ భారాన్ని మిగిల్చిన ఈ సంస్థను విక్రయించడం వ్యూహాత్మకంఽగా సరైన నిర్ణయం అయినప్పటికీ, నష్టాల భారాన్ని ప్రభుత్వ మే భరించాల్సి వచ్చింది. టెలికాం రంగం లో ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్‌ఎన్‌ఎల్ (BSNL)వంటివి ప్రైవేట్ పోటీని తట్టుకోలేక భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ప్రభుత్వం వీటిని ప్రైవేటీకరించకుండా, వేలకోట్ల రూపాయల పునరుద్ధరణ ప్యాకేజీలను అందిస్తోంది. బ్యాంకింగ్ రంగం.. ప్రభుత్వం కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులను కూడా ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించింది, ఎందుకంటే అవి నిరర్థక ఆస్తులు (NPAs) కారణంగా నష్టాలను చవిచూస్తున్నాయి. ప్రైవేటీకరణ ద్వారా బ్యాం కింగ్ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, ఈ నష్టాల భారం మొత్తాన్ని చివరికి ప్రభుత్వ ఖజానా, పరోక్షంగా ప్రజలు మోయాల్సి వస్తోంది.

**నలిగిపోతున్న సామాన్య పౌరుడి ఆవేదన** : సామాన్య పౌరుడు, ప్రభుత్వ విధానాల వల్ల కలిగే ప్రయోజనాలు, భారాల పంపిణీలో ఉన్న అసమానతను సూచిస్తున్నాడు. ఈ వ్యంగ్య చిత్రం యొక్క ప్రధాన సందేశం ఏమిటంటే, దేశ నాయకత్వం అభివృద్ధి, స్థిరత్వం సంకేతాలతో ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ, అధిక ఇంధన ధరలు, అధిక పన్ను లు, ద్రవ్యోల్బణం వంటి ఆర్థిక భారాలు సామాన్య ప్రజానీకాన్ని రోజువారీ జీవితంలో కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితి, ప్రభుత్వ విధానాలు కేవలం అగ్రస్థాయిలో ఉన్నవారికి మాత్రమే అనుకూలంగా ఉన్నాయనే సామాజిక విమర్శకు బలం చేకూరుస్తుంది.

వెంకగారి భూమయ్య, 9848559863

## విశ్వ బాలల స్వేచ్ఛా ప్రదాత యూనిసెఫ్ !





డిసెంబర్ 11న 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్న యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్ ఎమర్జన్సీ ఫండ్ ఫౌండేషన్ డే లేదా యూనిసెఫ్ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను ప్రపంచ బాలలు ఘనంగా నిర్వహించుకోవడం సముచితంగా ఉంది. 1953 నుంచి ఈ సంస్థను యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ అని నామకరణం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1946లో తాత్కాలికంగా ఏర్పడిన యూనిసెఫ్ తదనంతర కాలం 1953లో శాశ్వత ఐరాస అంగంగా గుర్తించబడింది. యూనిసెఫ్ వ్యవస్థాపక దినోత్స వం–2025 ఇతివృత్తంగా నా రోజు, నా హక్కులు (మై డే, మై రైట్స్) అనే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 34 నేషనల్ కమిటీలు, ఏడు ప్రాంతీయ కార్యాలయాలు, పరిశోధనాలయం, సరఫరా కేంద్రం, పలు సేవల కేంద్రాలతో నడుస్తున్న యూనిసెఫ్ సిబ్బంది 85శాతం క్షేత్రస్థాయిలోనే సేవలు అందించడం విశేషం.

**యూనిసెఫ్ ప్రధాన విధులు:** ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణయే ఏకైక లక్ష్యంగా యూనిసెఫ్ సేవలు అందిస్తున్నది. ప్రపంచవ్యాప్త బాలల ఆరోగ్యం, విద్య నైపుణ్యాల వృద్ధి, మాతాశిశు సంరక్షణ, పోషకాహార కల్పన, వ్యాధుల నివారణకు టీకాలు ఇప్పించడం, లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం, అత్యవసర సేవలు అందించడం, బాల కార్మిక వ్యవస్థలను ఛేదించడం, బాలల కనీస అవసరాలు తీర్చడం, సురక్షిత నీరు పారిశుద్ధ్య కల్పన, విపత్తు ప్రాంతాల్లో పిల్లల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం, బాలికల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయడం, బాలల శక్తి దుర్వినియోగానికి వ్యతిరేకంగా కృషి చేసుకోవడం, అక్రమ రవాణాను అరికట్టడం, శిశు మరణాల రేటును తగ్గించడం లాంటి పలు సమకాలీన బాలల సమస్యలకు సరైన పరిష్కారాలు వెతుకుతూ, చిన్నారుల ఉజ్వల భవితకు గొడుగులు పడుతూ ముందుకు సాగుతోంది ఐరాసలో ఒక ప్రధాన భాగమైన యూనిసెఫ్ సంస్థ.

**బాలల ఆత్మీయ నేస్తాలు:** మానవీయ దృక్పథంతో ప్రపంచ అభాగ్య బాలలను అన్ని రకాలుగా ఆదుకోవడమనే ఏకైక లక్ష్యంతో 1946లో ఏర్పడిన యూనిసెఫ్ సంస్థ 190కి పైగా దేశాల్లో తమ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నది. 1965లో నోబెల్ శాంతి బహుమతిని సైతం దక్కించుకున్న యూనిసెఫ్ సంస్థ నిరంతరం ప్రపంచవ్యాప్త చిన్నారులకు మేనమామగా మారి అక్కున చేర్చుకుంటూ వారి ముఖాల్లో నవ్వుల పువ్వులు వికసించే విధంగా చేయూతను అందిస్తున్నది. న్యూయార్క్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన యూనిసెఫ్‌ను 1946లో లుడ్విక్ రజ్‌మెన్ స్థాపించడం జరిగింది. ఐరాస సభ్య దేశాల్లో అమెరికా లాంటి అగ్ర దేశాలు అధికంగా నిధులను అందించడం కొనసాగుతున్నది. నేటి బాలల రేపటి ఉజ్వల భవితకు నేడే పెట్టుబడి పెట్టాలనే ధ్యేయంతో యూనిసెఫ్ ముందుకు సాగుతున్నది. పిల్లల భావనలకు పట్టం కట్టడం, వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఊతం ఇవ్వడం గత 78 ఏండ్లుగా కొనసాగుతున్నది. నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా 760 మిలియన్ల బాలలను యూనిసెఫ్ ఆదుకోవడం సంతోషదాయకం. రేపటి తర నిర్మాణానికి నేడే మనం త్యాగాలు చేయడం, యునిసెఫ్ చేతులకు దండం పెట్టడం మన కనీస కర్తవ్యం. ఆపదలోకి చిన్నారులకు అమ్మ, భయం గుప్పిట ఉన్న చిన్నారులకు నాన్న, చిరునవ్వుల చిన్నారులకు ఆత్మీయ నేస్తంగా పలు భూమికలు నిర్వహిస్తున్న యూనిసెఫ్ అమూల్య సేవలను కొనియాడుతూ, నేటి యువతకు దాని విజయ చరిత్రలు అవగాహన పరుచుదాం.

*లాంగ్ లివ్ యూనిసెఫ్ హెల్పింగ్ హాండ్*

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## బైరాన్‌పల్లిలో ''భారీగా మద్యం పట్టివేత''

**ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట :** నామినేషన్ల పర్వం పూర్తి చేసుకుని, ప్రచార పర్వంలోకే అడుగుపెడుతున్న స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఓ పక్క అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, అభ్యర్థులు కొందరు మాత్రం అవేవి తమకు పట్టవు అన్న చందంగా లక్షల రూపాయల మద్యంను అక్రమంగా దాచిపెడుతూ, పట్టుబడుతున్నారు. ఓటర్లను అప్పుడే ప్రలోభాలకు గురిచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న బర్ల రాజములు అక్రమంగా దేవునూరి దేవదాసు వ్యవసాయ పొలంలోని పత్తి చేనులో నిలువ చేసిన 10 కాటన్ల ఇంపీరియల్‌బ్లూ (ఐ.బి) మొత్తం 86.4 లీటర్ల మద్యంను, 95,040 రూపాయల విలువ గల మద్యం బాటిల్లను నమ్మదగిన సమాచారంతో పట్టుకుని సీజ్ చేసినట్లు, మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. దీనిపై ధూళిమిట్ట వైన్‌షాప్ ఓనర్, బైరాన్‌పల్లి సర్పంచ్ అభ్యర్థి బర్ల రాజములుపై కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

## ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు నేడు జరగనుండగా బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ ను బుధవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని అధికారులకు సిబ్బందికి తెలియజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ, శ్రీనివాస్ ఎంఆర్ఓ రమేష్ ,ఎంపీడీఓ శ్రీకాంత్ ,ఎంపిఓ జగదీష్ ఉన్నారు.



## ఇవిఎం గోడౌన్‌ల తనిఖీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల గోడౌన్ ను ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసేందుకు ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి సీఈఓ సుదర్శన్ రెడ్డి చేరుకోగా, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఈఓ.. ఇంచార్జి కలెక్టర్ తో పలు అంశాలపై చర్చించారు. అక్కడి నుంచి సీ ఈ ఓ నేరుగా సర్దాపూర్ లోని ఈవీఎం గోడౌన్, ఈవీఎంలను ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ పాల్గొన్నారు.

# 'పెద్దపల్లి'లో రైల్వే అభివృద్ధి, సెమీకండక్టర్ పరిశ్రమల కోసం సహకరించండి

ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రైల్వేల అభివృద్ధి, సెమీ కండక్టర్ పరిశ్రమల అభివృద్ధి కోసం సహకరించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డ వంశీకృష్ణ పార్లమెంట్ ప్రశ్నోత్తర సమయంలో కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో అనేక రైల్వే ప్రాజెక్టులు మంజూరైన నేపథ్యంలో తాజాగారామగుండం–మణుగూరు మధ్య కొత్త రైల్వే లైన్‌కు అనుమతి లభించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ. 4000 కోట్ల నిధులు అవసరమని రైల్వే శాఖ కోరినట్లు పేర్కొన్నారు. కుందన్‌పల్లి ప్రాంతానికి దాదాపు రూ.100కోట్లు, కూనారం ఫ్లైఓవర్ మరియు మంథని వంతెన నిర్మాణానికి సుమారు రూ. 80కోట్ల నిధుల అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాజెక్టులపై స్పష్టమైన టైమ్‌లైన్లు ఏమిటని రైల్వే శాఖను ప్రశ్నించారు.దీనికి స్పందించిన గౌరవ రైల్వే మంత్రి, అన్ని ప్రాజెక్టుల పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, లైన్ స్టేటస్ కూడా ఇప్పటికే అప్‌డేట్ అయ్యిందని సభకు తెలియజేశారు.అదే విధంగా, ఐటి మంత్రిగా పెద్దపల్లి ప్రాంతంలో అత్యాధునిక సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని గట్టిగా విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ తెలిపారు. ఈ ప్రాంతంలో ఐటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తే పరిశ్రమల విస్తరణకు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు విస్తృత అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. గతంలో తెలంగాణకు రావాల్సిన ఒక సెమీకండక్టర్ ఫ్యాక్టరీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిన అంశాన్ని కూడా సభ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. పెద్దపల్లి ప్రాంత యువత ప్రతిభావంతులని, వారికి స్కిల్ డెవలప్‌మెంట్ అందించి సెమీకండక్టర్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తే భవిష్యత్తు మరింత బలపడుతుందని అన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం తమకు ఒక విపులమైన ప్రాజెక్ట్ రిపోర్ట్ అందజేసిందని, దానిని పరిశీలించి పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చిస్తానని ఎంపీ గారు స్పష్టం చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో సెమీకండక్టర్ ఫెసిలిటీ లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెంటర్ ఏర్పాటు దిశగా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నేడు జరిగే ఏడు మండలాల్లో పూర్తి ఏర్పాట్లు: కలెక్టర్



**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలోని మేడిపల్లి, కథలాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, సిబ్బంది బాధ్యతల పంపిణీ, లాజిస్టిక్స్ ఎన్నికల మెటీరియల్ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ పరిశీలనలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి.రాజ గౌడ్,జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి,కోరుట్ల–మెట్ పల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి,ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు: సిపి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేడు జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం, ఆయన ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు.మొదటి విడతలో గంగాధర, చొప్పదండి, రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల పరిధిలో 92 గ్రామ పంచాయతీలు, 866 పోలింగ్ కేంద్రాలున్నాయి. గత సంఘటనల ఆధారంగా గుర్తించిన సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించడంతో పాటు, వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో స్టాటిక్ పోలీసు పార్టీ, మరియు ప్రతి మార్గంలో (రూట్) రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారు. మొదటి విడత ఎన్నికల బందోబస్తు కోసం దాదాపు 782 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో ఆరుగురు ఏసీపీలు, 19 మంది ఇన్స్పెక్టర్లు, 40 మంది ఎస్సైలు, 34 మంది హెడ్ కానిస్టేబుల్స్, 392 మంది కానిస్టేబుళ్ళు, 47 స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు, 144 హోంగార్డ్స్ మరియు 100 మంది బెటాలియన్ స్పెషల్ పోలీసులు ఉన్నారు.

**విజయోత్సవ ర్యాలీలపై నిషేధం**

ఎన్నికల అనంతరం అదేరోజు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అని సీపీ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మల్లాపూర్ మండలంలో 220 పోలింగ్ కేంద్రాలు



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల వ్యాప్తంగా జరిగే రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారులు పోలింగ్ కేంద్రాలను సర్వం సిద్ధం చేశారు. కాగా మండల వ్యాప్తంగా 220 పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది 650 పోలీస్ సిబ్బంది 130 మంది విధులు నిర్వర్తిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈమెరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూట్ కేంద్రం నుండి పోలింగ్ సిబ్బంది సామాగ్రితో ప్రత్యేక వాహనాలలో కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు చేసుకున్నారు.

### ముత్తారంలో ఎన్నికల బ్యాలెట్ సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/ముత్తారం :** మొదటి విడతలో జరుగబోయే స్థానిక ఎన్నికల బ్యాలెట్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని గ్రామాల బ్యాలెట్ సామాగ్రిలను బుధవారం అధికారులు పంపిణీ చేయగా ఎన్నికల అధికారులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్యాలెట్ ఓటింగ్ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఉద్యోగి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల సామాగ్రిని ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాలెట్ పంపిణీ, స్వీకరణ జరగాలన్నారు. ప్రతి బండిల్ పై సీల్, సంతకాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు,ఎన్నికల సామాగ్రి సరఫరా వ్యవస్థను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పంపిణీలో ఎంపీడీవో సురేష్, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఆరో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** మొదటి విడతలో గురువారం నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సప్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరగనున్న కరీంనగర్ రూరల్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొత్తపల్లి మండలానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం మొదటి విడత పోలింగ్ జరిగే మంథని, ముత్తారం, రామగిరి, కమానపూర్, కాల్వ శ్రీరాంపూర్, మండలాల లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 11 న జరుగుతున్నాయని, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాల్లో చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తూ తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి అలసత్వం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తూ విధులు నిర్వహించ కూడదని,ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని,ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏసిపి రమేష్, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్ ,ఎంపీడీవోలు, ఎంపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు: ఎస్‌పి



**ప్రజాపక్షం/కోరుట్ల :** జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ అన్నారు.బుధవారం బీమారం,కోరుట్ల,మెట్ పల్లి లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను అదనపు ఎస్పీ తో కలిసి సందర్శించారు.ఈ యొక్క డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రిని పటిష్ట పోలీస్ బందోబస్త్ మధ్య తరలించడం జరిగిందని, ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదే స్ఫూర్తితో సర్పంచ్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు.మొదటి విడతకి సంబంధించి 1172 పోలింగ్ కేంద్రాల లో పోలింగ్ జరుగుతుందని దీనికి సంబంధించి (843) మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని అన్నారు. పటిష్ట ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని (46) రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ అలాగే ఎస్.ఐ లతో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికలలో పోలీసుల విధి విధానాలపై పోలీస్ అధికారులకు,సిబ్బందికి దిశానిర్దేశం చేశామని, పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు ను స్వేచ్ఛగా వినియోగించుకునే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు . ఎన్నికల సంఘం చే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి , డిఎస్పీలు వెంకటరమణ,రాములు, సి.ఐలు ,ఆర్.ఐ లు,ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మద్యం మత్తులో పల్లెలు

**ప్రజాపక్షం/బీరుపూర్:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మద్యం మత్తులో పల్లె ప్రజలు మునిగిపోతున్నారు. ఓటర్లను మభ్యపెట్టడానికి మద్యం మాంసంతో వైన్స్ లు కిటకిటలాడుతున్నాయి. గెలుపు ఎవరి దిమా వారిది అనేలా నడుస్తున్నాయి ఏది ఏమైనా ఓటర్ నాడీ ఎలా పట్టాలో గ్రామాలలోని గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు కానీ వాడు సభ్యులు అభ్యర్థులు కానీ ఎవరి ఆలోచనలకు అనుగుణంగా వారు ఓటర్లకు ఎలా చెప్తే వాళ్ళకి అర్థమవుతుంది ఎవరికి ఏమేం స్కీం ఇవ్వాలి ఎవరికి ఏమేం పంచాలి అని ప్రచారంలో ముమ్మరంగా సాగుతున్నాయి ఏది ఏమైనా సర్పంచ్ అంటే ఒక గ్రామాన్ని శాసించే వ్యక్తి కాబట్టి డబ్బులకి మధ్యానికి లొంగకుండా ఒక మంచి వ్యక్తిని ఎన్నుకోవడం ద్వారా గ్రామం అభివృద్ధి చెందుతుందని విశ్లేషకులు అంటున్నారు.

# పెండింగ్ బాకీని తక్షణమే చెల్లించాలి

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** ఆటో డ్రైవర్లకు పెండింగ్ లో ఉన్న 1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని లేకుంటే హైదరాబాద్‌లో మహా ధర్నాకు దిగుతామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఆత్మీయ బరోసా కార్యక్రమంలో భాగంగా ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని అన్నారు. ఆటో అన్నలతో బిఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం కొత్తది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, కేసీఆర్ ప్రాణాలకు తెగించి ఆమరణ దీక్ష చేసినప్పుడు, రాష్ట్రవ్యాప్తంగా కదిలిన సబ్బండ వర్గాల్లో, ఆటో డ్రైవర్లు కూడా ముందుండి పోరాడారని, తెలంగాణ కావాలే, అయి తీరాల అని ర్యాలీలు తీసి కేసీఆర్‌కు మద్దతుగా నిలబడ్డారని గుర్తుచేశారు. వారి పాత్ర పోరాటంలో మరువలేనిదన్నారు. కేసీఆర్ ముఖ్య మంత్రి అయిన తర్వాత కార్మికుల పట్ల తన ప్రేమను చాటుకున్నారని అన్నారు. కేవలం ఆటో అన్నలకే కాకుండా, రాష్ట్రంలోని సుమారు 6న్నర లక్షల నుంచి 7 లక్షల మంది ఆటో కార్మికులకు, అడగకుండానే, మ్యానిఫెస్టోలో పెట్టకుండానే, ఓట్ల కోసం దొంగమాటలు చెప్పకుండానే 5 లక్షల ప్రమాద బీమాను కల్పించారని అన్నారు. కేసీఆర్ రైతు బీమాను తీసుకొచ్చి ఆదర్శంగా నిలిచారని దేశంలో రైతులకు బీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే. అలాగే డ్రైవర్లకు, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు కార్మిక పక్షపాతి కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లతో పాటు, అసంఘటిత రంగంలోని దాదాపు 13న్నర లక్షల మంది డ్రైవర్లకు (వ్యాన్లు, జీపులు, ట్రాక్టర్లు, టాక్సీలు, లారీలు) కూడా 5లక్షల ప్రమాద బీమా కల్పించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. సిరిసిల్ల జిల్లా కార్మిక, ధార్మిక, కర్షక క్షేత్రమని, నేతన్నలు, కర్షకులు (రైతులు), ధార్మికులు ఇక్కడ పెద్ద ఎత్తున ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తోట ఆగయ్య, లక్ష్మి నరసింహ రావు, వేణు, చక్రపాణి, ప్రవీణ్, శంకరయ్య, రామ్మోహన్, మల్లారెడ్డి, శ్రీనివాస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## వృద్ధురాలి అత్యాచారం, బెదిరింపు కేసులో నిందితుడికి 10ఏండ్ల జైలుశిక్ష

సిద్దిపేట సిపి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** వృద్ధురాలిని అత్యాచారం కేసు, బెదరింపు ఘటనలో 10 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వృద్ధురాలు గ్రామంలోని ఆర్ఎంపి డాక్టర్‌కు ప్రాథమిక చికిత్సకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో రామంచ గ్రామానికి చెందిన నిందితుడు కొమ్ము నర్సయ్య (20) బైక్ మీద ఎక్కించుకొని ఇంటిదగ్గర దింపుతామని నమ్మించి ఎక్కించుకొని ఎవ్వరు లేని ఖాళీ ప్రదేశంలో బైక్ నిలిపి అత్యాచారం చేసినట్లు తెలిపారు. ఎవ్వరికి చెప్పిన చంపివేస్తామని బెదిరించినట్లు తెలిపారు. బాధితురాలు చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుపై విచారణ జరిపిన స్టేషన్స్ జడ్జి జయప్రసాద్ నిందితుడు కొమ్ము నర్సయ్యకు దోషిగా నిర్ధారించి పది సంవత్సరాల జైలుశిక్షతో పాటు 6వేల రూపాయల జరిమాన విధించారు. ఈ కేసు పరిశోధనలో కృషిచేసిన అప్పటి రూరల్ సిఐ సురేందర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్, సైఫ్ అలి, సిడిఓ రవి, శ్రీనివాస్‌రెడ్డి, పిపి ఆత్మరాములు వ్యవహరించినట్లు తెలిపారు.

# పల్లెపోరులో 'యువతరం'


**ప్రజాపక్షం/అక్కన్నపేట :** ఈ నెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఎప్పుడు లేనంతగా యువకులు అక్కన్నపేట మండలంలో పెద్ద సంఖ్యలో బరిలో నిలిచారు.పల్లెలను ప్రగతి బాటలో నడిపించడంతో పాటు గ్రామ రాజకీయాల్లో తమదైన ముద్ర వేసేందుకు యువత యుందుకు వస్తున్నారు.దీన్నీ గ్రామాల్లో నాయకత్వ మార్పునకు,అభివృద్ధిలో భాగస్వామ్యానికి యువత ఇస్తున్న బలమైన సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**నాడు తెలంగాణ ఉద్యమంలో.. నేడు సర్పంచ్ బరిలో:**



నిజాం, ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ . బిఏలో సైకాలజీ, సోషియాలజీ, ఫిలాసఫీ పూర్తి చేసిన భూక్య జాన్‌కుమార్ (31) నాడు తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని నేడు పంచాయతీ బరిలో ఆసక్తికనబరిచి అక్కన్నపేటలో నూతన పంచాయతీగా ఏర్పాటైన చౌటకుంట తండా సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. తాను గెలిస్తే విద్య, ఆరోగ్యంతో పాటు అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

**ఫోటోగ్రాఫర్ నుంచి సర్పంచ్ బరిలో..**



అక్కన్నపేటకు చెందిన దాసరి కృష్ణ(చిన్నా) గత 15 ఏండ్ల నుంచి ఫోటోగ్రఫీ రంగంలో రాణిస్తూ అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో తను తీసిన అరుదైన దృశ్యాలను చూపరులను ఆకర్షించేలా ప్రత్యేకతను చాటుకున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ కల్చరల్‌లో సైతం పాల్గొన్నారు.ఇలా తాను గ్రామాల్లో వివాహది శుభకార్యాల్లో గ్రామస్థులకు సన్నిహిత్య సంబంధాలు కల్గివుండటం తన ప్రత్యేకత. తాజా సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ అనుకూలించడంతో బీజేపీ పార్టీ తరపున సర్పంచ్ బరిలో నిలిచారు.

**గిరిజనులను ఏకం చేసిన వెంకటేష్..**




పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో ఆరు గ్రామాలు ఏకగ్రీవానికి మొగ్గుచూపడంతో శ్రీరాం తండా, చౌడు తండా, దుబ్బతండా, దాసు తండా, గొల్లపల్లి, కుందనవానిపల్లి గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. కాగా శ్రీరాం తండాలో ఉన్నత విద్య నభ్యసించిన భానోతు వెంకటేష్ కొత్తగా ఏర్పాటైన పంచాయతీలో తండా వాసులను ఏకతాటికి తీసుకొచ్చి ఏకగ్రీవానికి కార్యరూపం దాల్చారు. ఆదర్శనీయంగా గ్రామాన్నీ తీర్చిదిద్దడంలో సర్పంచ్ స్థానాన్నీ ఏకగ్రీవం చేసి, సర్పంచ్‌గా నియామక పత్రాన్నీ స్వీకరించి మండలంలో ఆదర్శంగా నిలిచారు.

**గ్రామాల్లో పెరిగిన రాజకీయ చైతన్యంతో..**

ఉన్నత విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు,సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువత ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో యువత బరిలో నిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం దాఖలైన నామినేషన్లలో సగం మందికి పైగా 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్న వారే పోటీ చేస్తుడటం విశేషం.

**ఉపాధి కల్పనే ప్రచారాస్త్రం..**

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే యువత ఎక్కువ వరకు స్థానికంగా ఉపాధి కల్పన లక్ష్యంగా తమ ప్రచారంలో దూసుకుపోతున్నారు.గ్రామాల్లో పుష్కలమైన వనరులున్నా.. స్థానిక యువతకు ఉపాధిలేక .. నగరాల బాట పడుతున్న విషయాన్నీ ప్రజలకు తెలిసేలా వివరిస్తున్నారు. దీర్ఘకాలంగా గ్రామాల్లో పట్టి పీడిస్తున్న సమస్యలకు పరిష్కారాలను చూపిస్తామంటున్నారు. ఇతర రాజకీయ నాయకుల కన్నా.. పోటీలో నిలిచిన యువత సామాజిక మాధ్యమాలు విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఏఐ సాయంతో రూపొందించిన వీడియోలతో వాట్సప్ గ్రూపులను నింపేస్తున్నారు.



## హత్య కేసులో నిందితుడి రిమాండు

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణములోని సంతోషిమాత టెంపుల్ దగ్గరలోని వ్యాపార సముదాయములలోని నందన టీ స్టాల్‌లో జరిగిన హత్యా నేరానికి సంభంధించి నిందితుడు ఇప్పరె నగేష్,(26) కుంసర గ్రామణినికి చెందిన జొందలే అశ్విని (28) అను వివాహిత మహిళను దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడు ఇప్పరె నగేష్‌ను జుడీషియాల్ రిమాండుకు పంపడమైనది. నిందితుడు నగేష్ సంఘటనా స్థలములోనే ప్రజల సహకారంతో పోలీస్ వారికి పట్టుబడినాడు అతన్ని ఈ రోజు ఉదయం కోర్టులో హాజరు పరచి జుడీషియాల్ రిమాండ్‌కు పంపడమైనది.
మృతురాలు రేవే వ్యక్తితో ఫోన్లో మాట్లాడుతున్నదని చాటింగ్ చేస్తున్నదని అనుమానముతో ఈ హత్య చేసినట్లుగా నగేష్ పోలీస్ వారి ముందు వాంగ్మూలము ఇచ్చాడు.

## కట్టుదిట్టంగా నవోదయ ప్రవేశ పరీక్ష

### నిర్మల్ ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఈనెల 13,శనివారం రోజునన జరగనున్న జవహర్ నవోదయ విద్యాలయ ఎంట్రన్స్ పరీక్షను ఎలాంటి లోటుపాట్లు, అనుమానాలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ సూచించారు.బుధవారం నిర్మల్ డీఆర్‌సీ లో జరిగిన చీఫ్ సూపరింటెండెంట్ల పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,ప్రతి ప్రొఫార్మాను ఖచ్చితమైన సమాచారంతో పూర్తి చేయాలని సూచించారు.
అలాగే,ప్రతి గదికి 24 మంది విద్యార్థులను కేటాయించాలని పేర్కొన్నారు. ఈ పరీక్ష ఉదయం 11.30 నుండి 1.30 వరకు జరుగుతుందని ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.



## అర్ధాంగి కృష్ణ కుటుంబానికి సిపిఐ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** సిపిఐ సీనియర్ నాయకుడు అర్ధాంగి కృష్ణ మరణంపై పార్టీ నాయకత్వం సానుభూతి తెలిపింది. బుధవారం తాంసి మండలం గోట్కూరి గ్రామంలోని అర్ధాంగి కృష్ణ కుటుంబాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు, మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళిని రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులు, వారి కుమారులు, సతీమణితో మాట్లాడి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో దాదాపు 55సంవత్సరాల పాటు అంకితభావంతో సిపిఐకి సేవచేసిన అర్ధాంగి కృష్ణ వంటివారిని కోల్పోవడం పార్టీకి, గోట్కూరి గ్రామం, తాంసి మండలానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాల దిశగా కుటుంబ సభ్యులు ముందుకు సాగాలని సూచించారు. అర్ధాంగి కృష్ణ పెద్ద కుమారుడు ఎ.రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా, తాంసి మండల కార్యదర్శిగా కొనసాగుతున్న విషయం నాయకులు గుర్తు చేశారు. ఆయన తండ్రి అడుగుజాడల్లో నడవాలని కుటుంబానికి సూచించారు. కిష్టన్న కుటుంబానికి సిపిఐ జిల్లా నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయ్

### రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ప్రవేశపెట్టినటువంటి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్‌ల అభ్యర్థులను గెలిపిస్తాయని రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ అన్నారు. సోమవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చరని పేర్కొన్నారు. బి.ఆర్.ఎస్ పది సంవత్సరాలు చెయ్యని పనులు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలను అన్నీ రెండు సంవత్సరాల లోపే చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, సారంగాపూర్ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూమయ్య, ఎన్ఆర్ఐ సెల్ స్వదేశీ పర్కిపండ్ల, స్వర్ణ ప్రాజెక్టు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, జగదీశ్వర్, సామల వీరయ్య, నగరావుతో పాటు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## పాఠశాలలో అర్హత లేని ప్రిన్సిపాల్ విధులు

### జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు

### నేషనల్ కన్స్యూమర్ రైట్ కమిషన్ డిప్యూటీ చైర్మన్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ నగరంలోని ప్రయివేటు అరబిందో హైస్కూల్ పాఠశాలలో అర్హత లేని ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్నారని, విద్యాశాఖకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నియమాలను పట్టించుకోకుండా పాఠశాల నిర్వహిస్తున్నారని జాతీయ వినియోగదారుల ఫోరమ్ తెలంగాణ శాఖ డిప్యూటీ చైర్మన్ టి.విశాల్ జిల్లా అధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ నియామక ప్రక్రియలో ప్రభుత్వ ప్రమాణాలు పాటించకుండా, అర్హతలు పూర్తిగా లేని పుజారి పావనిని ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారని జాతీయ వినియోగదారుల హక్కుల సంఘం దృష్టికి వచ్చిందన్నారు. ప్రిన్సిపల్ పదవి అనేది ఒక బాధ్యతాయుతమైన స్థానమని, సంబంధిత విద్యార్హతలు, అనుభవం, నిర్వహణ సామర్థ్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ వినియోగదారుల ఫోరమ్ తరపున జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌లకు అధికారిక నోటీసులు పంపించామన్నారు. పాఠశాలలో నియామక ప్రమాణాలు, అర్హత పత్రాలు, నిర్వహణ విధానాలపై తక్షణ విచారణ చేపట్టాలని కోరామన్నారు. అవసరమైతే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/బోధన్ :** తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ పరిధిలో ఎన్నికల అధికారులు ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. సాలూర మండలంలోని గ్రామాలలో జరిగే ఎన్నికల కోసం అధికారులు బ్యాలెట్ బాక్సలతో బయలు దేరారు. బోధన్ డివిజన్ పరిధిలో బోధన్, సాలూర, ఎడపల్లి, నవీపేట్, రెంజల్, వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్, కోటగిరి, పోతంగల్ మండలాలలో మొదటి విడత గ్రామ పంచాయతీ, వార్డు మెంబర్ల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సూచనల మేరకు ఆయా మండలాల మండల ప్రజా పరిషత్ అధికారులు బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. 11వ తేది ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.



## ఫ్లయింగ్ స్క్వాడ్ మద్యం పట్టివేత

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని కల్వకుంట శివారులో 180 ఎంఎల్, 48 మద్యం బాటిల్స్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమ్యశ్రీ ఆధ్వర్యంలో బుధవారం పట్టుకోవడం జరిగింది. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఎవరైనా మద్యం కానీ, డబ్బులను కానీ పంచినట్లయితే పట్టుకొని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దన్నారు.

## ఎన్నికల విధులను అధికారులు ఉత్సాహంగా నిర్వహించాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ కలక్టరేట్ :** ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే అధికారులు ఎటువంటి ఒత్తిడిలేకుండా ఉత్సాహంగా తమ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం పెంబి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌంటర్లవారీగా సిబ్బందిని, వారికి కేటాయించిన సామాగ్రిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి,ఆర్డీఒ రత్న కళ్యాణి, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, డిఇఒ భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**నిర్మల్ టౌన్ :** మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరూ ప్రశాంతంగా ఉండి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఓపికగా ఉండాలని అన్నారు.
అన్ని ఫారములను తప్పులు లేకుండా పూరిస్తూ, ఓటింగ్ సరళి వివరాలను పంపాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. కౌంటర్ల వారీగా తిరుగుతూ, అన్ని పోలింగ్ ప్రతులు, ఫారములు, ఇతర ఎన్నికల సామాగ్రి ఆయా రూట్ల, పోలింగ్ కేంద్రాల వారిగా అందాయో లేదో ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సమయానికి భోజనం అందించాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి(సిపిఒ) జీవరత్నం, డిఇఒ భోజన్న, తహసీల్దార్ సుజాత, ఎంపిడిఒ రమాకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

### ఎస్‌పి జానకి షర్మిల

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదుదారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.




**కుటుంబ వివాదాలు పరిష్కారంలో 'షీ టీం' పాత్ర :** ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు ''నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడంపై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.
**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష :** ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.



## పోలింగ్ సిబ్బంది ప్రయాణానికి థర్మాకోల్ పడవ

### జనరల్ ఆబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం పర్యవేక్షణ

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందర్భంగా నిర్మల్ జిల్లా జనరల్ ఆబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం మంగళవారం పెంబి మండలంలోని యాపాలగూడ గ్రామపంచాయతీని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలింగ్ స్టేషన్లకు చేరుకునే ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు.యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే స్వయంగా పరిశీలించారు.యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో వాగు ఉండడం వల్ల,స్థానికంగా తయారు చేసిన థర్మాకోల్ పడవను ఉపయోగించి సిబ్బందిని సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేస్తున్నాట్లు అధికారులు ఆబ్జర్వర్‌కు తెలిపారు.ఈ ఏర్పాట్లను ఆమె సమగ్రంగా పరిశీలించి,సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మొదటి విడత పోలింగ్ రేపే జరగనున్న నేపథ్యంలో,సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు.నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు,సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం స్పష్టం చేశారు.

## సిర్పూర్ సర్పంచ్ ఏకగ్రీవం

**ప్రజాపక్షం/నందిపేట్ :** డొంకేశ్వర్ మండలంలో సిర్పూర్ గ్రామం ఏకగ్రీవం అయిందని మండల అధికారి నాయక్ తెలిపారు. అలాగే 48 వార్డులు ఏక్రగీవం, 118 వార్డులు రంగంలో ఉన్నాయని ఆయన చెప్పారు. నందిపేట్ మండలంలో 33 వార్డులు ఏక్రగీవం, 77 సర్పంచ్‌లు, 492 వార్డులు రంగంలో ఉన్నారని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు.



## ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల సందర్శన

**ప్రజాపక్షం/బోధన్ :** నిజామాబాద్ జిల్లాలోని సాలూరా, కోటగిరి మండలాల్లోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహోతో బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల మెటిరియల్ యొక్క ధ్రువీకరణ, బ్యాలెట్ పత్రాలు, సీల్స్ కవర్లు, చట్టబద్ధమైన ఫారమ్‌లతో సహా అన్ని ఎన్నికల సామాగ్రిని ఖచ్చితంగా ప్యాక్ చేసి ప్రిసైడింగ్ ఆఫీసర్లకు పంపిణీ చేసినట్లు నిర్ధారించాలన్నారు. పిఓ ల శిక్షణ, బ్రీఫింగ్, అన్ని పీఓ లు వారి పాత్రలు, విధానాలు, పోలింగ్ రోజు ప్రోటోకాల్‌ల గురించి స్పష్టంగా నిర్ధారించుకోవాలన్నారు. ఫారమ్‌లు సకాలంలో పంపిణీ చేయాలని, పోలింగ్ స్టేషన్ సంసిద్ధత, మండల అధికారులతో సమన్వయం, పోలింగ్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించడం, ఫోల్ డే కార్యకలాపాల పర్యవేక్షణ, కౌంటింగ్ హాల్ ప్రిపరేషన్ తదితర వాటిపై సబ్ కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు.

## ఎన్నికల సన్నాహాలు పూర్తి

### 166 పోలింగ్ కేంద్రాల్లో నేడు పోలింగ్

**ప్రజాపక్షం/ఎడపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా అబ్జర్వర్ ఆఫీసర్ శ్యాంప్రసాద్‌లాలు తెలిపారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొత్తం 166 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఇందులో సర్పంచ్ ఎన్నికల కోసం ప్రత్యేకంగా 158 పోలింగ్ స్టేషన్లను వినియోగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మండలంలో మొత్తం 166 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయగా, 59మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వార్డు సభ్యుల పోటీ ఉన్న స్టేషన్లు 124 కాగా, 306వార్డు సభ్యులు పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగేందుకు అవసరమైన సిబ్బందిని నియమించినట్లు అబ్జర్వర్ ఆఫీసర్ తెలిపారు. 190 ప్రిసైడింగ్ అధికారులు, 272 అదనపు పోలింగ్ అధికారులు, వీరు కాకుండా ఎడపల్లి, జాన్కంపేట్, ఎఆర్‌పి క్యాంప్ ప్రాంతాలలో ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్‌లను కూడా నియమించినట్లు ఆయన స్పష్టం చేశారు. మండలంలో 38 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎడపల్లి, ఎఆర్‌పి, జాన్కంపేట్ వంటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని శ్యాంప్రసాద్ లాలు వివరించారు. పోలింగ్ సమయం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం రెండు గంటల తరువాత ఎట్ల లెక్కింపు ఉంటుందని జిల్లా అబ్జర్వర్ ఆఫీసర్ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే విజేత అభ్యర్థుల గెలుపు ప్రకటన ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంపిడిఒ శంకర్, తహసీల్దార్ దత్తాత్రి, రూరల్ సిఐ విజయ్ బాబు తదితరులు ఉన్నారు.



## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

### ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు బాల్కొండ ఎమ్మెల్యేను వేల్పూర్‌లో బుధవారం కలువగా, వారిని శాలువతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. మోర్తాడ్ మండలం దోంచంద సర్పంచ్‌గా పెద్దల శ్రీనివాస్‌రెడ్డి, వేల్పూర్ మండలం హనుమాన్‌నగర్ సర్పంచ్‌గా అల్లెపు నడ్పి మల్లయ్య, కొత్తపల్లి సర్పంచ్‌గా విజయలు ఏకగ్రీవంగా ఎన్నిక కావటంతో వారిని ఎమ్మెల్యే శాలువతో సన్మానించారు. నాయకులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో రూ.5.97లక్షలు స్వాధీనం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో తనిఖీలలో మంగళవారం రాత్రి ఎఫ్ ఎస్ టి అధికారులు మహేష్ కుమార్, ఏఎస్ఐ గాలయ్య, ఐదు లక్షల 97 వేల నగదును పట్టుకున్నారు. అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ బ్యాంక్ ఏరియాలో బీహార్ చెందిన వితిన్ రోహన్ రాజ్ నగదుతో వెళుతుండగా, ఎఫ్ ఎస్‌టి అధికారులు తనిఖీ చేయగా 5 లక్షల 97 వేలు నగదు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై శంకర్ కు అందజేశారు. ఈ నగదు రైస్ మిల్ యజమాని బచ్చు రమేష్ కి చెందినదిగా పోలీసులు తెలిపారు. ఎస్సై ఈ నగదును ఆర్డిఓ కు డిపాజిట్ చేశారు.

# గ్రామాల్లో మహిళా సర్పంచ్‌ల పరోక్ష యుద్ధం!

### జాయింట్ చెక్ పవర్‌తో ఉపసర్పంచ్ హవా..!

### సర్పంచ్‌ల కంటే ఉపసర్పంచ్‌లకే అధికారం..!

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో ఉపసర్పంచ్ పదవిపై జరుగుతున్న అవిశ్వాస రాజకీయాలు ప్రస్తుతం రసవత్తరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్లలో ఉన్న గ్రామాలలో ఉపసర్పంచ్ పదవిని నిలబెట్టుకోవడం, లేదా ఆ స్థానంలో పెత్తనం సాధించడం కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. గ్రామ పంచాయతీ ఎన్నికల తర్వాత,వార్డు సభ్యులు,సర్పంచ్‌లచే ఉపసర్పంచ్ పరోక్ష పద్ధతిలో ఎన్నుకోబడతారు.ఈ ఎన్నికలో వార్డు సభ్యులు చేతులెత్తి ఓటు వేసి ఉపసర్పంచ్‌ను ఎంపిక చేస్తారు.ఉపసర్పంచ్ పదవీకాలం సర్పంచ్ పదవీ కాలంతో సమానంగా ఐదేళ్లు ఉంటుంది.

**కొత్త చట్టం,కొత్త అధికారం..**

**జాయింట్ చెక్ పవర్‌తో పెరిగిన ప్రాధాన్యం..**

నూతనంగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం ఉపసర్పంచ్ పదవికి కీలకమైన ఆర్థిక బలాన్ని ఇచ్చింది. గతంలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీకి మాత్రమే ఉన్న జాయింట్ చెక్ పవర్ ఇప్పుడు ఉపసర్పంచ్‌కు కూడా లభించింది. దీంతో పంచాయతీ నిధులు ఖర్చు చేయాలంటే సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ సంతకం కూడా తప్పనిసరైంది. ఈ ఆర్థిక అధికారం ఉపసర్పంచ్ స్థానాన్ని బలోపేతం చేసినప్పటికీ, అదే సమయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల మధ్య నిధుల వినియోగంపై విబేధాలకు దారి తీస్తోంది.




**మహిళా సర్పంచ్‌ల గ్రామాల్లో పెత్తనం..**

**వార్డు సభ్యుల లక్ష్యం ఉపసర్పంచ్ పదవే..!**

ఈసారి అత్యధికంగా మహిళలకు రిజర్వేషన్ కల్పించడంతో, అనేక గ్రామాలలో మహిళా సర్పంచ్‌లు ఉన్నా లేకున్నా ఒకటే అన్న విధంగా పరిస్థితి మారింది. ఉపసర్పంచ్‌లు తమకు లభించిన జాయింట్ చెక్ పవర్ కారణంగా, తామే అన్నింటికీ సర్పంచ్‌గా వ్యవహరిస్తూ, అధికారాన్ని చెలాయిస్తున్నారు.
దీంతో, సర్పంచ్ పదవి కంటే కూడా ఉపసర్పంచ్ పదవిపై వార్డు సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. తమకు పదవి దక్కనప్పటికీ, జాయింట్ చెక్ పవర్‌ను అడ్డం పెట్టుకుని తమ పట్టు సాధించాలని వార్డు సభ్యులు తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పదవిని కోల్పోయినా సరే, అధికారాన్ని అడ్డుకుంటున్న ఉపసర్పంచ్‌లను తొలగించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి.
పాటించాల్సిన నిబంధనలు జాయింట్ చెక్ పవర్ కారణంగా నిధుల విషయంలో సఖ్యత లేని చోట ఉపసర్పంచ్‌లను పదవి నుంచి తొలగించేందుకు అవిశ్వాస తీర్మానాన్ని పాలకవర్గంలో వారికి అనుకూలురైన వారు ప్రయోగిస్తున్నారు. ఈ ప్రక్రియకు ముఖ్యంగా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. పంచాయతీ పాలకవర్గం ఎన్నికైన రెండేళ్ల తర్వాత మాత్రమే ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం పెట్టేందుకు వీలుంటుంది.అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి మూడింట రెండు వంతుల (2/3) మంది వార్డు సభ్యుల సంతాకాలు అవసరం. తీర్మానంపై జరిగే సమావేశంలో హాజరైన సభ్యులలో సాధారణ మెజారిటీ మద్దతు లభిస్తే ఉపసర్పంచ్ పదవిని కోల్పోతారు. ఒకవేళ అవిశ్వాసం వీగిపోతే, తదుపరి రెండేళ్ల వరకు అదే ఉపసర్పంచ్ పై మళ్లీ అవిశ్వాసం పెట్టడానికి వీలుండదు.

**పదవి ఖాళీ అయితే.. తాత్కాలిక ఏర్పాటు :**

ఉపన్నికలు అవిశ్వాసం ద్వారా ఉపసర్పంచ్ పదవి ఖాళీ అయినట్లయితే, కొత్తవారిని ఎన్నుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఉప ఎన్నికల నోటిఫికేసన్ ఇస్తుంది. కొత్త ఉపసర్పంచ్ ఎన్నికయ్యే వరకు, పంచాయతీ నిధుల వినియోగం ఆగిపోకుండా ఉండేందుకు తాత్కాలిక ఏర్పాటు చేస్తారు. పాలకవర్గంలోని మెజారిటీ వార్డు సభ్యుల తీర్మానం మేరకు ఎవరో ఒక వార్డు సభ్యుడికి తాత్కాలికంగా జాయింట్ చెక్ పవర్ బాధ్యత అప్పగిస్తారు. మొత్తంగా, జాయింట్ చెక్ పవర్ ఉపసర్పంచ్‌కు ఆర్థిక అధికారాన్ని, గౌరవాన్ని పెంచినప్పటికీ, అదే అధికారం గ్రామస్థాయి రాజకీయ విభేదాలకు కారణమై,వారి పదవి నిలకడకు సవాలు విసురుతోంది.

# క్రీడ

## అందువల్లే మైదానంలో అడుగు పెట్టగలిగా..




సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగుపెట్టేలా చేసిందని టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అన్నాడు. దీనివల్లే గాయం తర్వాత తాను మరింత దృఢంగా పునరాగమనం చేశానని అతడు వివరించాడు. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన హార్దిక్ దాదాపు రెండు నెలల తర్వాత కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో కనిపించాడు. ఇటు బ్యాట్‌తోనూ, అటు బంతితోనూ రాణించాడు. ముఖ్యంగా బ్యాటింగ్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 175 పరుగులు చేయడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు 28 బంతుల్లో 59* పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో రెండు ఓవర్లు వేసి 16 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

'గాయం తర్వాత నేను మరింత దృఢంగా, మిన్నగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. స్ట్రాంగ్‌గా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు' అని హార్దిక్ పాండ్య అన్నాడు. 'అలాగే మైదానంలోకి దిగిన తర్వాత ప్రతి క్షణం.. ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా. జనాన్ని ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా భాగస్వామి కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి విషయాలు జరిగాయి' అని హార్దిక్ పాండ్య తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మ గురించి తెలిపాడు. ముంబయిలో కొందరు ఫొటోగ్రాఫర్లు అత్యుత్సాహంతో మహికా శర్మ ఫొటోలు తీసిన విషయాన్ని మంగళవారం ఇన్‌స్టా స్టోరీలో హార్దిక్ పాండ్య ప్రస్తావించిన విషయం తెలిసిందే. 'మహికా శర్మ.. బాంద్రాలో ఓ రెస్టరంట్ దగ్గర నడుచుకుంటూ వెళ్తోంది. అప్పుడు ఓ ఫొటోగ్రాఫర్.. ఆమె ఫొటోలను తీశాడు. అయితే ఆడవాళ్లు ఇబ్బందిపడేలా ఉన్న కోణంలో వాటిని తీశాడు. సెన్సేషనలిజం కోసం వ్యక్తిగత గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదు. ఆడవాళ్లకు మనం కనీస మర్యాద ఇవ్వాలి. ప్రతి ఒక్కరికీ హద్దులుంటాయి' అని హార్దిక్ అసహనం వ్యక్తం చేశాడు.

# తగ్గేదేలే..

## ర్యాంకింగ్స్‌లో రో–కో రూలింగ్

### రోహిత్‌కు అగ్రస్థానం.. రెండో స్థానంలో కోహ్లీ

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆధిపత్యం కొనసాగించారు. ఐసిసి బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నారు. ఇప్పటికే నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో రన్ మిషన్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం నెంబర్ వన్ ప్లేస్‌ను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ.. అగ్రస్థానానికి చేరుకునేందుకు కేవలం ఎనిమిది రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల్లో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లీ అజేయంగా 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాంతో ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో రెండుస్థానాలు మెరుగుపరుచుకొని రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో స్థిరంగా రాణిస్తూ తన నెంబర్ వన్ ప్లేస్‌ను నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 146 పరుగులు చేశాడు. కోహ్లీ, రోహిత్ ఇద్దరు ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్2 ప్లేసుల్లో నిలిచారు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో ఉన్నాడు. మరో బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఒక ర్యాంకు దిగజారి 10వ స్థానానికి చేరుకున్నాడు.





**ఐసిసి తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటర్ల ర్యాంక్‌లు**

1. రోహిత్ శర్మ (భారత్)– 781
2. విరాట్ కోహ్లీ (భారత్)– 773
3. డెరిల్ మిచెల్ (న్యూజిలాండ్)– 766
4. ఇబ్రహీం జద్రాన్ (ఆఫ్గనిస్థాన్)– 764
5. శుభ్‌మన్ గిల్ (భారత్)– 723
6. బాబర్ అజామ్ (పాకిస్థాన్)– 722
7. హ్యారీ టెక్టర్ (ఐర్లాండ్)– 708
8. షాయ్ హోప్ (వెస్టిండీస్)– 701
9. చరిత్ అసలంక (శ్రీలంక)– 690
10. శ్రేయస్ అయ్యర్ (భారత్)– 679

కేఎల్ రాహుల్ రెండు స్థానాలను మెరుగుపరుచుకొని 12వ ప్లేస్‌కు చేరాడు. ఇక బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని మూడోస్థానంలో నిలిచాడు. టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా బ్యాట్స్‌మెన్ యశస్వీ జైస్వాల్ మాత్రమే ఎనిమిది స్థానంలో నిలువగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 11వ స్థానం, రిషబ్ పంత్ 13వ స్థానాలకు చేరుకున్నారు. టెస్ట్ బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ ప్లేస్‌ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఒక్కో స్థానాన్ని మెరుగుపరుచుకొని వరుసగా 12వ, 13వ, 14వ స్థానాల్లో నిలిచారు. అదే సమయంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్‌రమ్, టెంబా బావుమా సైతం తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. అదే సమయంలో యాషెస్‌లో రెండు మ్యాచ్‌ల్లో 18 వికెట్లు తీసిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడోస్థానానికి ఎగబాకాడు. పేలవమైన బ్యాటింగ్ కారణంగా హ్యారీ బ్రూక్ నాల్గో ప్లేస్‌కు పడిపోయాడు. కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ ఒక్కొక్క స్థానం మెరుగుపరుచుకున్నారు.

# ఫోకస్




సుమారు 50,000 నుంచి 70,000 సంవత్సరాలకు పూర్వం, మనిషి అభివృద్ధిలో ఒక విప్లవాత్మక ఘట్టం చోటు చేసుకుంది. అనేక తరాల పాటు హోమో సెపియన్స్‌లు (హోమో సెపియన్స్) ఆఫ్రికా ఖండంలోనే నివసించారు.




## 'రొజెట్టా'కు చారిత్రక ప్రాధాన్యం..

రొజెట్టా శిల పురావస్తు ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యమైన ఆవిష్కరణలలో ఒకటిగా నిలుస్తుంది. 1799 జులై 19న ఫ్రెంచ్ ఇంజినీరింగ్ బృందం ఈజిప్టులోని రొజెట్టా (నేటి రషీద్) అనే ప్రాంతంలోని ఫోర్ట్ జూలియన్ కోటలో తవ్వకాలు నిర్వహిస్తున్నప్పుడు లెఫ్టినెంట్ పియర్‌ఫ్రాంస్వా బుషార్ ఈ శిలను కనుగొన్నారు. సైనికులు తవ్వినప్పుడు అందులో పాలిష్ చేసిన రాతిబండపై మూడు భాషల్లో శాసనాలు కనిపించాయి. ప్రాచీన ఈజిప్టు హైరోగ్లిఫిక్, డెమొటిక్, ప్రాచీన గ్రీకు. ఈ త్రిభాషా శాసనం క్రీస్తుపూర్వం 196 నాటిదని అంచనా. మూడు భాషల్లో ఒకే విషయాన్ని రాయడం వలన శాస్త్రవేత్తల దృష్టి దీనిపైన పడింది. గ్రీకు భాష అప్పటికే తెలిసినది కావడంతో, పరిశోధకులు గ్రీకు వచనాన్ని మిగతా రెండు అన్యభాషా లిపులతో పోల్చి అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. జోహన్ డేవిడ్ ఆకర్‌బ్లాడ ఆంవోన్‌ఈసాక్ సిల్వెస్ట్ర డి సేసీ వంటి పండితులు మొదటిసారిగా విలువైన సూచనలు అందించారు. ఆ తరువాత థామస్ యంగ్ కొన్ని ధ్వని చిహ్నాలను గుర్తించి కొత్త దారిని చూపించాడు. చివరికి జీన్ ఫ్రాన్స్వా షాంపోలియన్ 1822 సెప్టెంబర్ 27న హైరోగ్లిఫిక్ లిపి యొక్క తుది అర్థాన్ని విజయవంతంగా ప్రకటించాడు. ఇది ఈజిప్టు భాషా రహస్యాల పరిష్కారానికి కీలక ఘట్టమైంది. ఫ్రాన్స్ పరాజయం తరువాత 1801లో అలెగ్జాండ్రియా ఒప్పందం ప్రకారం ఫ్రెంచ్ బృందం కనుగొన్న అనేక పురావస్తు వస్తువులు బ్రిటిష్ పాలకుల అధీనంలోకి వచ్చాయి. ఆ ఒప్పందంతోనే రొజెట్టా శిలను కూడా ఇంగ్లాండ్‌కు తరలించారు. 1802 ఫిబ్రవరిలో అది పోర్ట్‌స్మౌత్‌కు చేరి, ఆ ఏడాది జూలైలో బ్రిటిష్ మ్యూజియానికి అప్పగించారు. అప్పటి నుంచి ప్రజలు దానిని చూడగలుగుతున్నారు. ఈ రాతిబండ గ్రానోడియోరైట్ రాతితో తయారైనది. దీని ఎత్తు సుమారు 112 సెం.మీ., వెడల్పు 75 సెం.మీ., బరువు సుమారు 760 కిలోలుంటుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ శాసనం మొదట ఒక ఆలయంలో ప్రతిష్టించారు. తర్వాత ఫోర్ట్ జూలియన్ నిర్మాణ సమయంలో దానిని గోడల నిర్మాణానికి పునర్వినియోగించారు. ఈ రాతిబండ ఈజిప్టు నుండి లండన్ వరకు చేరిన ప్రయాణం, అలాగే ప్రాచీన ఈజిప్టు లిపి రహస్యాలను విప్పడంలో దాని పాత్ర, యుద్ధ సమయాల్లో సాంస్కృతిక వస్తువుల బదిలీ, వాటి తిరిగి వచ్చే హక్కుల గురించి జరిగే చర్చల్లో రొజెట్టా శిలను ప్రతీకాత్మక చిహ్నంగా నిలబెట్టాయి.



## హోమో సెపియన్స్ వలస..

నేటి కాలానికి తెలియని కారణాల వల్ల అక్కడి నుంచి చిన్న చిన్న సమూహాలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయి. ఈ సమూహాల్లోని వారంతా అత్యంత ధైర్యవంతులు, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల సమర్థులు కాబట్టి, వారి వలసలు ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త నాగరికతలకు పునాదలు వేశాయి. అయితే, వారంతా తన జన్మభూమిని ఎందుకు వదిలి వెళ్లారు? అనేది ప్రశ్న. దీనికి శాస్త్రవేత్తలు రకరకాల కారణాలు చెప్పారు. పర్యావరణ మార్పులు, నీటి వనరుల కొరత, వివిధ వంశాల మధ్య పోరు, ప్రకృతి వనరుల వేట వంటి అనేక కారణాలను శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కొన్ని వందల సంవత్సరాల పాటు మారే వాతావరణ పరిస్థితులకు అవారు తట్టుకుని, లక్షల సంవత్సరాల అనుభవంతో ఈ సమూహాల తరాలు అడుగులు ముందుకు వేశాయి. 70,000 సంవత్సరాల క్రితం, ఆఫ్రికాలోని మానవులు అనేక విభిన్న పరిసరాలను, రేంజ్‌లను ఉపయోగించడంలో ప్రత్యేక అధ్యయనం సాధించారు. అడవులు, ఎడారులు, నదీ ప్రదేశాలు, పచ్చని తీరాలు అన్నీ అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నారు. ధైర్యం, ఆసక్తి, కొత్త వనరుల శోధనతో పాటు, సంభావ్యతను, భయాన్ని అధిగమించడం, అన్వేషణ దాహం, సమస్యలకో పరిష్కారం తదితర లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు. ఇవన్నీ మానవుల అసలు స్వభావంలో ఒక్కడో ఒక చోట ఇప్పటికీ కనిపిస్తాయి. ఇదంతా ఆత్మవిశ్వాసమా లేక జీవన పోరాటంలో భాగమా అనే ప్రశ్నపై లోతైన అధ్యయనాలు జరుగుతున్నాయి. అదే సమయంలో జన్యుపరమైన అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మొత్తానికి ఆఫ్రికా ప్రాంతాన్ని విడిచి, కొత్త ప్రాంతాలు.. అక్కడి భూములు చేరుకున్న నాటి సమూహాల దృఢ సంకల్పం, మనిషి విప్లవాత్మకమైన నైపుణ్యాలను, ఆలోచనలను, యాసలు, సాంకేతిక నిర్మాణాలను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ప్రయాణాల వలన, భిన్న జాతులు, భద్రమైన భవిష్యత్తు, వినూత్న సంస్కృతుల ఉద్భవం సాధ్యమయ్యాయి, మానవ అభివృద్ధి దృక్పథం పూర్తిగా మార్చిపోయింది.

# వనరుల వినియోగంతో అభివృద్ధి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలని సిపిఐ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సిపిఐ మండల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చాడ మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తుందని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సిపిఐ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. తెలంగాణలో మొదటినుంచి భూసమస్య ఉన్నదన్నారు. సమగ్ర అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలోని వనరులన్నింటినీ ప్రజల కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందని సిపిఐ మొదటినుంచి చెబుతుందన్నారు. రైజింగ్ తెలంగాణ గ్లోబల్ సమ్మెట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయాలను ప్రస్తావించడం హర్షణీయమన్నారు.. జల్–జంగల్–జమీన్, కొమరం భీం ప్రస్తావన చేయడం, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందారని సిఎం మాటల్లో చెప్పడం అభినందనీయ మన్నారు. గత పరిపాలకులలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇలా మాట్లాడలేదన్నారు. సామాజిక అంశాలపై సిఎం లోతుగా అధ్యయనం చేశారని, విద్య, వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుండి రావాల్సిన నిధులు విడుదల కాలేదని, వాటిని తెప్పించుకోవలసిన అవసరం ఉందన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేసి గ్రామసీమల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడుతున్న సిపిఐ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని సమావేశంలో చాడ వెంకటరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందెస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తెరాల సత్యనారాయణ, మండల నాయకులు అనువోజు జనార్ధన్, అల్లేపు జంపయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు రాకం అంజవ్వ, కేతవ్వ, సౌందర్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ఎజెండా

**సిపిఐ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి అండగా నిలవండి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సిపిఐ ప్రధాన ఎజెండా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి, పెనగడప, అంబేద్కర్ నగర్, గ్రామ పంచాయితీలతో పాటు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శేషగిరినగర్ తెలగరామవరం, హేమచంద్రాపురం, గుడ్డిగుట్ట గ్రామ పంచాయితీల్లో విస్తృతంగా పర్యటించి అభ్యర్థులకు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామాల్లో పారదర్శక పాలన సిపిఐ ప్రజా ప్రతినిధులతోనే సాధ్యమన్నారు. ప్రజలకు వెన్నంటి ఉండేది సిపిఐ ప్రజాప్రతినిధులే అన్నారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వంతో కొట్లాడి వివిధ పథకాల్లో నిధులు రాబట్టి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, ప్రజా సమస్యలు పరిష్కరించ గలిగామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడుతున్న సిపిఐ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. గ్రామ స్వపరిపాలన కోసం ప్రజల్లో మమేకమయ్యే సిపిఐ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్స్‌గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో కూనంనేని వెంట పార్టీ జిల్లా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉన్నత స్థానం




**సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. విద్య సమాజంలో ఎదుగుదలకు తోడ్పడుతుందని, గొప్పస్థానం లభిస్తుందన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పరీక్షలకు ఉపయోగ పడే ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ విద్య ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే నేడు అనేక ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లు, ఐపిఎస్ అధికారులు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలో చదివినవాళ్లేనని, అంత ఎదుగుదల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే సాధ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు వినియోగించుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థినని చెప్పుకుంటున్నారని తెలిపారు. మన ప్రాంతంలో చదివే పిల్లలు అధికారులుగా ఎదిగి ఈ ప్రాంతానికి, ప్రజలకు సహాయం చేసి సమాజ నిర్మాణం లో భాగస్వాములు కావాలన్నారు. పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్, జర్నలిస్ట్ నాయకులు తొండ వెంకట్, బాబు, వంశీ, ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు సుధాకర్, రత్నం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశయంకోసం పనిచేసే వారిని

# 'స్థానిక' ఎన్నికల్లో ఆదరించండి

**సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** గ్రామపంచాయతీ ఎన్నికలలో ఆశతో కాదు ఆశయం కోసం పనిచేసే భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఆదరించాలని సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ప్రజలను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించి పోరాడే నిస్వార్థ రాజకీయ నాయకులు కమ్యూనిస్టులని, అట్లాంటి వారిని గెలిపించుకోవడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు అవినీతిని పారదోలిన వాళ్ల అవుతారన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ప్రజలకోసం నిరంతరం పాటుపడతారన్నారు. ఈ విషయాన్ని గమనించి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపల్లి రాము, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్‌బాబు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామాల అభివృద్ధి

# కమ్యూనిస్టులకే సాధ్యం



**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విలాస్**

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులకే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు ఎస్.విలాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం, గ్రామం పరిధిలో సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటితో గెలిపించాలని బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇచ్చోడ గ్రామంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎస్కే ఉస్మాన్‌తో కలిసి సిపిఐ వార్డు సభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. అలాంటి సిపిఐ అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా గెలిపిస్తే సమస్యల పరిష్కారినికి పోరాడుతారన్నారు. ఇచ్చోడ గ్రామంలో వార్డ్ నెంబర్ 14 నుంచి పోటీ చేస్తున్న జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు కల్లేపల్లి గంగయ్యతో పాటు వార్డ్ నెంబర్ 1, 12, 7, 11 స్థానాల్లో, నర్సాపూర్ వార్డ్ నెంబర్ 3, గీర్జం వార్డ్ నెంబర్ 2, సిరిచెల్మ, దుబ్బర్‌పేట్, అడగామా(కే)లో వార్డ్‌నెంబర్ 1, 2 స్థానాలలో సిపిఐ అభ్యర్థులు రంగంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వారిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్యల లక్ష్మణ్, అన్నెల పెద్దలక్ష్మణ్, మేడపాట్ల గంగన్న, రవి మేస్త్రీ, ఆర్.రాందాస్, జె.దినేష్‌కుమార్, ఎ.దత్తు, మచ్చరమే నరేష్, కల్లెపల్లి నరేష్, నాగమ్మ, మరియమ్మ, దుబ్బాక ఆడేలు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కమలాపూర్‌లో పోలీస్ కవాతు



**ప్రజాపక్షం/కమలాపూర్:**నేడు జరుగుతున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అడిషనల్ డిసిపి రవి ప్రజలకు పిలుపునిచ్చారు. డిసిపి ఆధ్వర్యంలో కమలాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి రవి మాట్లాడుతూ...ఎన్నికల నిబంధనలను అభ్యర్థులతో పాటు ప్రజలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో అల్లర్లకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండల వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎసిపి సిసిఎస్ సదయ్య, ఎసిపి కాజీపేట ప్రశాంత్ రెడ్డి, సిఐ హరికృష్ణ తో పాటు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత మహబూబాబాద్ జిలాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లాలో మహబూబాబాద్, గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, నెల్లికుదురు ఐదు మండలాల్లో జరిగే మొదటి విడత ఎన్నికల్లో 155 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అందుకోసం 1753బ్యాలెట్ బాక్స్‌లు, 49 రూట్ ఆఫీసర్లు, 15 జోనల్ అధికారులను నియమించారు. మండలానికి ఒక పంపిణీ కేంద్రం ఏర్పాటుచేశారు. మొదటి విడతలో 1621మంది పిఒలు, 1853 మంది ఒపిఒలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహణకు నియమించారు. అలాగే 10మంది మైక్రో అబ్జర్వర్లతో పాటుగా ఐదుగురు రిజర్వు అబ్జర్వర్లను ఏర్పాటుచేశారు. 122సిసి కెమెరాల ద్వారా వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలో 146మంది సర్పంచ్ స్థానాలకు, 1072 వార్డు స్థానాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు పోలింగ్ సామాగ్రిని మండల కేంద్రాల్లో పోలింగ్ అధికారులకు పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలకు బస్సుల ద్వారా పంపిచారు. ప్రతి 201 నుండి400మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పిఒ, 3ఒపిఒఉ, 401 నుండి 650 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1పిఒ, ముగ్గురు ఒపిఒలు విధులు నిర్వహిస్తారు.

## గ్రామాభివృద్ధికి మరోసారి పట్టం



**ప్రజాపక్షం/ఆత్మకూరు :**చౌల్లపల్లి గ్రామ సర్పంచిగా నన్ను మరోసారి ఎన్నుకుంటే గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని అభివృద్ధికి పట్టం కట్టాలని తాజా మాజీ సర్పంచ్ కంచ రవికుమార్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం చౌల్లపల్లి గ్రామంలో తన వార్డు మెంబర్ల అభ్యర్థులతో కలిసి పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారం చేసినారు. నేను గతంలో సర్పంచుగా మన గ్రామాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు తీసుకురావడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. తాను కుల, మతాలకు అతీతంగా గ్రామ ప్రజలను కలుపుకొని గ్రామ అభివృద్ధికి సలహాలు సూచనలు ప్రజల నుండి తీసుకున్నానన్ని.. మన గ్రామాన్ని దేశంలో జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు తీసుకురావడానికి అన్ని విధాల కృషి చేస్తానని ఓటర్లకు హామీ ఇస్తూ ప్రచారాల్లో ముందున్నారు. కాంగ్రెస్ బలపరిచిన గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే తమ ప్రభుత్వంలో జాతీయ ఉత్తమ గ్రామ అవార్డు తీసుకువస్తూ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని, అందరు వార్డ్ మెంబర్ అభ్యర్థులను, నన్ను అత్యధిక మెజార్టీతో తన గుర్తు ఉంగరంపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

## చెత్త తరలింపులో జాప్యం వద్దు



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:**ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుండి చెత్త తరలింపులో జాప్యం లేకుండా చూడాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ పరిధి పోతననగర్‌లో గల సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛఆటోల మరమ్మత్తులు పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పడుతుందని అట్టి పరిస్థితిని నివారించడానికి వాహనాలను నిర్వహించే వారిని మార్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించే ప్రక్రియ వేగవంతం అయ్యిందని, ఇట్టి క్రమంలో ఆటోలు అందుబాటులో ఉండడం తప్పనిసరని అన్నారు. మరమ్మత్తులను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సిఎంహెచ్ఒ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ఒడాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, పాల్గొన్నా రు.

## పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తం

పస్రా ఎస్ఐ అచ్చ కమలాకర్



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గోవిందరావుపేట మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద 140 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశాం ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగ్చికోవాలి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత నిర్వహించాలి సిబ్బంది పోలీస్ స్టేషన్ దాటి వెళ్ళవద్దు ఈ క్రమంలో పలు రాజకీయ నాయకులు ర్యాలీలు ప్రదర్శన నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు పోలింగ్ ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పని చేయాలన్నారు ఎన్నికల సమయంలో పోలీస్ అధికారులు గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాలు ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తపడాలన్నారు పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు వచ్చి వేళ్ళే మార్గాలలో వాహనాలు పార్కింగ్ లేకుండా చూసుకోవాలన్నారు .ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఫోన్ నెంబర్లు పస్రా 8712670085సంప్రదించాలనితెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు ప్రభుత్వం పెద్దపీట

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి ఊరును బాగు చేసుకుంటారో.... వేరే వాళ్లకు ఓటు వేసి ఊరును ఆగం చేసుకుంటారో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని మడిపల్లి, అనంతసాగర్, జయగిరి, సీతంపేట గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు,కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు రావాలన్నా, సి సి రోడ్లు నిర్మాణం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.మడిపల్లి గ్రామంలో జరిగిన ప్రచారంలో మడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిద్దుతానని,మడిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి చిర విజయ్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే గ్రామానికి మరొక 50 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తానని,ఇందిరమ్మ ఇల్లు అనేది నిరంతర ప్రకియ అని, అలాగే గ్రామానికి అనుసంధానం అయ్యే రోడ్ల అన్ని తర్విగతన, గుడి, బడి అభివృద్ధి, ఎస్‌సికమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతుందన్నారు.అనంతరం అనంతసాగర్‌లో జరిగిన ప్రచారంలో అనంతసాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రామంచ వెన్నెల ను భారీ మెజారిటీతో గెలిపిస్తే గ్రామానికి మరొక 50 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే జయగిరిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పల్లె దయాకర్ ను భారీ మెజారిటీతో గెలిపితే గ్రామానికి మరొక 30 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తానన్నారు.

**సీతంపేట గ్రామ సమస్యలను అన్నింటినీ త్వరితగతన పరిష్కరిస్తా..**

సీతంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తోకల వసంత లక్ష్మ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపితే గ్రామానికి మరొక 50 ఇందిరమ్మ ఇళ్ల మం జూరు చేస్తామని, చెప్పారు. గ్రామానికి సుమారు 2 కోట్ల రూపాయలతో ప్రధాన రహదారి మంజూరు చేయించానని, త్వరలోనే పనులు పూర్తవుతాయని అలాగే గ్రామ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని చెప్పారు. దయచేసి ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తోకల వసంత లక్ష్మి రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఎఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డుల అభ్యర్థులు, స్థానిక నాయకులు, మండల, గ్రామ స్థాయికార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## అటవీ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**అటవీ గ్రామాల అభివృద్ధి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని, గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే సర్పంచులుగా ఎన్నుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. మండలంలోని నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, దూదేకులపల్లి గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈనెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని సత్యనారాయణ రావు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 'నేడు' నాలుగు మండలాల్లో ఎన్నికలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం రేగొండ, కొత్తపల్లి గోరి మండలాలలోని జిల్లా పరిషత్ పాఠశాలలలో సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసిప్షన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రేగొండ, గణపురం, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి మండలాల్లోని 55701 మంది పురుషులు, 58304 మంది మహిళలు, ఇతరులు 2 మొత్తం 114007 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, మధ్యాహ్నం 1 గంట వరకు పూర్తి చేసి, 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభించాలని సూచించారు. లెక్కింపు. ఎంపిఒ, ఒపిఒలతో ముకాముఖీ అయిన కలెక్టర్ పోలింగ్ మెటీరియల్ పరిశీలించారు. పోలింగ్ సామాగ్రి తరలింపును రూటు అధికారులు పర్యవేక్షణతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండాలని తెలిపారు. మొదటి విడత ఎన్నికలు నిర్వహణలో 35 మంది సూక్ష్మ పరిశీలకులు, 38 కేంద్రాల్లో వెబ్ కాస్టిం గ్, 20 క్రిటికల్, సెన్సిటివ్ కేంద్రాలలో పటిష్టమైన బందోబస్తు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల ప్రత్యేక అధికారి సునీల్, ఎంపిడిఒవెంకటేశ్వర్లు, తహసిల్దార్ శ్వేత, కొత్తపల్లిగోరి తహసిల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపిడిఒ రాంప్రసాద్ ఎంఇఒ రాజు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయం లేకనే పోటాపోటీ



**ప్రజాపక్షం/ చెన్నారావుపేట:** సమన్వయం లేకనే కాంగ్రెస్‌లో అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు వేశారని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కొంతమంది పార్టీ వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ కేటాయించిన అభ్యర్థులను దగ్గర ఉండి గెలిపించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి రాధారపు నాగలక్ష్మి ప్రతాప్ రెడ్డి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన్న రమేష్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి వీరారెడ్డి, మంద యాకయ్య గౌడ్, తప్పెట్ల రమేష్ తో పాటు నాయకులు పాల్గొన్నారు.


## ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్ :** పంచాయితీ మొదటి విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ మండలాల్లో జరిగే మొదట విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 2వేలకు పైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డిసిపిలతో పాటు ఐదుగురు అదనపు డిసిపిలు, 13మంది ఎసిపిలు, 28మంది ఇన్స్‌పెక్టర్లు,122 మంది ఎస్ఐలు, 412 మంది ఎఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు 1154,హోంగార్డ్స్ 285 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నిక వేళ అదనపు డిసిపి స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఎసిపి స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా వుంటారని. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్ఐ/ఎఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని,ఓటర్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.గ్రామాల్లోను ముమ్మరంగా తనిఖీ నిర్వహించడం ద్వారా నేటి వరకు 6లక్షల04వేల రూపాయలతో పాటు,120 కేసుల్లో సుమారు 10లక్షల69 వేల రూపాయల విలువ గల మద్యం సీసాలు, 46కేసుల్లో ఒక లక్ష 19వేల రూపాయల విలువగల 322 లీటర్ల గుడుంబాతో పాటు లక్ష రూపాయల విలువ గంజాయిని పోలీసులు వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా లెసెన్స్ కలిగి వున్న మొత్తం 156 తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గతంలో ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు రౌడీ షీటర్లు, అనుమానస్పద వ్యక్తులకు సంబంధించి 384 కేసుల్లో మొత్తం 2,205 మందిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లుగా సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** అన్ని వర్గాల సం క్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పా లకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భం గా బుధవారం మండలంలోని ఈదులకుం ట తండా, భోజ్య తండా, పెద్దమంగ్య తండా, టీక్య తండా, అమ్మాపురం, ఖానాపురం, గోపాలగిరి, చీకటాయపాలెం, మాటేడు, కిష్టాపురం, సోమారపు కు ంట తండా, కంఠాయపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను దేశంలో ఎక్కడా లే ని విధంగా అమలు చేస్తున్నారని అన్నారు. తాను ఎ మ్మెల్యేగా గెలిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రా మాల్లో మరింత అభివృద్ధి జరగాలంటే అధికార పా ర్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు, గ్రా మాల ఇన్‌చార్జ్‌లు చాపల బాపురెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, పెదగాని సోమయ్య, మంగళపల్లి రామచంద్రయ్య, మాలోతు సునీత రాజేందర్, వెంకన్న, శ్రీనివాస్, వెంకటాచారి, కుషాల్, హేమంత్, మనోహర్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

## వంద పంచాయతీలు.. లక్షా 72వేల మంది ఓటర్లు

**ప్రజాపక్షం/జనగామ :**గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ మరికొద్ది గడియల్లోనే జరగనుంది. మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు పోలింగ్ సామాగ్రి చేరింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. ఆ తరువాత ఓట్ల లెక్కింపు జరిగి గెలిచిన వ్యక్తుల్ని ప్రకటించనున్నారు. కాగా మొదటి విడత జనగామ జిల్లాలోని 100 పంచాయతీలు, 784 వార్డులకు పోలింగ్ జరనుండగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షా 72వేల 506 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

జనగామ జిల్లాలో మొదటి విడత స్టేషన్‌ఘనపూర్ లోని చి ల్పూర్, జఫర్‌గడ్, స్టేషన్‌ఘనపూర్ రఘునాథపల్లి, లింగాలఘనపురంలోని 11 0 పంచాయతీలకు ఎన్నికలు జరగాలి. అయితే 10 పంచాయతీలు, 1024 వార్డులకు పోలింగ్ జరగాలి. 10 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 228 వా ర్డులు సైతం ఏకగ్రీవం అయ్యాయి. వంద పంచాయతీలు పరిధిలో 85 వేల 180 మం ది పురుష, 87వేల 322 మంది మహిళ ఓట ర్లు ఉన్నారు.

**వంద పంచాయతీలకు ఎన్నికలు**

మొదటి విడతలో 110 పంచాయతీలకు ఎన్నికలు జరగాలి. అయితే మండలాల వారిగా పరిశీలిస్తే చిల్పూర్‌లో 17 పంచాయతీలు ఉండగా 3 ఏకగ్రీవం అయ్యాయి. దీనితో 14 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 15 పంచాయతీలు ఉండగా ఒకటి ఏకగ్రీవం అయ్యింది.

మిగతా 14 పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. లింగాలఘనపూర్‌లో 21 పంచాయతీలు ఉండగా వాటన్నింటికి ఎన్నికలు జరగనున్నాయి. రఘునాథపల్లి పరిధిలో 36 పంచాయతీలు ఉండగా 5 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 31 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. జఫర్‌గడ్ పరిధిలో 21 పంచాయతీలు ఉండగా ఒకటి ఏకగ్రీవం అయ్యింది. మిగతా 20 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

**1024 పోలింగ్ స్టేషన్లు..2వేల 675 మంది సిబ్బంది**

ఎన్నికలు జరిగే వంద పంచాయతీల్లో 1024 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వాహణ కోసం రెండు వేల 675 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. 1131 మంది పిఒలు, 1544 మంది ఒపిఒలను ఏర్పాటు చేశారు. వాటి కోసం రూట్లు ఏర్పాటు చేయడంతో పాటు 72 బస్సులు ఏర్పాటు చేశారు.

# ఊరును ఆగం చేసుకోవద్దు.... ఓటుతో బాగుచేసుకోవాలి

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** గ్రామ అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, గ్రామ అభివృద్ధి కోసం పని చేసే వారికి ఓటు వేసి గెలిపించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ఐనవోలు ధర్మసాగర్ మండలాలలోని గర్నేపల్లి, వెంకటాపూర్, మల్లక్ పల్లి, ధర్మాపురం గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యంతో పేద ప్రజల కడుపు నింపుతుందని తెలిపారు. గత ప్రభుత్వ 10ఏళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చిందని అన్నారు. మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఇందిరమ్మ చీరలు అందిస్తుందని తెలిపారు.మాయ మాటలు నమ్మి ఓటు వేస్తే గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ ఎన్నికలు గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఎన్నికలని, మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని కావున పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఐనవోలు మండలంలోని గర్నేపల్లి, వెంకటాపూర్ గ్రామాలను అభివృద్ధి చేసే బాధ్యత నాదని అందుకు మీరు చేయాల్సింది కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గబ్బేట రాజును భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. గర్నేపల్లి గ్రామంలో 25లక్షల సిసి రోడ్లు మంజూరు చేస్తానని అన్నారు. వెంకటాపూర్ గ్రామానికి రెండో విడతలో 50ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మారపల్లి సురేష్ ను గెలిపిస్తే 3నెలల్లో కోటి రూపాయల అభివృద్ధి పనులకు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. ధర్మసాగర్ మండలంలోని మల్లక్ పల్లి, ధర్మాపురం గ్రామాలకు కాలువ పనులు పూర్తి చేసి గోదావరి జలాలతో చెరువులు నింపి సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఎవరి మాయ మాటలు నమ్మవద్దని వాళ్ళ మాటలు నమ్మి ఊరుని ఆగం చేసుకోవద్దని, పని చేసే వారికీ ఓటు వేసి ఊరును బాగుచేసుకోవాలని సూచించారు. మల్లక్ పల్లి లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గిన్నారపు లత ను గెలిపిస్తే రెండో విడతలో 40 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని, గ్రామానికి కావాల్సిన సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్లు మంజూరు చేస్తానని, అలాగే ధర్మపురంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మునిగాల మమతను గెలిపిస్తే 30ఇందిరమ్మ ఇల్లు, 30లక్షల సిసి రోడ్లకు మంజూరు ఇస్తానని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు అభ్యర్థులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## చర్ల,దుమ్ముగూడెం మండలాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/చర్ల/దుమ్ముగూడెం :** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి బుధవారం చర్ల, దుమ్ముగూడెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. చర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రామీణ ప్రాంతాలోల మహిళా ఉత్పత్తుల యూనిట్లు పనితీరుపై సమగ్ర సమీక్ష చేస్తూ పలు కీలక సూచనలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం రోగులతో మాట్లాడి కష్ట సుఖాలు తెలుసుకున్నారు. గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న సేవల నాణ్యతను పరిశీలించి అభినందించారు. పంచాయితీ ఎన్నికల పరికరాల సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సాయి వర్ధన్, డా. కాంత్, డా. రవికుమార్, డా. శ్రావణి, ఎంపిడిఓతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు : డిసిపి ప్రసాదరావు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు రఘునాథపాలెం మండలం గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ బందోబస్తు, సిబ్బంది విధి విధానాలపై బుధవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికల బందోబస్తును విజయవంతం చేయాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన తగు చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (ఏఆర్) కుమారస్వామి, టౌన్ ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్ పాల్గొన్నారు.

## ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చునని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లి చూపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఫోటోతో కూడిన పోస్టాఫీస్, బ్యాంక్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఫోటోతో కూడిన ఎస్సి, ఎస్టి, బిసి కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంఎల్‌ఏ, ఎంఎల్‌సిలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రేషన్‌కార్డు, ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడి కార్డు, ఆర్టిఐ ద్వారా జారీ చేయబడిన ఎన్‌పిఆర్ స్మార్ట్ కార్డ్, ఎంపిలకు జారీ చేయబడిన గుర్తింపు కార్డు మొదలగు వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

### డిఎస్‌పి రవీందర్ రెడ్డి ఆదేశాలు



**ప్రజాపక్షం/మణుగూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మణుగూరు డీఎస్పీ వి. రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా, ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎటువంటి అవాంఛనీయం జరగకుండా కట్టుదిట్టంగా భద్రతను చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ స్టేషన్ హద్దులను దాటి వెళ్లవద్దని, ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని రాజకీయ నాయకులు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించిన సందర్భంలో చట్టవిరుద్ధ చర్యలు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు

**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామపంచాయతీ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, మండలాభివృద్ధి అధికారి నారాయణ తెలిపారు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో 60 కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశిల్దార్, ఎంపిడిఓ కోరారు.

## ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల వ్యాప్తంగా జరుగుతున్న పంచాయితీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు మండల ఎన్నికల విభాగం అధికారి గద్దల రవీంద్ర ప్రసాద్ తెలిపారు. అశ్వాపురం మండల వ్యాప్తంగా 214 పోలింగ్ బూతులు ఉండగా 8 బూతులు ఏకగ్రీవం అవడంతో 206 బూతులలో ఎన్నికలు జరుగుతున్నాయని, 16,069 మంది పురుషులు 17,278 మంది స్త్రీలు మొత్తంగా 33, 347 మంది ఓట్లు ఉన్నాయన్నారు. 208 మంది పిఓ, ఓపిఓలు విధులు నిర్వహిస్తున్నారని, మండలాన్ని మూడు జోన్లుగా కళ్యాణపురం నుండి అమెర్ద వరకు ఒక జోన్, చింతిర్యాల నుండి రామచంద్రపురం వరకు ఒక జోన్‌గా, వెంకటాపురం నుండి మనుబోతులపాడు వారికి ఒక జోనుగా ఏ ర్పాటు చేశామని, 11 రూట్స్‌గా చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణలో 200లోపు ఓటర్లకు ఒక పిఓ, ఒక ఓపిఓ, ఒక ఆర్వో ఉంటారని, 200 దాటితే ఇద్దరు ఓపిఓలు, 400 దాటితే ముగ్గురు ఓపివోలు ఉం టారని అన్నారు. తహసీల్దార్ మణిధర్ ఉన్నారని, ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. అన్ని పంచాయితీలలో ఓటు వేసే సమయంలో ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు చేసుకోవచ్చని ఒంటి సమయం మించితే అనుమతి లేదని గం 3గంట నుండి ఫలితాలను వెల్లడిస్తామని అన్నారు.

## 172 గ్రామ పంచాయతీలు..1415 వార్డులు ఎన్నికలు

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత పోలింగ్ నేడు గురువారం జరగనుంది. తొలి విడతలో ఏడు మండలాల పరిధిలో 172 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. కొణిజర్ల, వైరా, రఘునాథపాలెం, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, చింతకాని మండలాల పరిధిలోని 172 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, 1415 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో 2, 41,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సిసి కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు బుధవారం తరలి వెళ్లారు. రాత్రి సిబ్బంది అక్కడే బస చేయనున్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించేలా ఏర్పాట్లు చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, త్రాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించారు. **పోలింగ్‌కు సర్వం సిద్ధం :** కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మొదటి విడత ఎన్నికల సందర్భంగా రఘునాథపాలెం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ కేంద్రాల్లో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్‌లో వినియోగించే ఎన్నికల సామగ్రిని పరిశీలించి పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్ల లెక్కింపు, సర్పంచ్ నియమాక పత్రాలు ఇవ్వడం, ఉప సర్పంచ్ ఎన్నిక తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలో ఏడు మండలాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మ ధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు నిర్వహించి ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తారని తెలిపారు. సమస్యాత్మక పో లింగ్ స్టేషన్ లోకేషన్స్ గుర్తించి క్రిటికల్ పోలింగ్ కేం ద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, సెన్సిటీవ్ కేం ద్రా ల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపా రు. ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు, భయాందోళనలు లే కుం డా తమ ప్రజాస్వామ్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఓటు వి లువైందని ఓటర్లంతా నిర్ణీత సమయానికి పోలింగ్ కేం ద్రాలకు వచ్చి స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. మూడు విడతల్లో పూర్తయ్యే వర కు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఏకగ్రీవ పంచాయతీల్లో సైతం కోడ్ అమల్లో ఉం టుందని తెలిపారు.ఎన్నికలు విజయవంతంగా పూర్తి చే యాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, త్రాగునీ రు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెంలో గ్రామపంచాయతీ ఎన్నికలు

### 32 సర్పంచ్, 268 వార్డులకు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో పంచాయతీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరగనుండగా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఐదు సర్పంచ్ స్థానాలతో పాటు 40 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రఘునాథపాలెంలో సర్పంచ్ స్థానంతో పాటు 12 వార్డులకు గాను 10 వార్డులు ఏకగ్రీవం కాగా రెండు వార్డు ల్లో పోలింగ్ జరగ నుంది. 33 గ్రామ పంచాయతీల పరిధిలో 32 సర్పంచ్ స్థానాలకు, 268 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా 33,163 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో నాలుగు జోన్లు పరిధిలో 11 రూట్లను ఏర్పాటు చేసి 11 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. మొత్తం 268 పోలింగ్ బూత్‌లకు గాను 597 మంది పోలింగ్ అధికారులను, సిబ్బందిని నియమించారు. 120 మంది రిజర్వుడ్ పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మొత్తం 717 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లారు. పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన మౌలిక వసతులతో పాటు సిబ్బందికి రాత్రి బసకు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో పోలీస్ బం దోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుం డా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారులతో పాటు ఎంపిడివో అశోక్‌కుమార్, ఎ ంపివో శ్రీనివాస రెడ్డి, రఘునాథపాలెం సిఐ ఉ స్మాన్ షరీఫ్‌లు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు.



## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించడానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఆవరణలో సాధారణ గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు సంబంధించి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ వేరువేరుగా సందర్శించి గ్రామ పంచాయితీ ఎన్నికల వీధులలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చి వారి వారి పోలింగ్ స్టేషన్‌లకు పంపి 18 గ్రామ పంచాయితీలలో ఐదు గ్రామ పంచాయితీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 13 గ్రామ పంచాయితీలకు గాను 48మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేసి బరిలో ఉన్నారని, అలాగే 182 వార్డులకు 57 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా 125 వార్డులకు 308 మంది వార్డు సభ్యులగా బిరలో నిలుచున్నారని అన్నారు. అధికారుల నుండి మొదలుకొని, పిఓ, ఓపిఓలు, కెఆర్‌కె ప్రసాద్, ఇన్‌చార్జ్ సిబ్బంది, పాల్గొన్నారు.

## రేషన్ షాపులను తనిఖీ చేసిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రేషన్ బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఖమ్మం నగరంలోని రేషన్ షాపులను విస్తృతంగా తనిఖీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డి డిఎస్‌పి అంజయ్య నేతృత్వంలో నాలుగు బృందాలు మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఖమ్మం నగరంలో 40 రేషన్ షాపులను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఖమ్మం నగరంలోని 91వ షాపును తనిఖీ చేసేందుకు వెళ్లగా అక్కడ షాపు తెరిచి ఉండక పోవడంతో డీలర్ వెంకటేశ్వర్లుకు పలుమార్లు అధికారులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆ షాపుకు సీల్ వేశారు. డీలర్ వచ్చే వరకు షాపు సీల్ తీయవద్దని షాపులో అదనంగా బియ్యం ఉంటే సీజ్ చేసి డీలర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సివిల్ సప్లయ్ డిటిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి అంజయ్య ఆదేశించారు. అట్టి డీలర్ కార్డుదారుల వద్ద బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట వ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పలు ఆరోపణలు కూడా వినవస్తున్నాయన్నారు. అదేవిధంగా రేషన్ షాపును విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేయగా స్టాక్ రికార్డు మేరకు లేకుండా బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. సదరు షాపు డీలర్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు గాను అమ్యామ్యాలు ముట్టజెప్పినట్లు, ఇందుకు స్థానిక సివిల్ సప్లయ్ అధికారులు కూడా సహకరించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ డిటిలు మెచ్చు వెంకటేశ్వర్లు, విజయ్‌బాబు, నాగలక్ష్మి , టాస్క్‌ఫోర్స్ ఏఎస్‌ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## పోలింగ్‌కు భారీ బందోబస్తు



**ప్రజాపక్షం/చింతకాని:** మండలంలో ఇటీవల జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషినల్ సీపీ రామానుజన్ పేర్కొన్నారు. చింతకానిలో ఆయన పోలీస్ సిబ్బందితో బుధవారం మాట్లాడారు. ఒడలంలో 416 మంది పో లిస్ సిబ్బందిని నియమించామన్నారు. వీరిలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు సిఐలు, 13 మంది ఎస్సైలతో పాటు ప్రత్యేక పోలీస్ బృందం ఉందన్నారు. అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు.ఏసీపీ సాంబరాజు, పలువురు సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# తొలి విడతకు సర్వం సిద్ధం

- నేడే పోలింగ్, ఫలితాలు
- కాంగ్రెస్‌కు తప్పని రెబల్స్ బెడద
- ఎన్నికల సామాగ్రి సరఫరా
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తొలివిడత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నేడు పోలింగ్ జరగనుంది. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో నేడు ఉదయం 7 గం. నుండి 1 గం. వరకు ఓటింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గం.ల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఇందులో భాగంగా ఎన్నికల సామాగ్రిని అధికారులు సిబ్బందికి పంపిణీ చేశారు. జిల్లాలోని 159 గ్రామ పంచాయితీలకు చెందిన 1436 వార్డుల్లో ప్రజలు తమతమ ఓట్లను వినియోగించుకోనున్నారు. 1428 పలోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో 1713 మంది అధికారులు, 2295 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. చర్ల మండల కేంద్రంలో కలెక్టర్, సబ్ కలెక్టర్, జితేష్ వి పాటిల్, మ్రి నాల్ శ్రేష్ట,భద్రాచలం మండల కేంద్రంలో ఐటిడిఏ పిఓ రాహుల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

**కాంగ్రెస్‌లో రెబల్స్ బెడద :** అధికార కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద పిట్టి పీడిస్తోంది. ఈ తతంగం ఆ పార్టీ బలపరిచే అభ్యర్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం, ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీకి అనుకూల వాతావరణ ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నామినేషన్ల సమర్పణ సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పులువురు పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పించారు. ఒకే పార్టీకి చెందిన వారు ఒకే వార్డులో నామినేషన్లు వేయదంతో తీవ్ర తలనొప్పిగా మారింది. ఉప సంహరణ క్రమంలో బుజ్జగింపుల అనంతరం పోటీ నుండి తప్పుకున్నప్పటికీ లోలోన మాత్రమ కసిగానే ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలోక్రాస్ ఓటింగ్ జరిగితే అది బిఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులకు కలిసిరానుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సిపిఐ, బిఆర్‌ఎస్‌తో సిపిఎం, గిరిజన సంఘాలు, బిజేపితో టిడిపి, జనసేన కలిసి నడుస్తూ ఆయా అభ్యర్థులను బలపరుస్తున్నాయి.

**తొలిసారి ఎన్నికలు :** భద్రాచలం, సారపాక తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీలకు స్వరాష్ట్రంలో తొలిసారి స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. 2013 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి సారిగా ఎన్నికలు జరిగాయి. భద్రాచలం, సారపాక గ్రామపంచాయితీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా ప్రక్కపు పెట్టాయి. గిరిజన సంఘాలు ఈ రెంటినీ గ్రామ పంచాయితీలుగానే కొనసాగించాలని న్యాయపోరాటం చేయడంతో ఈ సారి ఎన్నికలు జరుగుతున్నాయి. మరో ప్రక్క గత ప్రభుత్వం భద్రాచలం గ్రామ పంచాయితీని మూడు ముక్కలుగా చేసేందుకు ప్రయత్నం చేసింది. ఆ తర్వాత అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతం మాదిరిగానే ఏక పంచాయితీగా కొనసాగించేందుకు అంగీకారం తెలిపింది.తొలినాళ్ల నుండి భద్రాచలం గ్రామపంచాయితీ ఎన్నికల వ్యవహారంలో అనేక చిక్కులు ఎదురవుతూనే ఉన్నాయి. 1982లో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. 1987లో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తడంతో ఆగిపోయాయి. 2001లో టౌన్‌షిప్‌గా ప్రకటించడంతో ఇఓ పాలనలో సాగింది. 2005లో సారి గ్రహణం ఎదురైంది.

**పెద్ద, చిన్న :** భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాలోని భద్రాచలం గ్రామపంచాయితీ జిల్లాలోనే అతి పెద్ద పంచాయితీగా ఉంది. ఈ పంచాయితీలో 40701 ఓట్లు ఉన్నా యి. అదే విధంగా ఆళ్లపల్లి మండలం అడవి రామవరం జిల్లాలోనే అతి చిన్న పంచాయితీగా ఉంది. ఇక్కడ కేవలం 85 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో గుండాల మండలం దొంగతోగు గ్రామపంచాయితీ 88 మంది ఓటర్లతో ఉంది.


**ఎన్నికల సామాగ్రి సరఫరా :** 1713 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి తొలివిడత ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. వివిధ వాహనాల్లో 8 మండలాల్లో గల ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది బుధవారమే తీసుకెళ్లారు. ఉదయం 7 గం. నుండి ఓట్ల ప్రక్రియ మొదలు కానుంది. ఎన్నికల్లో భాగంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు చేపట్టారు.

**గెలుపుపై ఎవరి ధీమా వారిదే :** స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్‌ఎస్, బిజేపి మిత్రపక్షాలు గెలుపుపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా స్థానిక ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న చిన్నచిన్న బేదాభిప్రాయాల కారణంగా ఓట్లు చీలుతాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిని బిఆర్‌ఎస్ అవకాశంగా వాడుకుంటోంది. ఇక బిజేపి మిత్రపక్షాలు అభివృద్ధి ఎజెండాతో ముందుకు సాగుతోంది. దీంతో గెలుపుపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు.





# రీల్




## 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ షురూ

తెలుగు చిత్ర పరిశ్రమలో తమదైన ముద్ర వేసిన విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో రానున్న చిత్రం కోసం సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కుటుంబ కథా చిత్రాల కథానాయకుడిగా వెంకటేష్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే, వక్కలింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. అందుకే వీరి కలయిక, ప్రకటనతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. వెంకటేష్ సినీ ప్రయాణంలో 77వ చిత్రంగా రూపొందుతోన్న ఈ సినిమాకి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ లోగోని గమనిస్తే.. విశాలమైన ఈ కుటుంబ కథా చిత్రంలో ఉత్కంఠ రేకెత్తించే అంశాలు కూడా ఉండబోయని అర్థమవుతోంది. ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 ఫస్ట్ లుక్ ఆకట్టుకుంటోంది. వెంకటేష్ ఫ్యామిలీ మ్యాన్ లుక్‌లో క్లాస్‌గా కనిపిస్తున్నారు. హృదయాన్ని తాకే భావోద్వేగాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రాబోతోందనే సంకేతాన్ని ఫస్ట్ లుక్ ఇస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో చిత్రీకరణ మొదలైంది. వెంకటేష్‌త్రివిక్రమ్ కలయిక మరోసారి ప్రేక్షకులందరికీ చిరస్మరణీయమైన అనుభూతిని అందించడానికి సిద్ధమవుతోంది.



## సస్పెన్స్ థ్రిల్లర్‌గా మిస్టీరియస్

మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్ పై జయ్ వల్లందాస్ నిర్మిస్తున్న మిస్టీరియస్ ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ముందుగా అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువ అయినా నిర్మాత చాలా పట్టుదలతో తీశారు. సినిమా చేస్తున్న టైంలో నాకు ఏ లాంటి ఇబ్బంది లేకుండా అన్నీ ఏర్పాట్లు చేశారు. అందుకే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చింది. ఒక కొత్త స్క్రీన్ ప్లేతో పూర్తిగా సస్పెన్స్‌తో వున్న ఈ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకుడిని ఆద్యంతం ఒక కొత్త అనుభూతికి లోను చేస్తుందని చెప్పారు. నిర్మాత జయ్ వల్లందాస్ మాట్లాడుతూ.. మా డైరెక్టర్ మహి తో కలిసి మూవీ చేస్తామని అనుకోలేదు. కానీ, మిస్టీరియస్ అది జరిగింది. ఈ మూవీ స్టోరీ మహి చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది. అందుకే కష్టపడి చేశాం. మా ఈవెంట్‌కు బ్రహ్మానందం గెస్ట్ రావడం హ్యాపీగా ఉంది. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని డిసెంబర్ 12వ తేదీ రోజున ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్స్‌లో విడుదల చేయాలనీ అందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తమ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు.

## రేపే అఖండ-2



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన సినిమా అఖండ-2: ది తాండవం. తాజాగా ఏర్పడిన ఆర్థిక సమస్య నుంచి బయటపడిన ఈ సినిమా ఎట్టకేలకు విడుదల అవుతోంది. అన్ని సమస్యలను పరిష్కరించుకున్న ఈ చిత్రం ఈనెల 12న విడుదల చేస్తున్నామని నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట తెలిపారు. ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పిస్తుంది. బాలకృష్ణబోయపాటి శ్రీను కాంబో సింహా, లెజెండ్, అఖండతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను అందించింది. వారి నాల్గవ కొలాబరేషన్ వస్తున్న సినిమా కావడం, ముఖ్యంగా బాలకృష్ణ వరుసగా నాలుగు హిట్లను సాధించడంతో అఖండ–2పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

## 25న 'ఈషా' రిలీజ్



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్ మెంట్స్, బన్నీవాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీవాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని 25న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేవిఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో. ఈషా మూవీ ట్రైలర్ సక్సెస్ మీట్‌ను బుధవారం హైదరాబాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఈషా' చిత్రం కేవలం హార్రర్ మాత్రమే కాకుండా థ్రిల్లర్ మూవీ. సినిమా చూసి బయటకు వచ్చిన తరువాత అందరూ కచ్చితంగా భయపడతారన్నారు.

## 'కర్మస్థలం' పోస్టర్ విడుదల




సామ్రాద్ని ఫిలమ్స్, రాయ్ ఫిలమ్స్ బ్యానర్ల మీద హర్ష వర్ధన్ షిండే నిర్మాతగా బిగ్ బాస్ దివి ముఖ్య పాత్రలో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. పాన్ ఇండియా వైడ్గా రూపొందిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దివిని ఓ యోధురాలిగా చూపిస్తూ వదిలిన ఈ కొత్త పోస్టర్ అందర్ని ఆకట్టుకుంటోంది. 'కర్మస్థలం' అంటూ వదిలిన పోస్టర్‌లో దివి కదనరంగంలో దూసుకుపోతోన్నట్టుగా కనిపించడం, చుట్టూ అగ్ని జ్వాలలు, బ్యాక్ గ్రౌండ్‌లో యుద్ధం చేస్తున్న సైనికులు ఇలా ప్రతీ ఒక్క డీటైల్‌ను పోస్టర్లో అద్భుతంగా చూపించారు. ఈ చిత్రానికి విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ఆర్ట్ వర్క్ ప్రధాన బలాలుగా నిలుస్తాయని నిర్మాత చెబుతున్నారు.

## జనవరి 14న 'నారి నారి నడుమ మురారి'

శర్వానంద్ హీరోగా నటించిన'నారి నారి నడుమ మురారి'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. సామజవరగమనతో బ్లాక్ బస్టర్ చేసిన రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కుటుంబ కథా నేపథ్యంతో తెరకెక్కిస్తున్నారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. నారి నారి నడుమ మురారి ఈ సంక్రాంతికి జనవరి 14న విడుదల కానుంది. ప్రీమియర్ షో సమయం సాయంత్రం



5:49 గంటలకు ముహూర్తం నిర్ణయించినట్టు నిర్మాత తెలిపారు.. శర్వా గత సంక్రాంతి బ్లాక్‌బాస్టర్లు 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా' కూడా జనవరి 14న విడుదలయ్యాయి. సెలవుల సీజన్లో తీవ్రమైన పోటీ ఉన్నందున ఈ పండుగ సందర్భంగా రిలీజ్ కాస్త ఆలస్యంగా రావడం సినిమాకు బెనిఫిట్ కానుందని నిర్మాత భావిస్తున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, సినిమాటోగ్రఫీని జ్ఞాన శేఖర్ విఎస్, యువరాజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కథను భాను బోగవరపు రాశారు, నందు సావిరిగణ సంభాషణలు అందిస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఈ ప్రాజెక్టుకు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## ఇది ఛాలెంజింగ్ మూవీ - హీరో కార్తి

స్టార్ హీరో కార్తి నటిస్తు సినిమా 'అన్నగారు వస్తారు' ఈ నెల 12న వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. బుధవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోహీరోయిన్ కృతి శెట్టి మాట్లాడుతూ.. తమిళంలో నా డెబ్యూకు ఇంత కంటే మంచి మూవీ, ఇంతకంటే మంచి కోస్టార్ దొరకరేమో. అలాంటి స్పేస్‌ను నాకు కల్పించారు. అందుకు కార్తికి థ్యాంక్స్. ఆయనకు నా ఫ్యానిజం చూపిస్తుంటా. కార్తి తెలుగు హీరోనే అనే భావన తెలుగు ఆడియెన్స్‌లో ఉంది. తెలుగు ఆడియెన్స్ తమకు నచ్చిన హీరోను ప్రేమిస్తారు. ఈ చిత్రంలో ఒక ప్రపంచాన్ని క్రియేట్ చేశారు. హీరో కార్తి మాట్లాడుతూ నా ప్రతి సినిమా రిలీజ్ తర్వాత చిన్మయి నుంచి ఒక పేజ్ మెసేజ్ వస్తుంది. అది రాహుల్ రాసింది. చిన్మయి రాహుల్ మెసేజ్‌లు నాకు కొరియర్ లా పంపిస్తుంటుంది. వీళ్లంతా నా మీద చూపిస్తున్న ప్రేమకు చాలా థ్యాంక్స్. శైలేష్ నాతో హిట్ 3లో చిన్న కేమియా చేయించారు. అందులో నేను చెప్పిన ఒక్క డైలాగ్ ఎంతో పాపులర్ అయ్యింది. ఆ చిన్న సీన్‌కు చాలా బ్యాక్ స్టోరీ రాశారు శైలేష్. మా కాంబోలో వస్తున్న 'హిట్ 4' కోసం నేను వెయిట్ చేస్తున్నా. ఒక ఎన్టీఆర్, ఎంజీఆర్ ఉన్నారు. వాళ్లు సినిమాను రాజకీయాలను ప్రజా జీవితాలను మార్చేశారు. హీరో తెరపై ఏం చేసినా మనం యాక్సెప్ట్ చేస్తాం. తెలుగు దర్శకుల్లో ఇందరు అభిమానులు ఉన్నారనే విషయం నాకు ఇప్పుడే తెలిసింది. ఆయన 8 ఏళ్ల తర్వాత చేస్తున్న చిత్రమిది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా గురించి ఎగ్జైటెడ్‌గా వెయిట్ చేస్తున్నారు అని అన్నారు.



## '29' ఫస్ట్ లుక్ విడుదల



స్టోన్ బెంచ్ స్టూడియో, జీ స్క్వాడ్ కలయికలో రూపొందుతోన్న మూవీకి '29' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 29 సినిమాకు రత్నకుమార్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. రియలిజం, ఫీల్ గుడ్, ఎమోషన్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. మెయ్యాద మాన్, ఆడై, గులు గులు వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత గ్రిప్పింగ్ స్టోరీతో, హృదయాలను హత్తుకునే మానవ సంబంధాలను తెలియజేసేలా, ప్రేమ గొప్పదనాన్ని తెలియజేసేలా ప్రేమ కథా చిత్రంగా 29 రానుంది. విదు, ప్రీతి అస్రాని ప్రధాన పాత్రల్లో నటించారు. వారి మధ్య కెమిస్ట్రీ, పాత్రల్లోని గాఢత 29 సినిమాకు ప్రధానాకర్షణ కానున్నాయి. వైవిధ్యమైన సంగీతాన్ని అందించే సేన్ రోల్డన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటంతో మరోసారి డిఫరెంట్ మ్యూజిక్‌ను ఆస్వాదించవచ్చని ప్రేక్షకులు భావిస్తున్నారు. కార్తికేయన్ ఎస్, లోకేష్ కనకరాజ్ నిర్మిస్తోన్న సినిమా ఇది.

# హైదరాబాద్‌లో మరో మెగా స్పోర్ట్స్ ఈవెంట్

### నేటి నుంచి 45వ ఎన్‌టిపిసి సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ – 2025
### హెచ్‌పిఎస్‌లో 11–18, 2025 వరకు పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరం మరో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుంది. చారిత్రాత్మకమైన బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 45వ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్–2025 పోటీలు ప్రారంభం కానుంది. ఒలంపిక్స్ పతకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ వెన్నుదన్నుగా నిలుస్తుందని తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు ప్రధాన కార్యదర్శి పి.అరవింద్ కుమార్‌లు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1978లో జరిగిన తొలి సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ తరువాత, 48 సంవత్సరాల దీర్ఘ విరామం తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ పోటీ మళ్లీ హైదరాబాద్‌లో జరగడం మనందరికీ గర్వకారణమని ఈ సీనియర్ నేషనల్ ఛాంపియన్షిప్‌లో అన్నీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మొత్తం 43 యూనిట్లు, పాల్గొంటున్నాయని తెలిపారు. స్త్రీ, పురుషులు కలిపి 971మంది ఆర్చర్లు ఈ పోటీలో తమ ప్రతిభను ప్రదర్శింప బోతున్నారని వారు వివరించారు. 45వ సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో దేశం నలుమూలల నుండి చేరిన అసాధారణ ప్రతిభను ప్రదర్శింపబోతున్నారని వారు తెలిపారు. ఈ పోటీలు కేవలం ఒక ఛాంపియన్‌షిప్ మాత్రమే కాదు.. భారత ఆర్చరీ చరిత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా వారు అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా కొత్త ప్రతిభను వెలికితీయడం, గ్రామీణ గిరిజన ప్రాంతాల ఆర్చర్లను ముందుకు తేవడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, తెలంగాణ యువ ప్రతిభను జాతీయస్థాయికి తీసుకెళ్లడం, 2028 ఒలింపిక్స్ కోసం శక్తివంతమైన భారత జట్టును నిర్మించవచ్చని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అశ్విన్ రావ్, అభివృద్ధి కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య కాంపిటీషన్ డైరెక్టర్ పైయాబి. వార్ నోంగ్రమ్ జ్యూరీ సభ్యులు డాక్టర్ జోరీస్‌లు పాల్గొన్నారు.

# దీపావళికి యునెస్కో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన షెకావత్, ఇది భారతీయులకు ఇది భావోద్వేగ అంశమన్నారు. 'దీపావళి అనేది భారతదేశం అంతటా విభిన్న వ్యక్తులు, సమాజాలు ఏటా జరుపుకునే కాంతి పండుగ. ఇది సంవత్సరంలో చివరి పంటను కొత్త సంవత్సరం, కొత్త సీజన్ ప్రారంభాన్ని సూచిస్తుంది. చంద్రామాన క్యాలెండర్ ఆధారంగా ఇది అక్టోబర్ లేదా నవంబర్‌లో అమావాస్య వస్తుంది. ఇది చీకటిపై కాంతి, చెడుపై మంచి విజయాన్ని సూచించే ఆనందకరమైన సందర్భం. ఈ పండుగ సమయంలో ప్రజలు తమ ఇళ్లను, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసుకుని అందంగా అలంకరిస్తారు. ఇంకా ఇంటి ముందు దీపాలు, కొవ్వొత్తులను వెలిగించి బాణసంచా పేల్చుతారు. అనంతరం అందరి శ్రేయస్సు, కొత్త ప్రారంభాల కోసం ప్రార్థనలు చేస్తారు' అని యునెస్కో పేర్కొంది. మరోవైపు దీపావళికి యునెస్కో గుర్తింపు రావడం పట్ల సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర షేకావత్ ఆనందం వ్యక్తం చేశారు. భారతీయులకు దీపావళి ఎంతో ప్రత్యేకమైనదని చెప్పారు. భారతీయులకు ఇది భావోద్వేగ అంశమని, అనేక తరాలుగా దీనిని జరుపుకొంటున్నట్లు షేకావత్ తెలిపారు. కుండలు చేసే వారి నుంచి కళాకారులు వరకు అనేక మంది ఈ వారసత్వాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. యునెస్కో గుర్తింపు రావడం ఒక బాధ్యత అని, మనమందరం కచ్చితంగా ముందు తరాలకు అందించాలని పేర్కొన్నారు. దీపావళి అంటే రామరాజ్యానికి, సుపరిపాలనకు సంబంధించినదని పిల్లలకు తెలియాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎర్రకోట వద్ద యునెస్కో 20వ సదస్సు డిసెంబర్ 8 నుంచి 13 వరకు సమావేశాలు జరుగుతున్నాయి. కాగా ఈ ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ తొలిసారిగా భారత్‌లో జరుగుతోంది. యునెస్కో గుర్తింపు కోసం 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను కమిటీ పరిశీలిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు. ప్రస్తుతం భారత్‌లో 15 అంశాలు యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ప్రస్తుతం భారత్‌లో 15 అంశాలు యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. వీటిలో 2017లో కుంభమేళా, 2021లో కోల్‌కతా దుర్గా పూజ, 2023లో గుజరాత్‌లోని గర్బా నృత్యం, 2016లో యోగా, వేద పఠన సంప్రదాయం, 2008లో రామలీల ఇతిహాసం 'రామాయణం' సాంప్రదాయ ప్రదర్శన ఉన్నాయి. వాటిని రక్షించుకోవాల్సి ఉందని యునెస్కో ప్రతినిధులు తెలిపారు.

**లక్నో వంటకాలకు ప్రపంచం గుర్తింపు**

అంతకుముందు కొద్ది రోజుల క్రితమే రాజవంశీయ వంటశాలల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకు శతాబ్దాల చరిత్ర కలిగిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నో వంటకాల వారసత్వానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. లక్నోను యునెస్కో క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రానమీగా ప్రకటించింది. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండలో నిర్వహించి యునెస్కో 43వ సాధారణ సమావేశంలో అధికారికంగా ప్రకటించింది.

# న్యాయవాదులు కావలెను

### దరఖాస్తులను ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, అమరావతిలోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సర్క్యూట్ బెంచ్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్‌కు దక్షిణ మధ్య రైల్వేత తరపున ప్యానెల్స్ ఏర్పాటుకు ఆసక్తికలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో, అర్హత వివరాలను తెలియజేస్తూ ఎంపానెల్ చేయబడటానికి సిద్ధంగా ఉన్న న్యాయవాదుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశామన్నారు.. న్యాయవాదుల ప్రయోజనం కోసం సంబంధిత బార్ అసోసియేషన్ల నోటీసు బోర్డులలో ఈ నోటిఫికేషన్‌ను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయాలని బార్ అసోసియేషన్లకు సూచించడమైనదని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన నమూనా దరఖాస్తు మరియు వివరణాత్మక నోటిఫికేషన్ దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో కూడా అందుబాటులో ఉందని శ్రీధర్ తెలిపారు. ఆసక్తిగల న్యాయవాదులు తమ దరఖాస్తులను జనవరి 9 వరకు సికింద్రాబాద్, రైల్ నిలయంలోని 3వ అంతస్తులోనున్న డి.జి.ఎం లా కార్యాలయానికి అందజేయవచ్చు లేదా ra.catrct.scr@gmail.com కు మెయిల్ ద్వారా పంపవచ్చు నని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు.

# అంకెల గారడీలు (మొదటి పేజీ తరువాయి)

గ్రౌండ్ అయ్యాయి? ఎంతమంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి? అనే అంశంపైన శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్‌రావు సిఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. గ్లోబల్ సమ్మిట్‌లో గ్లోబల్ రిప్రెజెంటేటివ్స్ కరువయ్యారని, చివరకు ఎంబిఎ విద్యార్థులను, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలకు కోట్ వేసి వారిని కూర్చోబెట్టారని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ ఒక భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో లాగా ఉన్నదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకున్నదని, అందాల పోటీల్లాగే, గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అని ఎద్దేవా చేశారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదని, దానిని చేరుకునే మిషన్ కూడా లేదని హరీశ్‌రావు ఆరోపించారు. విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్‌లో కమిట్‌మెంట్ లేదని, ఆ డాక్యుమెంట్ కు శాంటిటీ లేదన్నారు. అక్షరాలు, అంకెలు, రంగు రంగుల పేజీలతో అర్థం లేకుండా అల్లిన అబద్ధాలు, అర్ధ సత్యాల 'విజన్ లెస్' డాక్యుమెంట్ అని అన్నారు. రెండేళ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికే సిఎం రేవంత్‌రెడ్డి చేసిన పిఆర్ స్టంట్ గ్లోబల్ సమ్మిట్ అని చెప్పారు. 18రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తరని చెప్పారని, మంత్రులు వెళ్లి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించారని, కనీసం ఒక్క ముఖ్యమంత్రి, 5వేల మంది విదేశీ ప్రతినిదులు కూడా రాలేదని, ఒక డి.కె శివకుమార్ తప్ప. చివరకు ఎఐసిసి నేతలు, కాంగ్రెస్ ఎంపిలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు అన్నారు. కెసిఆర్ పదేళ్ళ పాలన గురించి, తెలంగాణ అభివృద్ధి గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడే రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు.

# మత ఘర్షణలకు బిజెపి కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పరస్పర గౌరవంతో భిన్న వర్గాల వారు సామరస్యంగా తమ మత కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. కానీ హిందుత్వశక్తులు, బిజెపి ఈ ప్రశాంతతకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోంది' అని నాయకులు దుయ్యబట్టారు. తమిళనాడులో రాజకీయంగా లబ్ధి పొందే ఉద్దేశంతో బిజెపి నాయకులు మతసామరస్యానికి విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే పావులు కదుపుతూ ఈ ప్రాంతాన్ని దక్షిణాది అయోధ్యగా నామకరణం చేశారు. బయట వ్యక్తులను తీసుకొచ్చి దీపోత్సవం వేళ గొడవలకు యత్నించారు. సామరస్యానికి భంగం కలిగించి ఘర్షణలను రెచ్చగొట్టేందుకు సామాజిక మాధ్యమాన్ని అస్త్రంగా మల్చుకున్నారు. ఇటీవల మద్రాసు హైకోర్టు మధురై బెంచ్ సంబంధిత పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు కూడా ఇందుకు ఆజ్యం పోసిన పని చేసింది. గత తీర్పులను, చరిత్రను, ప్రార్థనా స్థలాల చట్టాన్ని తోసిపుచ్చుతూ సికందర్ బాదుషా దర్గా సమీపంలో బ్రిటిష్ కాలం నాటి స్థంభంపై కార్తిగై దీపం వెలిగించేందుకు అనుమతి ఇస్తూ తీర్పు వెలువడింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ యంత్రాంగం అభ్యంతరాలను తోసిపుచ్చుతూ మతశక్తులు రెచ్చిపోయేందుకు ఏకసభ్య ధర్మాసనం అవకాశం కల్పించింది. దీపం వెలిగించేందుకు పిటిషనర్‌కు సీఐఎస్‌ఎఫ్ భద్రతను సైతం కల్పించాలని పేర్కొంది. ఈ పరిస్థితిపై వామపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచేదిగా... శాంతి భద్రతల వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని కాదనేదిగా తీర్పు వచ్చిందని వ్యాఖ్యానించాయి. మత అల్లర్లు సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టేలా బహులత్వ సంప్రదాయాలకు కట్టుబడుతూ, మత విద్వేష రాజకీయాలను తిరస్కరించిన తమిళనాడు, మధురై ప్రజల ఐక్యతను ప్రశంసించాయి. ఈ వ్యవహారాన్ని డిఎంకె ప్రభుత్వం తీరును మెచ్చుకున్నాయి. మతశక్తులకు మద్దతు ప్రకటించిన ఎఐఎడిఎంకే వంటి పార్టీలను ఆక్షేపించాయి. మధురై ఎంపి ఎస్.వెంకటేశ్వన్‌ను చంపేస్తామంటూ హిందూత్వ సంఘాలు బెదిరించడాన్ని వామపక్షాలు ఖండించాయి.

# ఒప్పందం ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

చొచ్చుకుపోతున్నారు. ఇటీవలి రోజుల్లో తిరుగుబాటుదారుల కాల్పుల్లో 74మంది పౌరులు మరణించారు. మరో 83మంది గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రులలో చేర్చారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. తిరుగుబాటు దారులు ఈ ప్రాంతాన్ని ఎంతో వ్యూహాత్మకమైనదిగా భావిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో తూర్పు కాంగోలో రెండు కీలక ప్రాంతాలను వారు స్వాధీనం చేసుకున్నారు. దీంతో యుద్ధం చేయిదాటిపోతుందని భావించారు. ట్రంప్ జోక్యం చేసుకుని ఒప్పందం ద్వారా దాడులకు విరామం ఇవ్వగలిగారుగానీ కీలక సమస్యను పరిష్కరించలేకపోయారు. తూర్పు కాంగో ప్రాంతంలో అత్యంత విలువైన, ప్రపంచంలోనే అరుదైన ఖనిజవనరులు, మూలకాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో జోక్యం ద్వారా ప్రయోజనం పొందాలని ఒకవైపు అమెరికా ఆశిస్తున్నది. తూర్పు కాంగోను స్వాధీనం చేసుకునేందుకు ఎం 23 తిరుగుబాటుదారులకు ఆయుధాలు ఇచ్చి సరిహద్దుదేశం రువాండా ఆజ్యం పోస్తున్నది. ఎం–23కి మద్దతుగా రువాండా సైన్యం 2022లో తూర్పు కాంగోలో ప్రవేశించింది. 'ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని పరిష్కరించేందుకు మేం ప్రయత్నం చేస్తున్నాం, వారు దీర్ఘకాలంగా పరస్పరం హత్యలు చేసుకుంటూ కాలం గడిపారు, కానీ ఇప్పుడు ఈ సమావేశంలో ఒకరిని ఒకరు (కాంగో–రువాండా ప్రభుత్వ ప్రతినిధులు) ఆలింగనం చేసుకుంటూ శాంతి యత్నాలు చేస్తున్నారు' అని ఈ ఏడాది జూన్ 27వ తేదీన ట్రంప్ అన్నారు. ఆనాడు కుదిరిన ఒప్పందం ప్రకారం కాంగో నుండి రువాండా సైన్యం వైదొలగింది. ఎం–23కి వారు ఆయుధాలు ఇచ్చి మద్దతు ఇవ్వకూడదు. కానీ ఈ ఒప్పందం అమలు జరుగడంలేదు. ఆ తర్వాత కూడా తిరుగుబాటు దారులు రెచ్చిపోయి దాడులు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ దళాలే సామాన్య ప్రజలపై బాంబుదాడులు చేస్తున్నాయని ఎం–23 తిరుగుబాటుదారులు ఆరోపిస్తున్నారు.

# విమానాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని వర్గాలు తెలిపాయి. మంగళవారం, ఎల్బర్స్ ఎయిర్‌లైన్స్ తిరిగి గాడిలోకి వచ్చిందని, ప్రభుత్వం ఇండిగో శీతాకాలపు విమాన షెడ్యూల్‌ను 10 శాతం లేదా రోజుకు ఆమోదించబడిన దాదాపు 2,200 విమానాలలో 220 విమానాలను తగ్గించినప్పటికీ దాని కార్యకలాపాలు'స్థిరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇండిగో మంగళవారం ఆరు మెట్రోల నుండి మాత్రమే 460 విమానాలను రద్దు చేసింది. లక్షలాది మంది కస్టమర్లు ఇప్పటికే పూర్తి వాపసులను అందుకున్నారని, కానీ వారి అనుమతి లేకుండా అకస్మాత్తుగా రద్దు చేయబడిన, భారీగా ఆలస్యం అయిన లేదా రీషెడ్యూల్ చేయబడిన విమానాలకు పరిహారం విషయంలో ఎలాంటి చర్య తీసుకోలేదని ఎల్బర్స్ అన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రయాణికుల చార్టర్ ప్రకారం, కొన్ని పరిస్థితులలో విమాన ఆలస్యం లేదా రద్దులకు విమానయాన సంస్థలు ప్రయాణికులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఉంటుంది. అలాగే, విమానయాన సంస్థలు ప్రయాణికులు అభ్యర్థించాల్సిన అవసరం లేకుండానే ఈ పరిహారాన్ని స్వయంగా అందించాలి. కఠినమైన భద్రతా నిబంధనలను ప్లాన్ చేయడంలో విఫలమైన తర్వాత, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలగడం, ఇతర దేశీయ విమానయాన సంస్థలపై విమాన ఛార్జీలను పెంచడం, భారతదేశం అంతటా విమానాశ్రయాలలో గందరగోళం సృష్టించిన తర్వాత ఇండిగో దేశవ్యాప్తంగా వేలాది విమానాలను రద్దు చేసింది.

డిసెంబర్ 1న ప్రారంభమైన పరిస్థితి తర్వాత, ప్రభుత్వం చివరకు జోక్యం చేసుకుని, డిజిసిఎతో కలిసి ఎల్బర్స్, రాహుల్ భాటియా నియంత్రణలో ఉన్న విమానయాన సంస్థకు అకౌంటబుల్ మేనేజర్ అయిన ఇండిగో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఇసిడ్రో ప్రోక్వెరాస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విమాన ఛార్జీలకు పరిమితిని కూడా విధించింది. కాగా, పీటర్ ఎల్బర్స్ గురువారం తన కార్యాలయంలో హాజరు కావాలని, ఇటీవలి కార్యాచరణ అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, నవీకరణలతో పాటు పూర్తి నివేదికను సమర్పించాలని డిజిసిఎ ఆదేశించింది. నియంత్రణ సంస్థ ఆదేశం ప్రకారం, విమాన పునరుద్ధరణ, పైలట్లు, సిబ్బంది నియామక ప్రణాళిక, పైలట్, క్యాబిన్ సిబ్బంది సంఖ్య నవీకరించబడిన స్థానం, రద్దు చేయబడిన విమానాల సంఖ్య, రీఫండ్‌లు ప్రాసెస్ చేయబడిన వాటితో సహా ఇతర సమాచారాన్ని సమర్పించాలని ఎయిర్‌లైన్‌ను కోరింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com